PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 45 సంచిక : 13 | విజయవాడ, బుధవారం 13 ఆగస్టు 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Wednesday 13 August 2025 | Rs



ఉత్కంఠ పోరులో అమరావతి రాయల్స్ గెలుపు 8



భారతీయ భావాన్ని, రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి
- ఎన్‌డిఎ కూటమిలో ఒక పార్టీగా మారిన ఇసి
- సామూహిక ఓట్ల తొలగింపు ప్రజాస్వామ్యానికి ప్రమాదం
- సదస్సులో బివి రాఘవులు 6

అన్నదాతా..కు
పిఎం కిసాన్ గండి

- ఆరు లక్షల మంది తగ్గింపు
- వారు రాష్ట్ర వాటాకే పరిమితం
- కోల్పోనున్న సెంటర్ షేర్
- సుఖీభవ లబ్ధిదారులు 46.85 లక్షలు
- కేంద్ర సాయం పడ్డ రైతులు 40.77 లక్షలు
- రెండు స్కీంల మధ్య భారీ వ్యత్యాసం



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

సూపర్ సిక్స్ పథకం అన్నదాతా సుఖీభవ-పిఎంకిసాన్ తొలి కిస్తు సొమ్మును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆగస్టు 2న స్వంత భూమి కలిగిన రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయగా, రెండు స్కీంలకు అర్హత పొందిన లబ్ధిదారుల మధ్య భారీ వ్యత్యాసం నెలకొంది. అన్నదాతా.. లబ్ధిదారుల కంటే పిఎంకిసాన్ లబ్ధిదారులు ఆరు లక్షల వరకు కుదించబడ్డారు. అన్నదాతా.. సాయానికి రాష్ట్ర వ్యాప్తంగా 46.85 లక్షల మందిని అర్హులుగా గుర్తించామని ప్రభుత్వం ప్రకటించింది. పిఎంకిసాన్ దగ్గరకొచ్చేసరికి అర్హత సాధించిన లబ్ధిదారులు 40.78 లక్షలు. పేమెంట్ సక్సెస్ అయింది 40.77 లక్షల మందికి. అర్హులైన లబ్ధిదారుల్లో దాదాపు వందకు వంద శాతం మేర పేమెంట్ సక్సెస్ అయిందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. రెండు పథకాలను కలిపి ఒకే పథకంగా అమలు చేయడం వలన ఆరు లక్షల మంది రైతులు పిఎంకిసాన్ కింద ఏటా దక్కాల్సిన రూ.6 వేలు కోల్పోతున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏటా రైతులకు చేస్తామన్న రూ.20 వేల ఆర్థిక సాయంలో పిఎంకిసాన్ సొమ్ము రూ.6 వేలు జమ కాదు. ఆ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రూ.14 వేల సాయమే అందుతుంది.

రాష్ట్ర ప్రభుత్వానిదే అయినా..

పిఎంకిసాన్‌కు లబ్ధిదారులను ఎంపిక చేసేది రాష్ట్ర ప్రభుత్వమే. కేంద్రం రూపొందించిన మార్గదర్శకాలకు లోబడి రాష్ట్ర సర్కార్ లబ్ధిదారులను గుర్తించి జాబితాలు పంపుతోంది. వడపోతల అనంతరం రాష్ట్రం పంపిన జాబితాల్లో లబ్ధిదారులకు కేంద్రం కోతలు పెడుతోంది. 2024-25లో పిఎంకిసాన్ తొలి కిస్తు 41.22 లక్షల మందికి పడింది. రెండు, మూడు విడతల్లో సైతం అంత మందికే పడ్డాయి. నిరుడు అన్నదాతా.. పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేదు. ఈ సంవత్సరం అన్నదాతాను పిఎంకిసాన్‌లో కలిపారు. రైతులకు కూటమి ఇస్తామన్న రూ.20 వేల సాయాన్ని మూడు విడతలుగా విడగొట్టారు. ఖరీఫ్‌లో పిఎంకిసాన్ రూ.2 వేలు, అన్నదాతా 5 వేలు, రబీలో పిఎంకిసాన్ 2 వేలు, అన్నదాతా 5 వేలు, వేసవిలో పిఎంకిసాన్ 2 వేలు, అన్నదాతా 4 వేలు జమ చేస్తామన్నారు. ఆ ప్రకారం ఆగస్టు 2న లబ్ధిదారులకు మొత్తం 7 వేలు పడాల్సి ఉండగా ఆరు లక్షల మందికి పిఎంకిసాన్ 2 వేలు పడలేదు. వారికి కేవలం అన్నదాతా.. 5 వేలే పడ్డాయి. కొన్నిచోట్ల అన్నదాతా పడితే పిఎంకిసాన్ పడలేదు, పిఎంకిసాన్ పడ్డవారికి అన్నదాతా.. జమ కాలేదన్న ఫిర్యాదులు పెద్ద సంఖ్యలోనే వస్తున్నాయి.

పాత విధానమే

గత వైసిపి ప్రభుత్వం పిఎంకిసాన్‌తో రైతు భరోసాను కలపడం వలన సమస్య తలెత్తింది. రైతు భరోసా లబ్ధిదారుల కంటే పిఎంకిసాన్ లబ్ధిదారుల సంఖ్య పది పన్నెండు లక్షలు తక్కువగా ఉంది. వారికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రైతు భరోసా ఒక్కటే జమ అయింది. పిఎంకిసాన్ పడలేదు. భరోసా లబ్ధిదారులు 52 లక్షలైతే పిఎంకిసాన్ లబ్ధిదారులు 40-40 లక్షలుగా కొనసాగింది. పిఎంకిసాన్‌తో సంబంధం లేకుండా వైసిపి ఎన్నికల్లో రైతులకు ఇస్తామన్న మేరకు మొత్తం పెట్టుబడి సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే ఇవ్వాలని ప్రతిపక్షంలో ఉండగా టిడిపి డిమాండ్ చేసింది. అధికారంలోకొచ్చాక పాత విధానాన్ని తెరమీదికి తెచ్చి పిఎంకిసాన్‌తో అన్నదాతాను కలిపింది. అప్పటికిమల్లే ఇప్పుడూ లక్షల్లో రైతుల సాయానికి గండి పడింది.

వాస్తవాలు, గణాంకాలతో సిద్ధంగా వుండాలి

- 'ఎస్ఐఆర్'పై ఎన్నికల కమిషన్‌కు సుప్రీం సూచన

న్యూఢిల్లీ : బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు సంబంధించిన వాస్తవాలు, గణాంకాలపై ప్రశ్నలకు సమాధానాలివ్వడానికి సిద్ధంగా వుండాలని ఎన్నికల కమిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు సూచించింది. ఇంత పెద్ద ఎత్తున చేపట్టే ఇటువంటి ప్రక్రియలో కొన్ని పొరపాట్లు, లోపాలు వుంటాయని ఇసి తరపున న్యాయవాది సుప్రీంకు తెలిపారు. త్వరలో ఎన్నికలు జరగనున్న బీహార్‌లో ప్రస్తుతం జరుగుతున్న ఎస్ఐఆర్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీం ఈ ఆదేశాలు జారీ చేసింది. 1950 తర్వాత పుట్టిన ప్రతి వ్యక్తి భారత పౌరుడేనని కానీ ప్రస్తుత ప్రక్రియలో అనేక తీవ్రమైన లోపాలు వున్నాయని ఆర్‌జెడి నేత మనోజ్ ఝా తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ అన్నారు. ఇందుకు ఉదాహరణ చెబుతూ, ఒక చిన్న అసెంబ్లీ నియోజక వర్గంలో జీవించి వున్న 12మందిని చనిపోయినట్లుగా చూపించారని, పోలింగ్ కేంద్ర అధికారి ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. ఓటర్ల జాబితా నుండి 65 లక్షల మంది పేర్లు తొలగించారని, ఇది పెద్దఎత్తున జరిగిన సామూహిక తొలగింపుల కేసు అని వ్యాఖ్యానించారు.

ఎన్నికల కమిషన్ ఏం చెప్పింది..

ఎన్నికల కమిషన్ తరపున సీనియర్ న్యాయవాది రాకేష్ ద్వివేది మాట్లాడుతూ, ఇది ముసాయిదా మాత్రమేనని, పైగా ఇంత విస్తృత స్థాయిలో జరుగుతున్నపుడు చిన్న చిన్న తప్పులు, పొరపాట్లు జరగడం సహజమని, అయితే జీవించి వున్నవారిని చనిపోయినట్లుగా ప్రకటించడమనే తప్పిదాలను సరిదిద్దవచ్చని చెప్పారు. ఈ సందర్భంగానే సరైన వివరాలు, గణాంకాలు, వాస్తవాలతో సిద్ధంగా వుండాల్సిందిగా ఇసికి సుప్రీం సూచించింది. ముసాయిదా జాబితాకు ముందు సన్నాహక చర్యలను సక్రమంగా చేపట్టలేదని, ఇది చాలా తీవ్రమైన అంశమని న్యాయమూర్తి జస్టిస్ జోమాల్యా బాగ్చి వ్యాఖ్యానించారు. చనిపోయారని తప్పుగా ప్రకటించిన వారి పేర్లను సరిచేయాలని కోర్టు సూచించింది.

ఆటో డ్రైవర్లకోసం
కొత్త పథకం !

- 'ఉచిత బస్సు'తో ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వ ఆలోచన
- అధ్యయనం చేయాలని సమీక్షలో సిఎం ఆదేశం
- విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో 'స్త్రీ శక్తి' ప్రారంభం



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్త్రీశక్తి (మహిళలకు ఉచిత బస్ ప్రయాణం) పథకం ప్రారంభంతో తమ జీవనోపాధి దెబ్బతింటుందంటూ ఆటోడ్రైవర్లలో వ్యక్తమవుతున్న ఆందోళనల నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం ఈ అంశంపై దృష్టి సారించింది. దీనిలో భాగంగా ఆటోడ్రైవర్ల కోసం ఒక కొత్త పథకాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. స్త్రీ శక్తి పథకం ఈ నెల 15వ తేది నుండి ప్రారంభం కానుండగా, ఆటోడ్రైవర్లకోసం రూపొందించే కొత్త పథకం ఎలా ఉంటుందో, విధి విధానాలు ఏమిటో, ఎప్పటి నుండి ఆ పథకం అమలులోకి వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఉచిత బస్సు పథకంపై మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో చంద్రబాబునాయుడు ఆటోడ్రైవర్ల అంశాన్ని ప్రస్తావించారు. ఆటోడ్రైవర్లకోసం ఇప్పటికే ఉన్న కేంద్ర, రాష్ట్ర పథకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర పథకాలతో కలిపి కొత్త పథకం రూపొందించాలని, దీనికోసం సమగ్ర అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులు అధ్యయనం పూర్తి చేసి, ప్రతిపాదనలు సమర్పించిన తరువాత ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. దీనికేమీ నిర్దిష్ట గడువును రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించలేదు. మరోవైపు స్త్రీ శక్తి పథకాన్ని ఈ నెల 15న విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండులో ప్రారంభించనున్నట్లు సిఎం చంద్రబాబునాయుడు ఈ సమీక్షలో వెల్లడించారు. ఈ పథకం అమల్లో ఎటువంటి లోపాలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఉచిత బస్ ప్రయాణ పథకంతో ప్రయాణికుల రద్దీకి అవకాశం ఉండటంతో ట్రాఫిక్ నిర్వహణ సమర్థంగా చేయాలన్నారు. అందుకు తగ్గట్లు సామర్థ్యం పెంచుకోవాలని, ఎక్కడా ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ఉచిత బస్ ప్రయాణంపై ఎప్పటికప్పుడు ప్రయాణికుల వద్ద నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవడంతో పాటు అందుకు తగ్గట్లు మెరుగైన ఆలోచనలు చేసి పథకాన్ని ముందుకు తీసుకెళ్ళాలన్నారు. ఇ పోస్ మిషన్లకు జిపిఎస్ తప్పనిసరిగా ఎనేబుల్ చేసి ట్రాక్ చేయడం ద్వారా ప్రయాణికులకు సమాచారాన్ని అందించాలన్నారు. ఆర్‌టిజిఎస్‌తో అనుసంధానమై పనిచేయాలన్నారు. టాయిలెట్లను ప్రతి 2 గంటలకొకసారి శుభ్రపరచాలన్నారు. అన్ని బస్‌స్టేషన్లలో తాగునీటి కోసం ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని, రూ.30 కోట్లతో చేపట్టిన బస్‌స్టేషన్ల మరమ్మతులు, పెయింటింగ్ పనులు ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేయాలని సిఎం అధికారులను ఆదేశించారు. రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులు అదనంగా నడపాల్సి రావడంతో బస్సులు ఎక్కడా బ్రేక్ డౌన్ కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ప్రచారార్భాటం కోసమే పి-4

- ఈ పథకం ద్వారా పేదరికం ఎలాపోతుందో సిఎం చెప్పాలి
- దేశంలో కార్పొరేట్, మతతత్వ పాలన : వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- కదిరి టౌన్

ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పి-4 పేరుతో పేదరికాన్ని దూరం చేస్తామంటూ పదేపదే చెప్తున్న మాటలు కేవలం ప్రచార ఆర్భాటమే తప్ప, వాస్తవానికి చాలా దూరంగా ఉన్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. సిపిఎం శ్రీసత్యసాయి జిల్లా మహాసభ కదిరిలో మంగళవారం జరిగింది. పట్టణంలోని ఎన్‌జిఒ హోంలో కామ్రేడ్ బడా సుబ్బిరెడ్డి, కామ్రేడ్ పోలా రామాంజనేయులు ప్రాంగణంలో ప్రతినిధుల సభ కొనసాగింది. ముఖ్యఅతిథిగా హాజరైన వి.శ్రీనివాసరావు విలేకర్లతో మాట్లాడారు. పి-4 జపం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు... దానివల్ల ప్రజలకు ఏమి మేలు జరుగుతుందో చెప్పాలన్నారు. అధికారులపై ఒత్తిడి చేయడం తప్ప, ఇందులో ప్రభుత్వం భాగస్వామ్యం ఏమీలేదని వివరించారు. బలవంతంగా మార్గదర్శులను తీసుకొచ్చి బంగారు కుటుంబాలుగా ఎంపిక చేసుకుని సహాయం అందించడం కన్నా, పేదల జీవనోపాధిని పెంచేలా ప్రభుత్వం చేయూతనివాల్సి ఉందని తెలిపారు. రేషన్ షాపుల ద్వారా పేదలకు సన్నబియ్యం ఇవ్వకుండా నాణ్యతలేని బియ్యాన్ని ఇస్తోందన్నారు. గత ప్రభుత్వంలో రేషన్ బియ్యం పంపిణీలో జరిగిన అవినీతిని అరికట్టడానికి చర్యలు తీసుకుంటామంటామని చెప్పిన టిడిపి కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం మాదిరిగానే వ్యవహరించడం ఏమిటని నిలదీశారు. రేషన్ షాపుల ద్వారా నాణ్యమైన సన్నబియ్యం అందిస్తే పేదలు ఎందుకు వాటిని అమ్ముకుంటారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ హామీల్లో మూడు మాత్రమే అమలయ్యాయని, మిగిలిన వాటినీ పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 15న ప్రారంభం కానున్న మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి ఎలాంటి నిబంధనలూ విధించరాదన్నారు. దేశంలో కార్పొరేట్, మతతత్వ పాలన సాగుతోందని వివరించారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ అడుగులకు మడుగులొత్తుతూ చంద్రబాబు రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారని తెలిపారు.

దొంగ ఓట్లు, అమెరికా టారిఫ్‌లపై ప్రధాని మౌనం

ప్రస్తుతం దేశాన్ని రెండు ప్రధాన సమస్యలు వెంటాడుతున్నాయని వి.శ్రీనివాసరావు అన్నారు. అందులో ఒకటి దొంగ ఓట్లు, రెండవది భారత దేశంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టారిఫ్‌ల మోత అని తెలిపారు. ఈ రెండు సమస్యలపై ప్రధాని నరేంద్ర మోడీ మౌనం దాల్చడం సిగ్గుచేటన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు, ప్రజాస్వామ్య వ్యవస్థను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో కర్ణాటక రాష్ట్రం బెంగళూరు సిటీ మహదేవపురం నియోజకవర్గంలో లక్షపైచిలుకు దొంగ ఓట్లు సృష్టించారని, ఈ వ్యవహారంపై మిగతా 7లో

కోస్తాకు భారీ వర్ష సూచన

- విపత్తుల నిర్వహణ శాఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బంగాళాఖాతంలో కొనసాగుతోన్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో నేడు అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి ప్రఖర్‌జైన్ తెలిపారు. రానున్న 48 గంటల్లో ఇది బలపడే సూచనలు ఉన్నాయని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీని ప్రభావంతో రానున్న రెండు రోజులు కోస్తాంధ్రలో పలుచోట్ల భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. శనివారం వరకూ మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని సూచించారు. బుధవారం నాడు పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో పలుచోట్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, తూర్పుగోదావరి, నంద్యాల జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. గురువారం నాడు కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు.

పంజాబ్‌లో భూ సమీకరణ పాలసీ రద్దు
- నిర్ణయించిన ప్రభుత్వం
2
రోడ్డుపై కూర్చుంటే యూరియా వస్తుందా..!
- రైతులపై ఎఓ చిందులు

'ఉప'పోరు ఉద్రిక్తం



ఎర్రగుంట్లలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న ఎంపి అవినాష్‌రెడ్డి

- ఒంటిమిట్ట, పులివెందుల జడ్‌పిటిసి ఎన్నికల్లో దాడులు, దౌర్జన్యాలు, దొంగఓట్లు
- కడప ఎంపి, ఎమ్మెల్సీ అరెస్ట్, మండలి డిప్యూటీ మాజీ ఛైర్మన్ గృహ నిర్బంధం

ప్రజాశక్తి- కడప ప్రతినిధి, అమరావతి బ్యూరో

వైఎస్ఆర్ కడప జిల్లాలో జడ్‌పిటిసి ఉప ఎన్నికల్లో ఉద్రిక్తత చేసుకుంది. ఒంటిమిట్ట, పులివెందుల జడ్‌పిటిసి స్థానాలకు మంగళవారం పోలింగ్ జరిగింది. దొంగఓట్లు, బెదిరింపులు, ఏజెంట్లపై దాడులు, దౌర్జన్యాలు, నిరసనలు, బైఠాయింపులు, టిడిపి, వైసిపి నేతల మధ్య వాగ్వివాదాలు చోటుచేసుకున్నాయి. వైసిపి ఎంపిని, జిల్లా నాయకులను పోలీసులు అరెస్టు చేయడంతో వాతావరణం వేడెక్కింది. పోలింగ్ సమయానికి ముందుగానే పులివెందులలో కడప ఎంపి వైఎస్.అవినాష్‌రెడ్డి, టిడిపి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిలను పోలీసులు అరెస్టు చేసి తొలుత కడప, ఆ తర్వాత ఎర్రగుంట్ల తరలించారు. అనంతరం వారిని విడిచి పెట్టారు. దీంతో, ఎంపి అవినాష్‌రెడ్డి మధ్యాహ్నానికి పులివెందుల చేరుకున్నారు. వేంపల్లిలో పోలీసులు మండలి డిప్యూటీ మాజీ ఛైర్మన్ ఎస్‌వి.సతీష్‌రెడ్డిని గృహనిర్బంధం చేశారు. సాలాబాద్, నడింపల్లి, మంటపంపల్లి, చింతరాజుపల్లి పంచాయతీ గాండ్లపల్లి పోలింగ్ బూత్‌లో వైసిపి, టిడిపి ఏజెంట్లు, నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

మంత్రిపై ఒంటిమిట్ట వైసిపి అభ్యర్థి ఫిర్యాదు

పోలింగ్ పర్యవేక్షణకు వచ్చిన జాయింట్ కలెక్టర్ అతిధి సింగ్‌కు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిపై ఒంటిమిట్ట వైసిపి అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి ఫిర్యాదు చేశారు. తమ పార్టీ ఏజెంట్లను, తనను మంత్రి బెదిరించారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇక్కడ రీపోలింగ్ నిర్వహించాలని, లేకపోతే తాను ఆత్మహత్య చేసుకుంటానని ఆందోళనకు దిగారు. చిన్నకొత్తపల్లి పోలింగ్‌బూత్ పరిశీలన అనంతరం ఒంటిమిట్ట మీదుగా వెళ్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని స్థానిక ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథరెడ్డి, మాజీ డిప్యూటీ సిఎం అంజాద్ బాషా, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు నిలదీశారు. అప్రజాస్వామిక వైఖరి సరికాదంటూ ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని వైసిపి నేతలను అదుపులోకి తీసుకున్నారు. వైసిపి జడ్‌పిటిసి అభ్యర్థి ఇరగంరెడ్డితో కలిసి మిగతా 7లో

రాష్ట్రంలో సెమీ కండక్టర్ ప్రాజెక్టు

- ఒడిశా, పంజాబ్‌లో కూడా
- కేంద్ర మంత్రివర్గం నిర్ణయం

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో నాలుగు కొత్త సెమీ కండక్టర్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్ సహా ఒడిశా, పంజాబ్‌లో సెమీ కండక్టర్ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్రమంత్రి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాతో మాట్లాడుతూ మొత్తంగా రూ.4,594 కోట్ల వ్యయంతో సెమీ కండకర్ల యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే, పట్టణ రవాణాను మరింత బలోపేతం చేసేలా ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో మెట్రో ఫేజ్ 1బి నిర్మాణానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. ఇందుకోసం రూ.5,801 కోట్లతో ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. అరుణాచల్‌ప్రదేశ్‌లో 700 మెగా వాట్ల జలవిద్యుత్ ప్రాజెక్టుకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. తాజా నిర్ణయంతో దేశంలో సెమీ కండక్టర్ ఎకో సిస్టమ్ గణనీయంగా వృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. దేశంలో ఇప్పటికే ఆరు సెమీ కండక్టర్ ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని, కొత్తగా ఏర్పాటు చేయబోమే యూనిట్లతో వీటి సంఖ్య మొత్తంగా 10కి చేరనుం దని మంత్రి తెలిపారు. ఎలక్ట్రానిక్ తయారీ ఎకోసిస్టమ్‌కు ఉత్ప్రేరకంగా పనిచేయడం ద్వారా ఇవి పరోక్షంగానూ అనేక ఉద్యోగాల కల్పనకు దోహదం చేస్తాయన్నారు.

ప్రధానికి చంద్రబాబు, లోకేష్ కృతజ్ఞతలు

రాష్ట్రానికి సెమీకండక్టర్ పరిశ్రమ కేటాయించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర ఐటి, ఉన్నత విద్య శాఖల మంత్రి నారా లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్‌కు సిఎం చంద్రబాబు నాయుడు ఫోన్ చేసి యూనిట్ ఇవ్వడంపై ప్రధాని మోడీ, కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. చిప్ ప్యాకేజింగ్‌తో బ్యాకెండ్ సెమీకండక్టర్ తయారీ సామర్థ్యం పెరుగుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో పూర్తి ఎలక్ట్రానిక్స్ పర్యావరణ వ్యవస్థను సెమీ కండక్టర్ల యూనిట్ ద్వారా పెంపొందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సెమీకండక్టర్లను మొబైల్ ఫోన్లు, సెట్ టాప్ బాక్సులు, ఆటోమొబైల్స్, ఇతర ఎలక్ట్రానిక్ అప్లికేషన్స్‌లో ఉపయోగిస్తారని.. తద్వారా ఆత్మనిర్భర భారత్‌కు ఈ ప్రాజెక్టు ఎంతో దోహదపడుతుందని లోకేశ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో దక్షిణ కొరియాకు చెందిన అపాక్ట్ కంపెనీ సెమీ కండక్టర్ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. రూ.468 కోట్ల పెట్టుబడితో మొబైల్స్, సెట్‌టాప్ బాక్సులు, ఆటోమోటివర్ ఇసియు, గృహ వినియోగ ఎలక్ట్రానిక్ పరికరాలను ఉత్పత్తి చేయనున్నారు.

31 నామినేటెడ్ పోస్టులు భర్తీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కూటమి ప్రభుత్వం మరోసారి నామినేటెడ్ పోస్టులు భర్తీ చేసింది. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ దఫా 31 కులాలకు సంబంధించిన నామినేటెడ్ ఛైర్మన్ పోస్టులను విడుదల చేయగా, అందులో ఒసి-6, బిసి-17, ఎస్‌సి-4, ఎస్‌టి-1, మైనార్టీ-2 పదవులు కేటాయించారు. వీరందరూ బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. పదవులు పొందిన వారిలో బహుజన జెఎసికి 1, బిజెపికి హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్టు ఛైర్మన్ పదవి కేటాయించారు. జనసేనకు 3 పదవులు కేటాయించగా, అందులో ఎపి వడ్డీల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్, జానపద కళలు, సృజనాత్మక అకాడమీ ఛైర్మన్ పదవులు వరించాయి. మిగిలిన పదవులన్నీ తెలుగు దేశం పార్టీకి కేటాయించారు.

'ఆశ'లు నెరవేరాయి

- గ్రాట్యూటీ చెల్లింపు
- ఉద్యోగ విరమణ వయోపరిమితి పెంపు
- 180 రోజుల వేతనంతో మెటర్నిటీ లీవు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైద్యారోగ్యశాఖలో పనిచేస్తున్న ఆశా వర్కర్లకు వేతనంతో కూడిన మెటర్నిటీ లీవు, ఉద్యోగ విరమణ వయసు పెంపు, గ్రాట్యూటీ ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మెటర్నిటీ లీవులో భాగంగా 180 రోజులు వేతనంతో కూడిన సెలువుకు అవకాశం, ఉద్యోగ విరమణ వయోపరిమితిని 62 ఏళ్లకు పెంపు, రూ.1.50 లక్షల గ్రాట్యూటీని చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆశా వర్కర్ల పోరాట ఫలితం

రాష్ట్రంలో 40 వేల మందికిపైగా ఉన్న ఆశా వర్కర్లు గత కొన్నేళ్లుగా నిర్బంధాలను, అరెస్టులను ఎదుర్కొని నిర్వహించిన రాజీలేని పోరాటం ఫలితంగా ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం ముందుకొచ్చింది. ఆశా వర్కర్లకు రూ.1.50 లక్షల గ్రాట్యూటీ, ఆరు నెలల వేతనంతో కూడిన ప్రసూతి సెలవు, ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచినట్లు ఎపి ఆశా వర్కర్ల యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి తెలిపారు. ఇందుకు సంబంధించి మంగళవారం ఉత్తర్వులు విడుదల జారీ చేయడం పట్ల ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును, వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని పలు దఫాలు మిగతా 7లో

రోడ్డుపై కూర్చుంటే యూరియా వస్తుందా..!

రైతులపై ఎఒ చిందులు

ప్రజాశక్తి - కౌతాళం

కర్నూలు జిల్లా కౌతాళం మండలంలోని రైతులు యూరియా కోసం ఆందోళనకు దిగారు. 20 రోజులుగా యూరియా ఇవ్వకపోవడంతో రహదారిపై బైఠాయించారు. ఆందోళన వద్దకు వ్యవసాయ అధికారి (ఎఒ) శేషాద్రి వచ్చి రైతులపై చిందులు తొక్కారు. 'రోడ్డుపై కూర్చుంటే యూరియా వస్తుందా, నీకు టోకెన్ ఎవరు ఇచ్చారు..? ఆ టోకెన్ ఎవరు రాశారు..?' అని ఓ రైతు నుంచి టోకెన్ తీసుకొని చించివేశారు. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎఒను నిలదీశారు. ఉదయం నుంచి యూరియా కోసం ఇక్కడ కూర్చుంటే 'మీరు చెప్పే సమాధానం ఇదేనా' అంటూ ప్రశ్నించారు. 23 రోజుల క్రితం 1200 బస్తాలకు టోకెన్లు ఇచ్చారని, కేవలం 560 బస్తాలు మాత్రమే స్టాక్ ఉండడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుకు రెండు, మూడు బస్తాలు మాత్రమే అందిస్తామని ఎఒ చెప్పడంతో మరోసారి రైతులు ఆగ్రహించారు. పెద్ద రైతులకు 50, 100 బస్తాలు అందించి తమకు రెండు బస్తాలు మాత్రమే ఇస్తారా? అంటూ నిలదీశారు. రెండు రోజుల్లో వ్యాగన్ వస్తుందని, యూరియాను అందరికీ అందిస్తామని చెప్పి ఎఒ అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో రైతులు తమ ఆందోళనను విరమించారు.


రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న రైతులు



సిపిఎం శ్రీ సత్యసాయి జిల్లా కార్యదర్శిగా రామకృష్ణ

ప్రజాశక్తి-కదిరిటౌన్

సిపిఎం శ్రీ సత్యసాయి జిల్లా మహాసభలో మంగళవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా రామకృష్ణ ఎంపికయ్యారు. ఆయనతో పాటు 11 మందిని నూతన కమిటీకి ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ సభ్యులుగా జెడ్‌పి శ్రీనివాసులు, ఇఎస్.వెంకటేష్, జిఎల్.నరసింహులు, లక్ష్మీనారాయణ, దిల్షాద్, పెనుగొండ హరి, జంగాలపల్లి పెద్దన్న, జగన్మోహన్, ప్రవీణ్ కుమార్, శ్రీదేవిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రజా, కార్మిక, వ్యవసాయ రంగ సమస్యలపై పోరాటాలు చేస్తామని తెలిపారు.

ఒంగోలు పోలీసు స్టేషన్‌లో విచారణకు హాజరైన రామ్‌గోపాల్‌వర్మ

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ప్రముఖ సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ మంగళవారం ప్రకాశం జిల్లా ఒంగోలు పోలీసు స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ను ఒంగోలు రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ బాబు విచారించారు. చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్, లోకేష్‌ను మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాలలో వివాదాస్పద పోస్టులు పెట్టారు. దీంతో, టిడిపి నాయకుడు రామలింగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు 2024 నవంబర్ 10న మద్దిపాడు పోలీసు స్టేషన్‌లో రామ్‌గోపాల్‌వర్మపై కేసు నమోదైంది. వ్యూహం సినిమా కోసం ఎపి ఫైబర్ నెట్ నుండి రామ్‌గోపాల్ వర్మకు గత వైసిపి ప్రభుత్వం రూ.2 కోట్లు చెల్లించిందని, వైసిపి నేతల సూచనల మేరకే వ్యూహం సినిమాలో టిడిపి ప్రధాన నేతల పాత్రలను రూపొందించారని, అందుకు ప్రతిఫలంగానే ఫైబర్ నెట్ ద్వారా రూ.2 కోట్లు వర్మకు ముట్టిందని టిడిపి నాయకులు ఆరోపిస్తున్నారు. ఆ నగదు వ్యవహారంలోనూ రామ్‌గోపాల్‌వర్మను విచారిస్తున్నారు. ఫొటోలు మార్ఫింగ్ చేయడం వెనుక ఉన్న వారి గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు.

పనుల పురోగతి కనిపించాలి

- బెస్ట్ లివబుల్ సిటీగా అమరావతిని నిర్మించాలి
- సిఆర్‌డిఏ, రాజధానిపై సమీక్షలో సిఎం ముఖ్యమంత్రి



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని నిర్మాణ పనుల పురోగతి ప్రజలకు కన్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. రాష్ట్ర సచివాలయంలో ఆయన మంగళవారం సిఆర్‌డిఏ, రాజధాని పనుల నిర్మాణంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్మాణ సంస్థలు పనులను పరుగులు పెట్టించాలని, నాణ్యతలో రాజీపడొద్దని, పురోగతి ప్రజలకు కనిపించాలని అన్నారు. సమయం ప్రకారం పనులు పూర్తి కాకపోతే కాంట్రాక్టు సంస్థతోపాటు అధికారులూ బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రపంచంలోనే బెస్ట్ లివబుల్ సిటీగా అమరావతిని నిర్మించాలని, ఆ మేరకు రికార్డు టైమ్‌లో పనులు పూర్తి చేయాలని చెప్పారు. ఆటోపైలట్ మోడ్‌లో పనులు జరగాలని అన్నారు. రిటర్నబుల్ ప్లాట్ల విషయంలో రైతులకు ఇబ్బంది లేని విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల విజ్ఞప్తులను పరిశీలించి మాస్టర్‌ప్లాను ప్రభావితం కాకుండా ఆయా సమస్యలను పరిష్కరించాలని అన్నారు. గతంలో తీసుకువచ్చిన ఇసుప సామాన్లు తుప్పు పట్టిపోయాయని, ఇసుకను కూడా ఎత్తుకుపోయారని సమీక్షలో పాల్గొన్న కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు సిఎం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన సిఎం వెంటనే ఇసుకను ఏర్పాటు చేయాలని మైనింగ్ అధికారులను ఆదేశించారు. కార్యాలయాలు నిర్మించనున్న సంస్థలకు వెంటనే అనుమతులు ఇవ్వాలని సూచించారు. బిట్స్ పిలానీ, ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐ సంస్థలకు త్వరగా భూములు కేటాయించాలని సూచించారు. ఇప్పటి వరకూ రాజధాని ప్రాంతంలో భూములిచ్చిన 72 సంస్థలు ఏ మేరకు నిర్మాణం చేపడుతున్నాయో నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. వాటికి అనుసంధానంగా పెట్టుబడులూ వచ్చేలా చూడాలన్నారు. ఆర్థిక కార్యకలాపాలూ పెద్దఎత్తున జరగాలని సిఎం సూచించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటేనే అమరావతి నివాసయోగ్యంగా ఉంటుందని, నగరాన్ని గ్రీన్ ఎనర్జీ కారిడార్‌గా మార్చాలని పేర్కొన్నారు.

రూ.81,317 కోట్ల ప్రతిపాదన

రాజధాని అభివృద్ధి పనులకు సంబంధించి సిఆర్‌డిఏ ముఖ్యమంత్రి వద్ద అదనపు ప్రతిపాదనలు చేసింది. గతంలో ఉన్న పనులతో కూడా కలిపి మొత్తం రూ.81,713 కోట్ల విలువైన పనులు చేపట్టాల్సి ఉందని సిఎంకు సిఆర్‌డిఏ అధికారులు వివరించారు. అమరావతి రాజధాని నిర్మాణం సమయంలో తొలుత రూ.32 వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. అనంతరం రూ.46 వేల కోట్లకు పెరిగింది. 2019లో టిడిపి ప్రభుత్వం అధికారం కోల్పోవడంతో పనులు నిలిచిపోయాయి. 2024లో అధికారంలోకి వచ్చిన తరువాత పనులను పరిశీలించి రూ.64 వేల కోట్లు ఖర్చవుతాయని లెక్కగట్టారు. దీనిలో రూ.50,552 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచినట్లు వివరించారు. అయితే కొత్తగా చేపట్టబోయే పనులు, ధరల పెరుగుదల అంచనా తదితర కారణాలతో ప్రస్తుతం రూ.81,713 కోట్ల విలువైన పనులు చేపట్టాల్సి ఉంటుందని సిఎంకు అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణ, పురపాలక అధికారులతోపాటు పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు కూడా హాజరయ్యారు. రాజధానిలో ప్రస్తుతం రూ.50,552 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచారని, 74 పనులు ప్రారంభమయ్యాయని అధికారులు ఈ సమావేశంలో వివరించారు.

శ్రీశైలానికి భారీగా వరద

- నాలుగు గేట్ల ద్వారా నీరు విడుదల

ప్రజాశక్తి- శ్రీశైలం ప్రాజెక్టు,గుంటూరు జిల్లా ప్రతినిధి

కృష్ణా నది పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో నాలుగు రేడియల్ క్రస్ట్ గేట్లను పది అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాయంత్రం ఆరు గంటల సమయానికి జూరాల నుంచి 99,185 క్యూసెక్కులు, సుంకేసుల నుండి 52,548 క్యూసెక్కులు, హంద్రీ ద్వారా 5640 క్యూసెక్కుల వరద శ్రీశైలానికి వచ్చి చేరుతోంది. అదే సమయానికి జలాశయ నీటిమట్టం 885 అడుగులకుగాను ప్రస్తుతం 883 అడుగులకు చేరింది. నీటి నిలువ సామర్థ్యం 215 టిఎంసిలకు గాను ప్రస్తుతం 204.352 టిఎంసిలుగా నమోదయింది. కుడి, ఎడమ విద్యుత్తు కేంద్రాల ద్వారా, శ్రీశైలం నాలుగు గేట్ల ద్వారా కలిపి మొత్తంగా నాగార్జునసాగర్‌కు 1,74,317 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

సాగర్ 18 గేట్లు ఎత్తివేత

ఎగువ నుంచి నాగార్జున సాగర్‌కు వరద ప్రవాహం కొనసాగుతుండడంతో 26 గేట్లలో 18 గేట్లను ఎత్తి 1.86 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్ జలాశయం గరిష్ట నీటి మట్టం 590 అడుగులు కాగా, మంగళవారం రాత్రి ఎనిమిది గంటలకు 589.5 అడుగులకు చేరింది. గరిష్ట నీటి నిల్వ 312 టిఎంసిలు కాగా ప్రస్తుతం 310.55 టిఎంసిల నీటి నిల్వ ఉంది. నాగార్జున సాగర్ నుంచి దిగువకు వరద ప్రవాహం కొనసాగుతుండడంతో పులిచింతలకు వరద పోటు పెరిగింది. 1.80 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండడంతో రెండు లక్షల క్యూసెక్కులను దిగువ ప్రకాశం బ్యారేజీకి విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీ నుంచి లక్ష క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.

లూలూకు భూకేటాయింపులు రద్దు చేయండి

- విశాఖలో ప్రజాసంఘాల, పౌర సంస్థల సమావేశం తీర్మానం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ ఆర్‌కె.బీచ్‌లో చట్టవిరుద్ధంగా 13.78 ఎకరాల భూమిని విదేశీ సంస్థ లూలూకు మాల్ కోసం కేటాయించడం దారుణమని, తక్షణమే ఆ కేటాయింపులను రద్దు చేయాలని విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జరిగిన ప్రజా సంఘాల, పౌర సంస్థల సమావేశం తీర్మానం చేసింది. ఆ భూముల్లో ప్రజలకు విజ్ఞానాన్ని అందించే సైన్స్ సిటీని నిర్మించాలని కోరింది. సమావేశంలో పాల్గొన్న ప్రముఖ సామాజికవేత్త రాణి శర్మ మాట్లాడుతూ స్వలాభం కోసం విశాఖ బీచ్ మొత్తాన్ని వ్యాపారంతో డంపింగ్ యార్డుగా మార్చబోతున్నారని విమర్శించారు. తీర సహజ సిద్ధ ప్రకృతి అందాలను ధ్వంసం చేయనున్నారని తెలిపారు. ఈ ఒప్పందంలో వందల కోట్ల రూపాయలు చేతులు మారాయని విమర్శించారు. విశాఖ ప్రజలందరూ టిడిపి కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు సర్కారు లూలూ మాల్‌కు ఆయాచిత లబ్ధి చేకూరుస్తోందని, సిఆర్‌జెడ్ నిబంధనలను తుంగలో తొక్కుతోందని తెలిపారు. సిపిఎం కార్పొరేటర్ బి.గంగారావు సమన్వయంతో సాగిన ఈ సమావేశంలో సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మథ రావు, హెచ్‌ఆర్‌ఎఫ్ నాయకు రాలు అనురాధ, విశాఖ దళిత సంఘం (విదసం) జిల్లా కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు, పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు ఎస్.వెంకటలక్ష్మి, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి వనజాక్షి, వార్వా ప్రధాన కార్యదర్శి బిబి.గణేష్, న్యాయవాదులు పాకా సత్యనారాయణ, ఎన్.వెంకటేశ్వరరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం.చంటి పాల్గొన్నారు.

దళిత శ్మశాన వాటికల్లో బలవంతపు రోడ్లు నిర్మాణ యత్నం ఆపాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డిప్యూటీ స్పీకరు రఘురామ కృష్ణరాజు నియోజకవర్గంలో దళితులపై జరుగుతున్న అమానుష దాడులు, ఘర్షణలను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా, ఉండి మండలం, పాములపర్రులోని దళితుల శ్మశాన వాటికలో పక్క గ్రామమైన కోలమూరుకు చెందిన ఆక్వా రైతుల కోసం ఆఘుమేఘాలమీద పంచాయతీ తీర్మానాలను సైతం రాత్రికి రాత్రే మార్చి రోడ్డు నిర్మాణ ప్రయత్నం చేయడం అన్యాయమన్నారు. పక్షపాత సర్వేను అడ్డుకున్న దళితులపై పోలీసులు విచక్షణారహితంగా విరుచుకుపడ్డారన్నారు. డిప్యూటీ స్పీకరు ఆదేశాలతో సర్వే బృందాలు, నలుగురు సిఐలు, ఎస్‌ఐలు, ఎఎస్‌ఐలు, మహిళా పోలీసులు, కానిస్టేబుళు పెద్దయెత్తున రంగంలోకి దింపి ఆ ప్రాంతమంతా రణరంగంగా మార్చి, తీవ్ర ఘర్షణ చోటుచేసుకోవడానికి కారణమయ్యారని పేర్కొన్నారు. ఈ విషయంలో హోంశాఖ మంత్రి, ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ కెఎస్ జవహర్ జోక్యం చేసుకుని దళితులకు న్యాయం చేయాలని కోరారు.

చందానగర్ ఖజానా జ్యువెలరీ షాప్‌లో దోపిడి

- షాప్ సిబ్బందిపై కాల్పులు
- పోలీసుల రాకతో పరార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్-ముంబై జాతీయ రహదారి పక్కనున్న ఖజానా జ్యువెలరీ షాప్‌లో భారీ దోపిడీకి పాల్పడ్డారు. షాప్ సిబ్బందిపై కాల్పులు జరిపారు. పోలీసులు రావడంతో అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి ఘటనా స్థలానికి చేరుకుని సిబ్బందితో మాట్లాడారు. అనంతరం సిసి కెమెరాలను పరిశీలించి కేసుకు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. చందానగర్ జాతీయ రహదారి పక్కనున్న ఖజానా జ్యువెలరీ షోరూం ప్రతిరోజూ లాగానే మంగళవారం ఉదయం 10:30 గంటలకు తెరిచారు. తెరిచిన ఐదు నిమిషాల్లోనే ఆరుగురు దుండగులు లోపలికి ప్రవేశించారు. ఒక దుండగుడు షోరూమ్‌లోకి ముందే వచ్చి రెక్కీ నిర్వహించి వెళ్లినట్టు సిసి ఫుటేజ్‌ని బట్టి తెలుస్తోంది. లోపలికి ప్రవేశించిన దుండగులు వారి వద్ద ఉన్న గన్‌తో షోరూం సిబ్బందిని బెదిరించి కాల్పులు జరిపారు. అసిస్టెంట్ మేనేజర్ సతీష్ కాలులోకి బుల్లెట్ దూసుకెళ్లింది. దీంతో షోరూం సిబ్బంది భయపడి పరుగులు పెట్టారు. బంగారం ఉన్న అల్మార తాళం చెవి ఎక్కడని అసిస్టెంట్ మేనేజర్ సతీష్‌ను దుండగులు బెదిరించారు. ఘటనా స్థలంలో రెండు రౌండ్లు కాల్పులు జరిపారు. ఒకటి అసిస్టెంట్ మేనేజర్ సతీష్ కాలిపై, రెండవది షో రూమ్‌లో రూఫ్‌పైకి కాల్పులు జరిపారు. ఈ సమయంలోనే సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల రాకను గమనించిన దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. వెండి వస్తువులు దోచుకెళ్లారు. బంగారు ఆభరణాలు చోరీకి గురి కాలేదు. వెండి చోరీ ఎంత జరిగింది అనేది స్పష్టత రావాల్సి ఉంది. దుండగుల వద్ద మూడు తుపాకులు ఉన్నట్టుగా షాప్ సిబ్బంది చెప్పిన వివరాలను బట్టి తెలుస్తోంది. నిందితులను పట్టుకునేందుకు పోలీసులు ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల జిల్లాల పోలీసులను, టోల్ గేట్ల వద్ద కూడా ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టారు. నిందితులు ఎవరు..? ఎక్కడి నుంచి వచ్చారనే దానిపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నామని సీపీ తెలిపారు.

ఆక్వా ఉత్పత్తులు ఎంపెడాతో ప్రస్తుత ధరలకే కొనుగోలు చేయాలి

- అమెరికా ఆంక్షలను కేంద్రం తిప్పికొట్టాలి
- సుంకాలకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న బి బలరామ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆక్వా ఉత్పత్తులను ఎంపెడా ఆధ్వర్యాన గ్యారెంటీ ఇచ్చి ప్రస్తుత ధరలకు తక్కువ కాకుండా పూర్తిగా కొనుగోలు చేయాలని, అమెరికా ఆంక్షలను కేంద్రం తిప్పి కొట్టాలని, అమెరికా సుంకాలకు వ్యతిరేకంగా రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రంపై ఒత్తిడి తేవాలని రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు సూచించారు. విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో 'భారత్‌పై అమెరికా సుంకాలు - ఆక్వా రంగంపై ప్రభావం' అనే అంశంపై ఆక్వా రైతు సంఘం, ఎపి రైతు సంఘం, కౌలు రైతు సంఘం సంయుక్త ఆధ్వర్యాన మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆక్వా రైతు సంఘం నాయకులు బి బలరామ్ మాట్లాడుతూ.. ప్రపంచీకరణ నేపథ్యంలో డబ్ల్యుటిఒ ఒప్పందాల వల్ల పూర్తిగా వ్యవసాయ ఆధారిత దేశం కావడంతో తీవ్రంగా నష్టపోతామని ఆనాడే ప్రభుత్వాలకు సూచించడం జరిగిందని, ఇప్పుడు దాని ప్రభావం ఈ రూపంలో కనిపిస్తుందన్నారు. ప్రస్తుతం ఆక్వా రంగం కష్టకాలంలో ఉందని చెప్పారు. అమెరికా అధ్యక్షులు ట్రంప్ సుంకాలు విధించడం దారుణమైన చర్యగా అభివర్ణించారు. ఆక్వా రంగాన్ని వ్యవసాయ రంగంగా గుర్తించాలని ప్రభుత్వాన్ని గతంలోనే డిమాండ్ చేసినట్లు చెప్పారు. అమెరికా మన దేశం ఎగుమతులపై భారీ సుంకాలు విధించడం వల్ల వ్యవసాయం, అనుబంధ రంగాలపై తీవ్ర ప్రభావం నెలకొందన్నారు. మరోవైపు సుంకాలు అమలు ప్రారంభం కాకపోయినా రాష్ట్రంలో వ్యాపారులు అన్ని కౌంట్ రొయ్యల ధరలు తగ్గించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నట్లు చెప్పారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బాధ్యతలు సక్రమంగా నిర్వహించడం లేదని విమర్శించారు. రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌ను అంగీకరించాలని కేంద్ర ప్రభుత్వంపై అమెరికా ఒత్తిడి తెస్తోందన్నారు. దీనిని అంగీకరిస్తే వ్యవసాయ రంగం తీవ్రంగా నష్టపోతుందని తెలిపారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు మాట్లాడుతూ.. అమెరికా సుంకాల కారణంగా ఆక్వా ఎగుమతులు నిలిచిపోవడం వల్ల జిడిపిపై 1 శాతం వరకూ తగ్గేందుకు అవకాశం ఉంటుందని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేచి చూసే ధోరణి తప్ప, తగిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడుతున్నారని చెప్పారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి మాట్లాడుతూ.. ఆక్వా రంగం క్యాపిటల్ ఇండస్ట్రీగా మారిపోయిందన్నారు. చిన్న రైతులు సహకార విధానాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఆక్వా రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఆక్వా రైతుల నిరసనలకు సిఐటియు సంపూర్ణ మద్దతు ప్రకటించడంతోపాటు ప్రత్యేక్షంగా పాల్గొంటారని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ.. ఆక్వా రైతుల పోరాటానికి వ్యవసాయ కార్మిక సంఘం అండగా ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తూ.. సమావేశంలో తీర్మానించిన అంశాలను రాయబారం రూపంలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, 14వ తేదీన జరిగే సమావేశంలో చర్చించేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు అందించాలని, స్థానికంగా సదస్సులు నిర్వహించాలని, కోల్డ్ స్టోరేజ్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు అంద్ర మాల్యాద్రి, ఆక్వా రైతు సంఘం కన్వీనర్ యువరాజు, ఆక్వా టెక్ ఎడిటర్ కె జోసఫ్, ఆక్వా నిపుణులు షేక్ అలీ హుస్సేన్, ఆక్వా రైతులు మోరి రామరాజు, ఎన్ మోహన్ కుమార్, ఎం శ్రీనివాసరావు, వెంకట్రావు, వెంకటేశ్వరరావు, కె శ్రీనివాసరావు, ఎస్‌కెఎస్ బాషా, నాగేశ్వరరావు, హరేరామ్, సురేష్ తదితరులు పాల్గొని వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

నియోజకవర్గాల అభివృద్ధికి తోడ్పడండి

- యంగ్ ప్రొఫెషనల్స్‌తో సిఎం చంద్రబాబు


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నియోజకవర్గాల అభివృద్ధికి యంగ్ ప్రొఫెషనల్స్ కచ్చితమైన ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, వారికి కేటాయించిన నియోజకవర్గాల అభివృద్ధికి ప్రాధాన్యతా అంశాలను గుర్తించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. స్వర్ణాంధ్ర విజన్-2047లో భాగంగా రూపొందించిన నియోజకవర్గాల వారీ విజన్ డాక్యుమెంట్లకు అనుగుణంగా పనిచేసేందుకు నియమితులైన యంగ్ ప్రొఫెషనల్స్‌కు ప్రణాళికశాఖ ఇచ్చిన వారం రోజుల శిక్షణ పూర్తి చేసుకోవడంతో వారితో ముఖ్యమంత్రి సచివాలయంలో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను విద్యుత్ లేని ఊరు నుంచి వచ్చానని, ఉమ్మడి రాష్ట్రంలోనే విద్యుత్ సంస్కరణలు తెచ్చానని చెప్పారు. నిత్య విద్యార్థిగా ఉంటూ అభివృద్ధి గురించి నిరంతరం ఆలోచించడం వల్లే ఇది సాధ్యమైందన్నారు. యంగ్ ప్రొఫెషనల్స్ స్థానికంగా ఉంటే ఎమ్మెల్యేలతో సహా మిగిలిన వారితో సంప్రదింపులు జరిపి నియోజకవర్గాల అభివృద్ధి ప్లాన్ చేయాలన్నారు. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉన్నా.. ముందుచూపుతో నీటిని సద్వినియోగం చేసుకుని రిజర్వాయర్లను నింపామన్నారు. రికార్డు సమయంలోనే హంద్రీ నీవా కాల్వల వెడల్పు పనులు పూర్తి చేసి, నీటిని విడుదల చేసినట్లు చెప్పారు. ఫలితంగా రాయలసీమ సహా అన్ని ప్రాజెక్టుల్లో నీళ్లు సమృద్ధిగా ఉన్నాయని తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి ఓ బలం ఉంటుందని, అభివృద్ధికి దోహదపడేలా సహజ వనరులు ఉంటాయని తెలిపారు. అలాంటి వాటిని యంగ్ ప్రొఫెషనల్స్ గుర్తించి, అధ్యయనం చేయాలన్నారు. ఆ వనరులతో నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కావాల్సిన చర్యలన్నీ చేపడుతున్నామన్నారు. రాష్ట్రంలో రోడ్ల నిర్మాణం కోసం పెద్దయెత్తున ఖర్చు పెడుతున్నట్లు చెప్పారు. పాత్ హోల్స్ నిమిత్తమే రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. జాతీయ రహదారులను నిర్మిస్తున్నామని, ఎపిలో రోడ్లు అమెరికా స్థాయిలో ఉంటాయని నితన్ గడ్కరీ కూడా చెప్పారన్నారు. యంగ్ ప్రొఫెషనల్స్‌కు ఇదో అద్భుత అవకాశమన్నారు. మంచి అనుభవం కూడా వస్తుందని చెప్పారు. అప్పట్లో సంస్కరణల గురించి మాట్లాడితే పేదలకు వ్యతిరేకమనే భావన ఉండేదని, కాని సంపద సృష్టిస్తే సంక్షేమం చేసి పేదలకు పంచవచ్చని నమ్మి సంస్కరణలు అమలు చేశామని తెలిపారు. విజన్ అంటే ఎమిటో ఇప్పుడు కొందరికి అర్థమవుతుందన్నారు. తాను విజన్-2020 పెట్టినప్పుడు చాలా మంది విమర్శించారని చెప్పారు. రాష్ట్రానికి సెమీ కండక్టర్ యూనిట్‌ను కేంద్రం కేటాయించిందని, ఇది మంచి పరిణామమన్నారు. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ ఎకో సిష్టం ఏర్పడడానికి కేంద్రం తీసుకున్న నిర్ణయం దోహదపడుతుందని చెప్పారు. శిక్షణ ముగించుకున్న 175 మంది యంగ్ ప్రొఫెషనల్స్‌కు ప్రణాళికశాఖ నియమాక పత్రాలు అందజేసింది. ఈ కార్యక్రమంలో మంత్రి పయ్యావుల కేశవ్, పి-4 ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ కుటుంబరావు, ప్రణాళికశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పంజాబ్‌లో భూ సమీకరణ పాలసీ రద్దు

- నిర్ణయించిన ప్రభుత్వం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో


PRESS NOTE

Government hereby withdraws the Land Pooling Policy dated 14.05.2025 and its subsequent amendments. Consequently, all actions, like LOIs issued, registrations done or any other action taken thereunder shall be reversed henceforth

Principal Secretary,
Department of Housing & Urban Development, Punjab.

పంజాబ్‌లో ముందుకు తీసుకొచ్చిన భూ సమీకరణ పథకం 2025ను ఆ రాష్ట్ర ప్రభుత్వం వెనక్కు తీసుకుంది. భూ సమీకరణ పథకం ప్రకటించిన వెంటనే అక్కడ సంయుక్త కిసాన్ మోర్చా బ్యానర్ కింద రైతులు ఆందోళన చేపట్టారు. సారవంతమైన భూమి పాడవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలు చేపట్టారు. పూలింగును వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లను పరిశీలించిన పంజాబ్, హర్యానా హైకోర్టు స్టే విధించింది. అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం పూలింగు నిబంధనలు ప్రకటించిందని అక్షింతలు వేసింది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో పూలింగు పాలసీని ఉపసంహరించుకుంటున్నట్లు పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు పంజాబ్ ప్రభుత్వ గృహ, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి ప్రకటన విడుదల చేశారు. ల్యాండ్ పూలింగుకు సంబంధించి ప్రభుత్వం చేసిన రిజిస్ట్రేషన్లు వంటివి పూర్తిగా రద్దవుతాయని అందులో పేర్కొన్నారు. రాష్ట్రంలో రాజధాని అమరావతికి చేపట్టిన పూలింగు పద్ధతిని పాటించేందుకు అన్ని రాష్ట్రాలు ముందుకు వస్తున్నాయని, రాష్ట్రంలో ఆ పద్ధతిని విజయవంతంగా అమలు చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, రాష్ట్రంలో పూలింగ్ విధానాన్ని సిపిఎంతోపాటు పలు వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు వ్యతిరేకించాయి. రాజధానికి భూమి అవసరం అయితే భూసేకరణ చట్టం 2013 ప్రకారం తీసుకోవాలని సూచించాయి. అయినా ప్రభుత్వం వెనక్కు తగ్గలేదు. రైతుల ఆందోళనకు తలొగ్గి ఈ పద్ధతిని పంజాబ్ పూర్తిగా ఉపసంహరించుకోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది.

కర్నూలు జిజిహెచ్‌లో కిడ్నీ మార్పిడి విజయవంతం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాష్ట్రంలో తొలిసారిగా కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించిన కిడ్నీ మార్పిడి ఆపరేషన్ విజయవంతమైందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె వెంకటేశ్వర్లు తెలిపారు. ఆస్పత్రిలోని తన కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. దేవనకొండ మండలం కరివేముల గ్రామానికి చెందిన గుర్రం గిరిధర్ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నారని తెలిపారు. కిడ్నీ కోసం జీవనదాన్ వెబ్ సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని చెప్పారు. ఈ క్రమంలో నంద్యాల జిల్లా పాములపాడు మండలం కొత్త బనకచర్ల గ్రామానికి చెందిన తరుణ్ (21) రోడ్డు ప్రమాదానికి గురవ్వడంతో కర్నూలు మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ జులై 16న బ్రెయిన్ డెడ్ అయ్యారని తెలిపారు. ఆయన కిడ్నీని గిరిధర్‌కు కేటాయించగా.. జులైన 17న ఆ కిడ్నీని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు విజయవంతంగా అమర్చినట్లు చెప్పారు. కిడ్నీ మార్పిడి చేయించుకున్న గిరిధర్ ఆరోగ్యంతో ఉన్నారన్నారు. ప్రజలకు అవయవదానంపై అవగాహన అవసరమని, మరణంలోనూ మరో ఏడుగురికి ప్రాణదానం చేయొచ్చని తెలిపారు. ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్‌కు అవసరం ఉన్న వారు జీవనదాన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసిన యూరాలజీ, నెఫ్రాలజీ, అనస్థీషియా విభాగపు వైద్యులకు అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో నెఫ్రాలజీ విభాగపు వైద్యులు డాక్టర్ జిక్కి, డాక్టర్ అనంత్, డాక్టర్ వెంకటప్పరెడ్డి, డాక్టర్ శ్రీధర్ శర్మ, యూరాలజీ ఇన్‌ఛార్జ్ ప్రొఫెసర్ డాక్టర్ ముత్యశ్రీ, డాక్టర్ బాల రవితేజ, ఆసుపత్రి ఇన్‌ఛార్జ్ సిఎస్‌ఆర్‌ఎంఒ డాక్టర్ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

మద్యం కేసులో సిట్‌కు నోటీసులు

ప్రజాశక్తి-అమరావతి

మద్యం కేసులోని 34వ నిందితుడిగా ఉన్న తన భర్త సిహెచ్ వెంకటేష్ నాయుడు ఫోన్‌లోని వివరాలను పోలీసులు మీడియాకు లీక్ చేశారంటూ ఆయన భార్య వేసిన పిటిషన్‌పై హైకోర్టు మంగళవారం విచారించింది. మద్యం కేసును విచారిస్తున్న సిట్‌కు నోటీసులు జారీ చేసింది. తన భర్త సెల్ నుంచి సేకరించిన సమాచారాన్ని సిట్ అధికారులు మీడియాకు లీక్ చేయడంపై స్వతంత్ర విచారణకు ఉత్తర్వులివ్వాలని, ఇప్పటికే మీడియా/సోషల్ మీడియాలో వచ్చిన సమాచారాన్ని తొలగింపునకు ఉత్తర్వులివ్వాలంటూ వాసిరెడ్డి మహిత పిటిషన్ దాఖలు చేశారు. దీనిని విచారించిన జస్టిస్ వెంకట జ్యోతిర్మయి సిట్ అధికారులకు నోటీసులు జారీ చేశారు. పిటిషన్‌లోని ఆరోపణలకు వివరణ ఇవ్వాలని ఆదేశించారు. తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేశారు.

గ్రామ పంచాయతీలకు ఆలయ భూములివ్వడంపై స్టే

కృష్ణా జిల్లా, ఉయ్యూరు మండలం, సాయిపురంలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి చెందిన 8.70 ఎకరాల చెరువు, భూమిని సాయిపురం గ్రామ పంచాయితీకి అప్పగిస్తూ జిల్లా కలెక్టరు ఇచ్చిన పొసీడింగ్స్ అమలును హైకోర్టు నిలిపివేసింది. భూమిని గ్రామ పంచాయతీకి తిరిగి అప్పగిస్తూ గత జూన్ 4న కలెక్టరు ఇచ్చిన ప్రొసీడింగ్స్ అమలును నాలుగు వారాలు నిలుపుదల చేసింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ వేయాలని ఆదేశిస్తూ జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. సర్వే నెంబరు 153-2లోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి చెందిన 8.70 ఎకరాలను సాయిపురం గ్రామ పంచాయతీకి అప్పగించాలన్న కలెక్టరు ఉత్తర్వులను రద్దు చేయాలంటూ శ్రీలక్ష్మీ నరసింహ స్వామి సేవా సంఘం కార్యదర్శి జొన్నవిత్తుల వెంకటప్పయ్య వేసిన పిల్‌పై తదుపరి విచారణను సెప్టెంబరు ఒకటికి వాయిదా వేశారు.



పవన్‌ను పరామర్శిస్తున్న కెఎస్ జవహర్

దళితులపై దాడులను ఉపేక్షించం

- గిరిజన యువకుడు పవన్‌ను ఆదుకుంటాం : కెఎస్ జవహర్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

దళితులపై దాడులు జరిగితే రాజకీయాలకు అతీతంగా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ కమిషన్ చైర్మన్ కెఎస్ జవహర్ అన్నారు. బైక్‌ను అద్దెకు తీసుకుని ఆ సొమ్ము చెల్లించలేదని గిరిజన యువకుడు పవన్‌పై దాడి చేసిన నిందితులకు శిక్ష పడేలా త్వరితగతిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అవసరమైతే ఈ కేసు కోసం ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేస్తామని తెలిపారు. తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పవన్‌ను మంగళవారం ఆయన పరామర్శించారు. అనంతరం మీడియాతో జవహర్ మాట్లాడుతూ.. బలహీనులపై దాడులు చేయడం దారుణమన్నారు. దాదాపు 25 మంది చుట్టుముట్టి గిరిజన యువకుడిపై దాడి చేశారని, అందులో 16 మందిని పేర్లతో సహా గుర్తించానని బాధితుడు తనకు చెప్పారని తెలిపారు. గుర్తించిన అందరిపైనా కేసులు నమోదు చేశామని, బాధితుడికి ప్రభుత్వం తరపున రావాల్సిన అట్రాసిటీ రాయితీలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. దాడిచేసిన వారు ఎంతటివారైనా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. బాధితుడికి అవసరమైన వైద్య సదుపాయాలను కల్పించాలని వైద్యాధికారులకు సూచించామని చెప్పారు. ఈ సమావేశంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, మాజీ ఎమ్మెల్యేలు పరసారత్నం, సూరజ్, శ్రీధర్‌వర్మ పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుకు ద్రోహం.. మిట్టల్‌కు ఊడిగం

- టిడిపి ఎంపిల తీరుపై సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ప్రభుత్వ రంగంలోని విశాఖ ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయించాలని పల్లెత్తు మాట మాట్లాడని విశాఖ ఎంపి శ్రీ భరత్, రాష్ట్రంలోని టిడిపి ఎంపీల బృందం ప్రయివేటు ఆర్సెలార్ మిట్టల్ ప్లాంట్ కోసం ఆరాటపడుతున్నారని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు విమర్శించారు. టిడిపి ఎంపీల చర్యను నిరసిస్తూ పార్టీ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో ఏర్పాటు కాబోయే అర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు ఎన్ఎండిసి నుంచి గనులు కేటాయింపు, పైపులైన్ల ద్వారా సరఫరాకు అనుమతులు వేగవంతం చేయాలని టిడిపి ఎంపీలంతా కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డి.కుమారస్వామిని కలిసి ఇటీవల విన్నపాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. విశాఖ ఉక్కుకు మాత్రం తీవ్ర ద్రోహం చేస్తున్నారని తెలిపారు. దేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు రంగ స్టీల్‌ప్లాంట్లకు కేంద్రం సొంతగనులు కేటాయించి, వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై మాత్రం వివక్షత ప్రదర్శించిందన్నారు. గనులు కేటాయించకపోవడంతో ప్రతి టన్ను స్టీల్ ఉత్పత్తికి రూ.4 వేల నుంచి రూ.6 వేల అదనపు భారం పడుతోందన్నారు.

దీంతో, విశాఖ ఉక్కు కర్మాగారం నష్టాలబారిన పడుతోందని తెలిపారు. విశాఖ ఎంపి శ్రీ భరత్, టిడిపి ఎంపిలు విశాఖ ఉక్కుకు సొంత గనుల కోసం కేంద్రాన్ని నిలదీయడం లేదన్నారు. పైగా, అనకాపల్లి జిల్లాలో ఇంకా ఏర్పాటు కాని మిట్టల్ స్టీల్ ప్లాంట్ విషయంలో మాత్రం తహతహలాడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రజల కన్నా మిట్టల్ ముఖ్యమైతే ఎంపీలంతా తమ పదవులకు రాజీనామాలు చేసి మరలా ప్రజల తీర్పు కోరాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, బి.జగన్, తదితరులు పాల్గొన్నారు.



విశాఖలో ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

వసతి గృహాల అభివృద్ధికి రూ.300 కోట్లు

మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి డోలా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వసతి గృహాల అభివృద్ధికి రూ.300 కోట్లను కేటాయించినట్లు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. వసతి గృహ భవనాల మరమ్మతులకు రూ.143 కోట్లు, నూతన భవనాలకు రూ.100 కోట్లు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి మరో రూ.50 కోట్లు విడుదల చేశామన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యాన ప్రాంతీయ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల విద్య, ఆరోగ్యంపై శ్రద్ధ వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో నూతన వసతి గృహ భవన నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ ఏడాది నుంచి పోస్ట్‌మెట్రిక్ విద్యార్థులకు కార్పెట్, టవల్స్, బెడ్‌షీట్స్ అందిస్తున్నామన్నారు. వసతి గృహాల్లోని విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, నాణ్యమైన భోజనం అందించాలని, వసతి సౌకర్యాలు బాగుండాలని ఆదేశించారు. విశాఖపట్నం, తిరుపతిలో త్వరలో ప్రాంతీయ కార్యశాలలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి ఎంఎం నాయక్, డైరెక్టర్ లావణ్య వేణి, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్‌టిఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు చెందిన వసతి గృహాల వార్డెన్లు, అధికారులు పాల్గొన్నారు.

తిరుమలకు 'ఫాస్ట్ టాగ్' తప్పనిసరి

- ఆగస్టు 15 నుంచి అమలు

ప్రజాశక్తి - తిరుమల

శ్రీవారి దర్శించుకునేందుకు వచ్చే యాత్రికులకు మెరుగైన భద్రతా ప్రమాణాలు, అధిక రద్దీ నివారణ, పారదర్శక సేవలు అందించేందుకు తిరుమలకు వెళ్లే వాహనాలకు ఫాస్ట్‌టాగ్‌ను టిటిడి తప్పని సరి చేసింది. ఆగస్టు 15 నుంచి ఈ విధానం అమలులోకి రానుందని ఓ ప్రకటనలో పేర్కొంది. ఫాస్ట్‌టాగ్ లేని వాహనాలను తిరుమలకు అనుమతించేది లేదని వెల్లడించింది. ఫాస్ట్‌టాగ్ లేని వాహనదారుల సౌకర్యార్థం అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద ఐసిఐసిఐ బ్యాంకు వారి సహకారంతో ఫాస్ట్ టాగ్ జారీ కేంద్రం ఏర్పాటు చేశామని పేర్కొంది. యాత్రికులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని టిటిడికి సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

రూ.1.10 కోట్లు విరాళం

శ్రీవారి అన్నప్రసాదం ట్రస్టుకు కోటి రూపాయలు, శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణ ట్రస్టుకు రూ.పది లక్షలు విరాళం అందింది. రంగనాయకుల మండపంలో అదనపు ఇఒ వెంకయ్యచౌదరికి విరాళం చెక్కును హైదరాబాద్‌కు చెందిన కాప్టన్ సర్వీసెస్ సంస్థ అధినేత కొడాలి శ్రీకాంత్ అందజేశారు.

రెండు బ్యాటరీ బగ్గీలు విరాళం

తిరుమల తిరుపతి దేవస్థానానికి రెండు బ్యాటరీ బగ్గీ వాహనాలను బెంగళూరుకు చెందిన చంద్రశేఖర్ విరాళంగా అందించారు. రూ.11 లక్షలు విలువైన ఈ వాహనాలకు శ్రీవారి ఆలయం ముందు పూజలు నిర్వహించి, డిప్యూటీ ఇఒకు లోకనాథంకు వాహనాల తాళాలు అందజేశారు.



సంఘీభావం తెలుపుతున్న నారాయణ, వామపక్షాల నాయకులు

'కార్గో ఎయిర్‌పోర్టు'తో ఉద్దానం విధ్వంసం

- ప్రజాభీష్టాన్ని కాదని ముందుకెళ్తే ప్రతిఘటన : వామపక్ష నాయకులు

ప్రజాశక్తి - మందస (శ్రీకాకుళం)

కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో ఉద్దానాన్ని విధ్వంసం చేస్తే సహించేది లేదని వామపక్ష నాయకులు హెచ్చరించారు. కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా, బలవంతపు భూసేకరణ ఆపాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లాలోని కార్గో ఎయిర్‌పోర్టు ప్రభావిత గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. మందస మండలంలోని ఎం.గంగువాడ నుంచి రామాపురం వరకు తొలుత ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు కొమర వాసు అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో సిపిఐ నారాయణ మాట్లాడారు. బలవంతంగా భూములు తీసుకోవడం వల్ల ఇక్కడి ప్రజలు నిరాశ్రయులవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఎయిర్‌పోర్టుకు అనుబంధంగానే కార్గో ఎయిర్‌పోర్టులు ఉన్నాయని, ఇక్కడ మాత్రం ప్రత్యేకంగా ఎందుకు కడుతున్నారని ప్రశ్నించారు. ప్రజాభీష్టాన్ని కాదని ముందుకెళ్తే ప్రజా ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ.. జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చిన ఉద్దానంలోని లక్షలాది జీడి చెట్లను కార్గో ఎయిర్‌పోర్ట్ పేరుతో తొలగించడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. జీడి ఆధారిత పరిశ్రమలు దెబ్బతిని వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ కంపెనీల కోసం ప్రజల భూములు లూటీ చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాశరావు, లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు మద్దిల రామారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ కార్యదర్శి జోగి అప్పారావు, ఏపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, జీడి రైతుసంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, రామాపురం సర్పంచ్ పొట్టి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలో రూ.2.17 లక్షల కోట్ల విలువైన నకిలీ నోట్లు చలామణి : కేంద్రం

న్యూఢిల్లీ : దేశంలో నకిలీ నోట్లు భారీగా చెలామణిలోకి వచ్చాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం 2024-25లో దేశంలో 2.17 లక్షల దొంగ నోట్లను గుర్తించినట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోకసభకు తెలిపారు. ఇంతక్రితం ఏడాదిలో ఈ సంఖ్య 2.23 లక్షలుగా ఉంది. 2024-25లో గుర్తించిన నకిలీ నోట్లలో రూ.500 నోట్లు అత్యధికంగా ఉన్నాయి. మొత్తం 1,17,722 నకిలీ రూ.500 నోట్లను బ్యాంకింగ్ వ్యవస్థలో గుర్తించారు. ఇది గత ఏడాది 85,711 నకిలీ రూ.500 నోట్లతో పోలిస్తే 37 శాతం పెరగడం కలకలం రేపుతోంది. రూ.100 విలువ చేసే 51,069 నోట్లు. రూ.200 నోట్లు 32,660 నకిలీగా గుర్తించినట్లు పంకజ్ చౌదరి పేర్కొన్నారు. "బ్యాంక్ నోట్లలో కొత్త భద్రతా లక్షణాలు, డిజైన్‌లను చేర్చడం నిరంతర ప్రక్రియగా కొనసాగుతోంది," అని చౌదరి తెలిపారు.

సంపాదకీయం

జర్నలిస్టులపై కక్ష

నాజీలను మించిన నెతన్యాహు రక్తపిపాస ప్రపంచానికి నిజాలు చెబుతున్న పాత్రికేయులను కూడా బలిగొంటోంది. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజాస్వామ్యం నిలబడాలని నిత్యం సూక్తులు చెప్పే అమెరికా, పశ్చిమ దేశాలు నిస్సిగ్గుగా ఇస్తున్న మద్దతే అంతులేని ఇజ్రాయిల్ నరమేధానికి ప్రధాన కారణం. 2023 అక్టోబర్ 7 నుంచి ఇప్పటివరకూ నిరాయుధులైన 65 వేలమందికిపైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. వారిలో 60 శాతానికిపైగా మహిళలు, చిన్నారులే. రెండు లక్షల మందికిపైగా అమాయకులు క్షతగాత్రులయ్యారు. మానవత్వాన్ని మరిచిపోయి, యుద్ధ నియమాలన్నీ కాలరాసి... అక్కడి ఆసుపత్రులు, విద్యాసంస్థలు సహా సమస్త వనరులను విధ్వంసం చేసి, గాజాలోకి ఆహారం, నిత్యావసరాలు, మందులు రాకుండా అడ్డుకుంటున్న ఇజ్రాయిల్ దుర్మార్గాన్ని పోల్చడానికి మాటలు చాలవు. ఎముకల గూడులా మారి మరణిస్తున్న చిన్నారులు, ఏడ్చేందుకు కూడా కన్నీళ్లురాని స్థితిలో ఉన్న మహిళలు, జీవచ్ఛవాల్లా ఉన్న ప్రజలకు ఆహారం అందిస్తామంటూ అమెరికా, ఇజ్రాయిల్ కలిసి కేంద్రాలు ఏర్పాటు చేసి, అక్కడికి వచ్చిన వారిని దారుణంగా చంపేస్తున్నాయి. ఈ దారుణాలను, ఆకలి చావులను ప్రపంచానికి చేరవేస్తున్న పాత్రికేయులంటే నెతన్యాహుకు మంట. జర్నలిస్టులపై ఏదో ఒక ఆరోపణ చేసి, వారిని బలితీసుకోవడం ఇజ్రాయిల్‌కు అలవాటుగా మారింది. ఇప్పటివరకూ 242 మంది జర్నలిస్టులు మరణించినట్లు ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. రెండు ప్రపంచ యుద్ధాలు, వియత్నాం, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్ దురాక్రమణ వంటి అనేక యుద్ధాలు జరిగినా, ఇంతమంది జర్నలిస్టులు ఎప్పుడూ ప్రాణాలు కోల్పోలేదు.

యుద్ధాలు, ఉద్రిక్తతల సమయంలో వార్తలను సేకరించే జర్నలిస్టులకు రక్షణ ఉంటుంది. ప్రమాదవశాత్తు గాయపడటం, మరణించడం అప్పుడప్పుడు సంభవిస్తుంటాయి. అందుకు భిన్నంగా జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్ బలి తీసుకోవడం దుర్మార్గం. తాజాగా అల్ షిఫా ఆసుపత్రి సమీపంలోని గుడారంలో జర్నలిస్టులు ఉండటాన్ని నిర్ధారించుకుని వైమానిక దాడి చేసి, ఐదుగురు అల్‌జజీరా మీడియా సిబ్బందిసహా ఏడుగురి ప్రాణాలు తీసింది. 'మా చావులను కళ్లారా చూస్తున్న వారిని, మా మరణాలను ఆమోదిస్తున్న వారిని, ఇన్ని దారుణాలు జరుగుతున్నా మౌనంగా ఉండిపోయిన వారిని, గత ఏడాదిన్నరగా మా గడ్డపై మా పిల్లలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను, హింసాకాండను, మారణ హోమాన్ని అడ్డుకోని వారిని అల్లా క్షమిస్తాడని నేను అనుకోవడం లేదు. నా జనం, నా కుటుంబం స్వేచ్ఛా బాటలో నడిచేందుకు అవసరమైన వెలుగునిచ్చేందుకు నా రక్తం తోడ్పడేటట్లు చేయి. మీ ప్రార్థనల్లో గాజాను మర్చిపోవద్దు.. నన్నూ మర్చిపోవద్దు' అంటూ 28 ఏళ్ల జర్నలిస్ట్ అనాస్ జమాల్ అల్ షరీఫ్ రాసిన చివరి సందేశం సోషల్ మీడియాలో లక్షల మంది హృదయాలను కదిలిస్తోంది. షరీఫ్ జర్నలిస్ట్, వీడియో గ్రాఫర్. ఇజ్రాయిల్ ఆక్రమణలో ఉన్న ప్రాంతంలోనే జన్మించిన ఆయన రెండేళ్లుగా అల్ జజీరాలో పనిచేస్తున్నారు. ఆయన తీసిన ఇజ్రాయిల్ మారణకాండ ఫొటో 2024 పులిట్జర్ బహుమతిని గెలుచుకుంది. టెల్ అవీవ్ వ్యూహాన్ని ప్రపంచం ముందుంచడంతో హమాస్ ఉగ్రవాదిగా ముద్రవేసి, వేటాడి చంపేసింది. ఇజ్రాయిల్ ఆరోపణలను తోసిపుచ్చడంతోపాటు జర్నలిస్టుల హత్యను ఐరాస, ప్రపంచవ్యాప్తంగా ఉన్న పాత్రికేయ సంఘాలు, ప్రగతిశీలురు తీవ్రంగా ఖండించారు. అనుకూలంగా వార్తలు ఇచ్చే వారిని తప్ప అంతర్జాతీయ జర్నలిస్టులను గాజాలో ప్రవేశించకుండా ఇజ్రాయిల్ అడ్డుకుంటోంది. స్థానికులైన అల్ షరీఫ్ లాంటి వారు ఎందరో పాలస్తీనియన్లు జర్నలిస్టులుగా మారి మీడియా సంస్థలకు వార్తలను అందిస్తున్నారు. గాజాలో సాగుతున్న మారణహోమాన్ని విశ్వానికి తెలియజేస్తున్న జర్నలిస్టులకు సంఘీభావంగా నిలవడం ప్రపంచ ప్రజలందరి కర్తవ్యం. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించి, అండగా ఉన్న విధానాన్ని తుంగలో తొక్కి ఇజ్రాయిల్‌తో దోస్తీ చేస్తున్న మోడీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలి. నెతన్యాహు మితవాద ప్రభుత్వ నరమేధాన్ని అడ్డుకునేందుకు దేశవ్యాప్తంగా ప్రచారోద్యమం, ఆందోళనలు నిర్వహిస్తున్న వామపక్షాలు, ప్రగతిశీల శక్తులతో ప్రజలంతా చేయి చేయి కలపాలి.

నివాళి

ఫైడల్ కాస్ట్రో

99వ జయంతి నేడు




సిద్ధాంతాలు లేని జీవితాన్ని గురించి చెప్పుకోవడానికి ఏమీ ఉండదు. వాటి కోసం పోరాడటాన్ని మించిన గొప్ప ఆనందం మరొకటి ఉండదు.

జననం : 13.8.1926,

మరణం : 25.11.2016

సందర్భం

కార్పొరేట్ల నుండి వ్యవసాయ రంగాన్ని కాపాడుకుందాం



'క్విట్ కార్పొరేట్' నినాదంతో నేడు దేశవ్యాప్తంగా ట్రాక్టర్ ర్యాలీ

అమెరికా షరతులు అంగీకరిస్తే మనం సమృద్ధిగా పండించుకునే గోధుమ, వరి, మొక్కజొన్న వంటి ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకోవాల్సి వస్తుంది. పత్తి, సోయాబీన్, జన్యుమార్పిడి విత్తనాలు పన్నులు లేకుండా దిగుమతి చేసుకోవాల్సి వస్తుంది. మనం మిగులులో ఉన్న పాలు, పాల ఉత్పత్తులు, పౌల్ట్రీ, పౌల్ట్రీ ఉత్పత్తులు దిగుమతి చేసుకోవాల్సి వస్తుంది. ఇవన్నీ సుంకాలు లేకుండా దిగుమతులు వచ్చి పడితే మన రైతాంగం పంటలను అమ్ముకునే అవకాశం లేక దివాళా తీయడం తప్ప మార్గం లేదు. ప్రభుత్వం ఇప్పటికే ఇంగ్లాండుతో అగ్రిమెంట్ చేసుకున్నది. ఆ అగ్రిమెంట్ ప్రకారం పాల ఉత్పత్తులు, ఆహార పదార్థాలు దిగుమతి అవుతాయి. అగ్రిమెంట్లు సుంకాలపై జరుగుతున్న చర్చల ప్రభావం వల్ల మనం ఎగుమతి చేస్తున్న మిరపకాయలు, పొగాకు, మామిడి పల్ప్, శనగల ధరలు పడిపోయి రైతాంగం తీవ్రంగా నష్టపోయారు. రొయ్యలపై 5 శాతం ఉన్న పన్ను 50 శాతం పెంచడంతో రొయ్యల ధర పడిపోయి రైతాంగం తీవ్రంగా నష్టపోయారు.



వై. కేశవరావు

కేంద్ర ప్రభుత్వం అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు సాగిస్తున్నది. అగ్రిమెంట్‌లో వ్యవసాయ రంగాన్ని, పాడి రంగాన్ని, పౌల్ట్రీ రంగాన్ని చేర్చాలని అమెరికా పట్టుబడుతున్నది. ఇప్పటికే నాలుగు సార్లు చర్చలు జరిగాయి. ఐదవసారి చర్చల కోసం అమెరికా అధికారులు మన దేశం వస్తున్నారు. మన ఎగుమతులపై అదనంగా 25 శాతం సుంకాలు విధిస్తూ ట్రంప్ జారీచేసిన హుకుంపై సంతకం చేశారు. అమెరికా అధ్యక్షుడు సుంకాలు విధిస్తూ రంకెలు వేస్తుంటే, మన ప్రధాని మౌనం పాటిస్తున్నారు. మౌనం అర్థాంగీకారం అని సామెత ఉంది. కానీ మన ప్రధాని అర్థాంగీకారం కాదు, పూర్తి అంగీకారంతో ఉన్నట్లు అర్థమవుతున్నది.

అమెరికా షరతులు అంగీకరిస్తే మనం సమృద్ధిగా పండించుకునే గోధుమ, వరి, మొక్కజొన్న వంటి ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకోవాల్సి వస్తుంది. పత్తి, సోయాబీన్, జన్యుమార్పిడి విత్తనాలు పన్నులు లేకుండా దిగుమతి చేసుకోవాల్సి వస్తుంది. మనం మిగులులో ఉన్న పాలు, పాల ఉత్పత్తులు, పౌల్ట్రీ, పౌల్ట్రీ ఉత్పత్తులు దిగుమతి చేసుకోవాల్సి వస్తుంది. ఇవన్నీ సుంకాలు లేకుండా దిగుమతులు వచ్చి పడితే మన రైతాంగం పంటలను అమ్ముకునే అవకాశం లేక దివాళా తీయడం తప్ప మార్గం లేదు. ప్రభుత్వం ఇప్పటికే ఇంగ్లాండుతో అగ్రిమెంట్ చేసుకున్నది. ఆ అగ్రిమెంట్ ప్రకారం పాల ఉత్పత్తులు, ఆహార పదార్థాలు దిగుమతి అవుతాయి. ఈ అగ్రిమెంట్లు సుంకాలపై జరుగుతున్న చర్చల ప్రభావం వల్ల మనం ఎగుమతి చేస్తున్న మిరపకాయలు, పొగాకు, మామిడి పల్ప్, శనగల ధరలు పడిపోయి రైతాంగం తీవ్రంగా నష్టపోయారు. రొయ్యలపై 5 శాతం ఉన్న పన్ను 50 శాతం పెంచడంతో రొయ్యల ధర పడిపోయి రైతాంగం తీవ్రంగా నష్టపోయారు. ఈ పంటలపై సుంకాలు పెంచితే ఆ మేరకు వ్యాపారులు, కంపెనీలు ధరలు మరింత తగ్గించి వేస్తాయి.

కేంద్రం ప్రకటించిన మూడు ప్రత్యామ్నాయ విధానాలు

కేంద్రంలో మూడవసారి ఏర్పడిన బిజెపి ప్రభుత్వం రద్దు చేసిన మూడు నల్ల వ్యవసాయ చట్టాల స్థానంలో మూడు విధాన పత్రాలను ప్రకటించింది. 1) వ్యవసాయ పంటల మార్కెట్ల విధానం. 2) జాతీయ సహకార విధానం. 3) డిజిటల్ అగ్రికల్చర్ మిషన్. ఈ మూడు విధాన పత్రాలు రద్దయిన నల్ల వ్యవసాయ చట్టాల కన్నా ప్రమాదకరంగా ఉన్నాయి.

ఇప్పుడున్న వ్యవసాయ పంటల మార్కెట్ల చట్టాన్ని రైతుల ప్రయోజనాల కోసం మరింత అభివృద్ధి పరచాల్సి ఉండగా, కార్పొరేట్ కంపెనీల ఎగుమతి, దిగుమతి వ్యాపారుల ప్రయోజనాలకు అనుగుణంగా 12 సవరణలు చేసింది. ఈ సవరణలు అన్నిటిలో ఏ ఒక్కటీ రైతులకు ప్రయోజనం చేకూర్చేది కాదు. దీని ప్రకారం పంటలకు అసలు మద్దతు ధరల విధానమే ఉండదు. ప్రభుత్వ కొనుగోళ్ళు ఉండవు. రైతులు నేరుగా గాని ఎఫ్‌పిఒల ద్వారా గాని కంపెనీలతోనూ, ఎగుమతి, దిగుమతి వ్యాపారులతో అగ్రిమెంట్ చేసుకుని పంటలు సరఫరా చేయాలి.

కనీస మద్దతు ధరలు, ప్రభుత్వ కొనుగోళ్ళు ఉండగానే వ్యాపారులు, కంపెనీలు ఏకమై ప్రభుత్వం నిర్ణయించిన ధరకు పొగాకు కొనడం లేదు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు మామిడికాయలు కొనడం లేదు. నూతన మార్కెట్ విధానం అమలులోకి వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించవచ్చు.

ఈ చట్టం ప్రకారం కంపెనీల లాభాలకు అవసరమైన పంటలు పండించాలి. మన దేశ అవసరాలు, మన ప్రజల అవసరాలతో నిమిత్తం లేదు. ఈ విధానం మన ప్రజల ఆహార భద్రతకు ప్రమాదకరం మన దేశ సార్వభౌమాధికారానికి నష్టకరం.

నూతన సహకార విధానం

సహకార సంఘాలను ఎఫ్‌పిఒ లను లోపాలు సవరించి అభివృద్ధి పరచవలసి ఉంది. సహకార పద్ధతిలో వ్యవసాయ రంగాన్ని ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమను, సహకార మార్కెటింగ్ విధానాన్ని అభివృద్ధి పరచి రైతులకు అదనపు ఆదాయాన్ని సమకూర్చాల్సి ఉంది. ప్రాసెసింగ్ మార్కెటింగ్‌లలో వచ్చే ఆదాయంలో రైతులకు వాటా ఇచ్చే విధంగా రూపొందించాలి. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సహకార విధాన పత్రం అందుకు అనుగుణంగా లేదు. సహకార, పాడి సహకార, మధ్య సహకార సంఘాలన్నిటినీ కలిపి బహుళ ప్రయోజన సహకార సంఘాలు ఏర్పాటు చేస్తుంది. ఈ పాలక వర్గాలలో కార్పొరేట్ కంపెనీల, ఎగుమతి, దిగుమతి వ్యాపారుల ఏజెంట్లను పాలక వర్గంలోనికి నామినేట్ చేసే విధానం వల్ల సహకార వ్యవస్థ మొత్తం కంపెనీల అజమాయిషీలోకి వెళ్లే ప్రమాదం ఉంది. బహుళ సహకార సంఘాలన్నీ కార్పొరేట్ కంపెనీల వస్తువులు అమ్మే ఏజెన్సీలుగా మారిపోతాయి. సహకార సంఘాలకు పంటల వారీ ఎఫ్‌పిఓలు ఏర్పరిచే బాధ్యత అప్పగిస్తుంది. ఆ ఎఫ్‌పిఓలతో సైతం ఎన్‌జిఒల పేరుతో కంపెనీల ప్రతినిధులు మేనేజింగ్ డైరెక్టర్లుగా ఉంటారు. ఎఫ్‌పిఒల ద్వారా మొత్తం రైతాంగాన్ని కంపెనీలకు, బడా వ్యాపారులకు అప్పగించే విధంగా సహకార విధానాన్ని రూపొందించారు. సహకార రంగాన్ని కాపాడుకొని రైతుల ప్రయోజనాలు కాపాడుకునే విధంగా అభివృద్ధి చేసుకోవలసి ఉంది.

విద్యుత్ ప్రైవేటీకరణ ఉపసంహరించాలి

ఢిల్లీ రైతు ఉద్యమం విరమించే సందర్భంగా విద్యుత్ చట్ట సవరణ బిల్లు ఎస్‌కెఎమ్ నాయకత్వంతో చర్చించి రూపొందిస్తామని రాతపూర్వకంగా ఇచ్చిన హామీని గాలికి వదిలి పార్లమెంటులో ప్రవేశపెట్టారు. అది పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు వెళ్ళింది. ఆ రిపోర్టు రాకుండానే మొత్తం విద్యుత్ రంగాన్ని ప్రైవేటు పరం చేసే చర్యలకు ప్రభుత్వం పాల్పడుతున్నది. వ్యవసాయ, గృహ వినియోగ వ్యాపార వర్గాలన్నింటికీ ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు సిద్ధమైంది. మొత్తం దేశానికి అవసరమైన ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్ల ఆర్డర్ అదానీకి ఇచ్చారు. అదానీ, తదితర కంపెనీల లాభాలకు అనుగుణంగా విద్యుత్ విధానాలను రూపొందిస్తున్నారు. ఈ మీటర్ల భారం మొత్తం వినియోగదారులపై పడుతుంది. ఇప్పటికే ట్రూఅప్ చార్జీల పేరుతోను, సెస్‌ల పేరుతో ప్రజలపై విపరీతమైన భారాలు మోపుతున్నారు. ఈ విధానంతో మన రాష్ట్ర ప్రభుత్వం ముందు పీఠిన ఉన్నది. వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌తో పాటు రోజుకు 18 గంటలపాటు విద్యుత్ సరఫరా చేయాలని, 300 లోపు యూనిట్లు వాడే గృహాలకు ఉచితంగా ఇవ్వాలని పోరాడాల్సి ఉంది.

కార్పొరేట్లకు భూపందేరం

భూసేకరణ చట్టాన్ని పక్కనపెట్టి రైతుల నుండి లక్షలాది ఎకరాలను లాక్కుని అదానీ, అంబానీ తదితర కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తున్నారు. 30 సంవత్సరాల లీజు పేరుతో బహుళ పంటలు పండే భూములు సైతం బలవంతంగా లీజుకు కంపెనీలకు అప్పగిస్తున్నారు. మన రాష్ట్రంలో సోలార్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీ, హైడ్రో పవర్ పేరుతో 20 లక్షల ఎకరాలు పైగా నిర్బంధంగా సేకరించి అప్పగిస్తున్నారు. 1/70 చట్టం ఉన్నప్పటికీ గిరిజన భూములు సైతం కంపెనీలకు అప్పగిస్తున్నారు. 18 వేల జనాభా వున్న కరేడు గ్రామం మొత్తాన్ని ఇండో సోలార్ కంపెనీ కోసం నిర్బంధంగా ఖాళీ చేయించేందుకు పూనుకొనటం చూస్తున్నాం. 30 సంవత్సరాల తరువాత తిరిగి భూములు వస్తాయనేది నమ్మశక్యం కాదు. ఈ భూములు సాగు చేసే పేద, మధ్య రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు పనులు కోల్పోయి బతుకు తెరువు కోసం వలసలు పోవాల్సి వస్తుంది.

కేంద్ర ప్రభుత్వం పది సంవత్సరాలు దాటిన డీజిల్ వాహనాలను వినియోగించకుండా నిషేధం విధించింది. రైతులు వినియోగించుకొనే 10 సంవత్సరాలు నిండిన ట్రాక్టర్లన్నిటిని పాత ఇనప సామానులకు అమ్ముకోవలసిందే. బహుళజాతి కంపెనీలైన జాన్‌డీర్, ఫర్గుసన్, ఫోర్డ్ తదితర బహుళజాతి కంపెనీల ప్రయోజనాల కోసమే ఈ నిషేధం తప్ప వేరే కాదు. రైతులు వినియోగించే ట్రాక్టర్లపై నిషేధం ఎత్తివేయాలి.

సి2 ప్లస్ 50 మద్దతు ధరలు-రుణభారం నుండి విముక్తి

డా॥ఎమ్.ఎస్. స్వామినాథన్ సూచించిన సి2 ప్లస్ 50 ఫార్ములా ప్రకారం మద్దతు ధరల చట్టం చేస్తామని 2014లో హామీ ఇచ్చి, అమలు పరచకుండా రైతాంగాన్ని మోసగించింది బిజెపి ప్రభుత్వం. ఢిల్లీ ఉద్యమం విరమణ సందర్భంగా సి2 ప్లస్ 50 మద్దతు ధరల చట్టం తెస్తానని రాతపూర్వకంగా హామీ ఇచ్చింది. ఆ హామీ అమలు చేయకుండా మరొకసారి రైతాంగాన్ని మోసగించింది. ప్రస్తుతం తెచ్చిన మార్కెట్ల చట్టం ప్రకారం అసలు మద్దతు ధరలు చట్టమే ఉండదు. ప్రభుత్వ కొనుగోలు ఉండవు. రైతాంగ మనుగడకు ప్రధానమైన సి2 ప్లస్ 50 మద్దతు ధరల చట్టం అమలుకు పోరాటం సాగించాల్సి ఉంది.

బిజెపి అధికారంలో ఉన్న ఈ దశాబ్దంలో 1లక్షా 60 వేలకు పైగా రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. వీరంతా పండించిన పంటలకు మద్దతు ధరలు రాక నష్టాలపాలై రుణగ్రస్తమయ్యారు. అందువల్ల ఒకసారి పేద మధ్య రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల రుణాలు రద్దు చేయాల్సి ఉంది. ఆత్మహత్యలకు పాల్పడిన రైతులలో అత్యధికులు బ్యాంకు రుణాలు అందక, ప్రైవేటు వారి నుంచి అప్పులు తెచ్చి వడ్డీలపై వడ్డీలు చెల్లించాల్సి వచ్చిన వారే. ఈరోజు మైక్రో ఫైనాన్స్ వ్యాపారుల ఇష్టారాజ్యంగా ఉంది. ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారిలో అత్యధికులు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల దౌర్జన్యాలకు, ఆగడాలకు బలైనవారే. కావున మైక్రో ఫైనాన్స్ కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలి. పేద రైతులకు, కౌలు రైతులకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాల్సి ఉంది.

పైన పేర్కొన్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగాను, మన డిమాండ్ల సాధన కోసం దశలవారీగా పోరాడాలని ఎస్‌కెఎమ్, కెఎమ్‌ఎమ్ నిర్ణయించాయి. క్విట్ ఇండియా ఉద్యమం 83వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 13వ తేదీన దేశవ్యాప్తంగా ట్రాక్టర్, బైక్ ర్యాలీలు నిర్వహించాలని, ట్రంప్, మోడీ దిష్టిబొమ్మల దగ్ధం చేయాలని ఆ రెండు సంఘాలు పిలుపు ఇచ్చాయి. నవంబర్ 26 వరకు దశలు వారీగా పోరాటాన్ని ఉధృతం చేయాలని నిర్ణయించాయి. ఈ పోరాటానికి జాతీయ ట్రేడ్ యూనియన్ల సమాఖ్య మద్దతు ప్రకటించింది. గ్రామ గ్రామాన కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, వృత్తిదారులు ఐక్యంగా కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సి ఉంది.

/ వ్యాసకర్త రైతు సంఘం సీనియర్ నాయకులు /

అభిప్రాయం

కట్టడి చేయకుంటే కష్టమే!



చాలామంది కొన్ని రకాల ఆహార పదార్థాలను పూర్తిగా మానేయమని సలహా ఇస్తున్నారు. దీనివల్ల శరీరానికి అవసరమైన పోషకాలు లభించక పోషకాహార లోపం ఏర్పడుతున్నది. బరువు తగ్గడం లేదా ఇతర ఆరోగ్య సమస్యలకు దారితీస్తున్నది. మరికొందరు ఒకేరకమైన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని చెబుతుండడంతో అవసరమైన విటమిన్లు, ప్రొటీన్లు, ఖనిజాలు అందకుండా పోతున్నాయి. అంతేకాకుండా కొంతమంది ఇస్తున్న తప్పుడు సలహాలు దీర్ఘకాలం పాటించినా....బరువు తగ్గకపోవడం, ఆరోగ్యం మెరుగు కాకపోవడంతో అనేక మంది మానసిక ఆరోగ్యంపై ప్రభావం పడుతున్నది.

'ఒక్క చిట్కాతో బరువు తగ్గొచ్చు', 'ఈ ఒక్క ఆహారంతో అన్ని రోగాలు మటుమాయం', 'వైద్యులు చెప్పని నిజాలు', 'వారం రోజుల్లో క్యాన్సర్‌ను నయం చేసే ఆహారం' తరహా శీర్షికలు ఇటీవలి కాలంలో సోషల్ మీడియాలో ఎక్కువయ్యాయి. ఇలాంటి వీడియోలను అనుసరిస్తూ... తమ ఆహారంలో మార్పులు చేసుకుంటున్న కొందరు ఆస్పత్రుల పాలైన ఘటనలు వుంటున్నాయి. ఇలాంటి ఒకరకమైన డైట్‌ను పాటించి ఈ ఏడాది మార్చి నెలలో పద్దెనిమిదేళ్ల కేరళ యువతి మరణించింది. ఎలాంటి డిగ్రీలు లేకుండా, శాస్త్రీయ ప్రయోగాలు చేయకుండా ఇస్తున్న సలహాలను పాటించడం వల్ల ప్రపంచ వ్యాప్తంగానూ అనేక మరణాలు సంభవిస్తున్నాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపు 50 శాతం డైటరీ, న్యూట్రిషన్ సలహాలు తప్పుగా లేదా శాస్త్రీయ ఆధారం లేకుండా ఉన్నాయని 2024లో డీకిన్ విశ్వవిద్యాలయం నిర్వహించిన ఒక అధ్యయనం తేల్చింది. నూటికి 60 శాతం మంది భారతీయులు ఆరోగ్య సమాచారాన్ని సోషల్ మీడియా నుంచే పొందుతున్నారని ఐ.ఎ.ఎం.ఎ.ఐ 2024 డేటా చెబుతున్నది. ఈ నేపథ్యంలో భారతదేశంలో వేగంగా వ్యాప్తి అవుతున్న తప్పుడు ఆరోగ్య సమాచారానికి అడ్డుకట్ట వేయకపోతే... భవిష్యత్తులో భారీ నష్టం సంభవించే ప్రమాదముంది.

ఎలాంటి చదువులు, డిగ్రీలు లేకున్నా...ప్రస్తుతం సోషల్ మీడియాలో అనేక మంది తమను తాము న్యూట్రీషియనిస్టులు, డైటీషియన్లుగా ప్రకటించుకుంటున్నారు. మరికొందరైతే వైద్యులుగా, వివిధ రకాల థెరపిస్టులుగా చెలామణి అవుతున్నారు. ఆరోగ్యం, పోషకాహారం, వైద్యానికి సంబంధించి యూ ట్యూబ్, ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికల్లో సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ఇంకొందరైతే ఒకడుగు ముందుకు వేసి క్యాన్సర్ వంటి రోగాల నివారణకు 'మిరాకిల్ డైట్'ను సూచిస్తున్నారు. అయితే వీటికి ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు ఉండడం లేదు. వీరు చెబుతున్న అసత్యాలు, అర్ధ సత్యాలను విని చాలా మంది తమ ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారు. సరైన చికిత్సను నిర్లక్ష్యం చేస్తూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు.

గతంలోనే ఆందోళన వ్యక్తం చేసిన ఐ.ఎం.ఏ

'క్యాన్సర్, ఇతర తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్న వారు సోషల్ మీడియాలో చూసిన తప్పుడు సలహాలు నమ్మి సరైన వైద్యాన్ని, చికిత్సను ఆలస్యం చేస్తున్నారు. దీనివల్ల వ్యాధి ముదురుతున్నది. అనంతరం చికిత్స చేయడం కష్టమవుతున్నది' అని గతంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐ.ఎం.ఏ) చాలాసార్లు ఆందోళన వ్యక్తం చేసింది. అంతేకాకుండా స్వలాభం కోసం కొంతమంది నకిలీ నిపుణులు మార్కెట్లో లభించే కొన్ని నాణ్యత లేని ఉత్పత్తుల అడ్వర్టయిజ్‌మెంట్ కోసం సలహాలు, సూచనలు ఇస్తున్నారు. వాటిని తీసుకున్న వారి కాలేయం, కిడ్నీలపై ప్రభావం పడుతున్నట్లు తెలుస్తున్నది.

పోషకాహార లోపంతో...

చాలామంది కొన్ని రకాల ఆహార పదార్థాలను పూర్తిగా మానేయమని సలహా ఇస్తున్నారు. దీనివల్ల శరీరానికి అవసరమైన పోషకాలు లభించక పోషకాహార లోపం ఏర్పడుతున్నది. బరువు తగ్గడం లేదా ఇతర ఆరోగ్య సమస్యలకు దారితీస్తున్నది. మరికొందరు ఒకేరకమైన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని చెబుతుండడంతో అవసరమైన విటమిన్లు, ప్రొటీన్లు, ఖనిజాలు అందకుండా పోతున్నాయి. అంతేకాకుండా కొంతమంది ఇస్తున్న తప్పుడు సలహాలు దీర్ఘకాలం పాటించినా....బరువు తగ్గకపోవడం, ఆరోగ్యం మెరుగు కాకపోవడంతో అనేక మంది మానసిక ఆరోగ్యంపై ప్రభావం పడుతున్నది. ఇన్‌స్టాగ్రామ్‌లో అనేక మంది ఇన్‌ఫ్లుయన్సర్లు అపెటమిన్ వంటి ఔషధాలను ప్రమోట్ చేస్తున్నారు. ఇవి ఆకలిని పెంచే లక్షణాలతో శరీర ఆకృతిని మార్చడానికి ఉపయోగపడతాయని చెబుతారు. అయితే, ఈ ఔషధం ఎఫ్.డి.ఏ ఆమోదం పొందలేదు. లివర్ టాక్సిసిటీ వంటి తీవ్రమైన దుష్ప్రభావాలను సైతం కలిగిస్తున్నది.

ఆరోగ్యానికి ప్రమాదం

సంబంధిత రంగానికి సంబంధించి ఎలాంటి చదువు, డిగ్రీలు లేకుండా సలహాలు ఇచ్చే వారిని కట్టడి చేయకుంటే భవిష్యత్తులో ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదముంది. దీనికోసం కేంద్ర ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించాల్సిన అవసరమున్నది. డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమిడీస్ యాక్ట్-1954 ప్రకారం రోగ నివారణలపై ఎలాంటి ప్రమాణాలు లేకుండా ప్రకటన చేయడం నిషిద్ధం. కన్జ్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్ ప్రకారం మోసపూరిత సేవలందించిన వారిపై చర్యలు తీసుకోవచ్చు. ఐ.టి యాక్ట్ ప్రకారం తప్పుడు సమాచారం పంపిన వారికి జైలు శిక్ష, జరిమానా కూడా విధించవచ్చు. 2023లో కేంద్రం తీసుకొచ్చిన డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు ఆన్‌లైన్‌లో తప్పుడు సలహాలు ఇస్తూ.. తప్పుడు సమాచారం వ్యాప్తి చేసే వారిపై చర్యలు తీసుకోవడానికి ఉపయోగపడుతుంది. అనర్హులైన వ్యక్తులు వైద్య సలహాలు ఇవ్వడం భారతదేశంలో ఇండియన్ మెడికల్ కౌన్సిల్ యాక్ట్, 1956 లేదా డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్-1940 కింద నేరంగా పరిగణించబడవచ్చు. అయితే ఇప్పటి వరకు వీటిని కఠినంగా అమలు చేసిన సందర్భాలు చాలా తక్కువ. ఈ చట్టాలను కఠినంగా అమలు చేయడం ద్వారా నకిలీ వైద్యులను కట్టడి చేయవచ్చు. అంతేకాకుండా ఎలాంటి శాస్త్రీయ ప్రయోగాల్లో రుజువు కాని విషయాలను చెబుతూ.. నకిలీ వైద్య సలహాలు ఇచ్చే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా మరిన్ని ప్రత్యేక చట్టాలను రూపొందించాల్సిన అవసరమున్నది. ఇన్‌ఫ్లుయన్సర్లకు స్పాన్సర్‌షిప్‌ను స్పష్టంగా వెల్లడించమని అమెరికాలో ఎఫ్.టి.సి ఆదేశించింది. ఇలాంటి నిబంధనలను భారతదేశంలో కూడా అమలు చేయవచ్చు. అంతేకాకుండా సోషల్ మీడియాలో వచ్చే ప్రతి సలహాను గుడ్డిగా నమ్మవద్దని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలను రూపొందించి అమలు చేయాలి. ఐ.ఎం.ఏ వంటి సంస్థలు దీనికి చొరవ చూపాలి. యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వంటి సంస్థలు తమ ప్లాట్‌ఫామ్‌లలో తప్పుడు సమాచారం ఉన్న పోస్టులను గుర్తించి తొలగించాలి. దీనికోసం ముందుగా సంబంధిత రంగానికి చెందిన నిపుణులతో ధ్రువీకరణ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి.

ప్రజల్లోనూ అవగాహన అవసరం

జీవితంలో ఆరోగ్యం అనేది అత్యంత విలువైనది. ఈ విషయాన్ని ముందుగా ప్రజలు గ్రహించాలి. సోషల్ మీడియా వేదికలుగా సలహాలు ఇస్తున్న వారు నిజమైన వైద్యులేనా? ఆహారాన్ని సూచిస్తున్న వారు నిజంగానే న్యూట్రీషియనిస్ట్, డైటీషియన్ డిగ్రీలు పొందిన వారేనా? అనేది ముందుగా తెలుసుకోవాలి. నిజమైన వారంతా ఐడీఏ (ఇండియన్ డైటెటిక్ అసోసియేషన్)లో రిజిస్టరయి ఉంటారు. అయితే ఆన్‌లైన్‌లో ఇచ్చే సలహాలను మరోసారి వైద్య నిపుణులతో ధ్రువీకరించుకోవాల్సిన అవసరం ఉన్నది. మనిషి ఆరోగ్య పరిస్థితి, ఆహారపు అలవాట్లు, వైద్య చరిత్రను పూర్తిగా తెలుసుకున్న తర్వాతే... న్యూట్రీషియనిస్టులు, డైటీషియనిస్టులు ఒక ప్రత్యేకమైన ప్రణాళికలను సూచిస్తారనే విషయాన్ని మనం గుర్తించాలి.

- ఫిరోజ్ ఖాన్,
సెల్: 9640466464

జనవాక్యం

ప్రతిజ్ఞ రూపశిల్పి

పైడిమర్రి వెంకట సుబ్బారావు పేరు చెప్పగానే మనకి వెంటనే 'భారత దేశం నా మాతృ భూమి' ప్రతిజ్ఞ గుర్తుకువస్తుంది. ఆయన ప్రతిజ్ఞతో పాటు పలు రచనలు చేశారు. ఆయనకు పలు భాషలపై పట్టు ఉంది. నవలలు, వ్యాసాలు, కథలు, నాటికలు ఆయన కలం నుండి జాలువారాయి. ఆయన అష్టావధానం, శతావధానం కూడా చేసేవారు. ఉగాది కవి సమ్మేళనాలు నిర్వహించేవారు. తొలుత ఆయన ఆధ్యాత్మిక రచనలు చేశారు. కాలక్రమేణా ఆయన రచనలలో సామ్యవాదం, లౌకిక వాదం వంటి భావాలు కనిపించేవి. నిజాం నవాబు నిరంకుశ పాలనలో ప్రజలు ఎదుర్కొన్న కష్టాలు కన్పించేవి. ఆయన మలి రచనలలో మాత్రం బుద్ధుని ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. దేశంతో పాటు, దేశ ప్రజలు కూడా ముఖ్యం అని ప్రతిజ్ఞ ప్రభోదిస్తుంది. పైడిమర్రి విశాఖపట్నంలో ఖజానాధికారిగా పని చేస్తూ ఉండగా 1962 సెప్టెంబర్ 17న ప్రతిజ్ఞ రాశారు. అప్పుడే భారత్, చైనా మధ్య ఘర్షణ తలెత్తింది. విద్యార్థులలో దేశ భక్తి పెంచడానికి చైనాలో దేశభక్తి గీతాలు ఉన్నాయని పైడిమర్రి తెలుసుకున్నారు. ఆ స్ఫూర్తితోనే ఆయన ప్రతిజ్ఞ రాశారు. 1963లో తొలిసారి విశాఖపట్నంలో ఓ పాఠశాలలో విద్యార్థులు ప్రతిజ్ఞను ఆలపించారు. అనంతరం 1964లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని పాఠ్యపుస్తకాలలో ప్రతిజ్ఞను తొలిసారి ముద్రించారు. అదే విధంగా 1965 నుండి దేశవ్యాప్తంగా ఆలపిస్తున్నాం.

- యమ్. రామ్‌ప్రదీప్,
సెల్ : 9492712836

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com



పార్లమెంటు ఆవరణలో ఆందోళన చేస్తున్న ప్రతిపక్షాల నేతలు

పార్లమెంటులో కొనసాగిన ప్రతిష్టంభన

- ఓట్ల చోరీపై చర్చకు ప్రతిపక్షాల పట్టు
- ఆందోళనలు, నినాదాలతో మార్మోగిన పార్లమెంటు ప్రాంగణం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటు ఉభయసభల్లోనూ మంగళవారం కూడా ప్రతిష్టంభన కొనసాగింది. బీహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ, ఓట్ల చోరీ వ్యవహారంపై ప్రతిపక్షాలు చర్చకు పట్టుబట్టడం, ప్రభుత్వం అందుకు అంగీకరించకపోవడంతో వాయిదాల పర్వం కొనసాగింది. దీంతో ప్రతిపక్షాల సభ్యులు సభ నుంచి బయటకు వచ్చి పార్లమెంటు ఆవరణలోనే వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టారు. నినాదాలతో చట్టసభల ప్రాంగణం మార్మోగింది.

పార్లమెంటు మకర ద్వారం వద్ద ప్రతిపక్ష ఎంపిలు ఆందోళన చేపట్టారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత పాటించి ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని నినదించారు. బిజెపి పిరికి నియంతృత్వం..ప్రశ్నించే తమ గళాలను ఆపలేదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, ప్రజల హక్కు కోసం పోరాటాన్ని కొనసాగిస్తున్నామన్నారు. ఇటీవల బీహార్‌లో విడుదలైన ఓటరు ముసాయిదా జాబితాలో..మింతాదేవి అనే మహిళ పేరిట ఓటు ఉండటం..ఆమె వయస్సు 124 ఏళ్లగా పేర్కొనడం.. వంటి అనేక విస్తుపోయే అంశాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో 'మింతాదేవి ఓటు' చిత్రంతో '124 నాటౌట్' అని రాసివున్న టీషర్టులు ధరించి ఎంపీలు నిరసన వ్యక్తం చేశారు. ఈ ఆందోళనలో కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సీనియర్ నాయకులు సోనియా గాంధీ, కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా, టిఎంసి ఎంపి డెరెక్ ఓ బ్రెయిన్, డిఎంకె ఎంపిలు టిఆర్ బాలు, తిరుచ్చి శివ, కనిమొళి, ఎన్‌సిపి నేత సుప్రియా సులే, సిపిఎం ఎంపిలు జాన్ బ్రిట్టాస్, అమ్రారామ్, రాధాకృష్ణన్, శివదాసన్, ఎస్. వెంకటేషన్, ఎఎ రహీం, సిపిఐ ఎంపి సంతోష్ కుమార్, ఎస్‌పి ఎంపి రాంగోపాల్ యాదవ్, ఆర్‌జెడి ఎంపి మనోజ్ కుమార్ ఝా, జెఎంఎం ఎంపి మహువా మాంఝీ, శివసేన ఎంపి అరవింద్ సావంత్ తదితరులు ఆందోళనలో పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా ఓట్ల చోరీ : రాహుల్ గాంధీ

దేశవ్యాప్తంగా ఓట్ల దొంగతనం, ఇతర అక్రమాలు కొనసాగాయని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. గతేడాది కర్ణాటక, మహారాష్ట్రల్లోనూ బిజెపితో కలిసి ఓట్ల చోరీ చేసిన ఎన్నికల కమిషన్, ఈ ఏడాది చివరలో జరుగనున్న బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఓట్ల చోరీకి సన్నద్ధమవుతోందని ఆరోపించారు. ఎస్ఐఆర్ ఇందుకోసమే చేపట్టారని ఆయన అన్నారు. ఒకటిరెండు కాదు..అనేక చోట్ల ఈ చోరీ కొనసాగుతోందన్నారు. ఇది రాజ్యాంగానికి విఘాతమని, రాజ్యాంగ పరిరక్షణ కోసం చేపట్టిన ఈ పోరాటంలో వెనకడుగు వేయబోమన్నారు. 'మేము రాజ్యాంగాన్ని పరిరక్షిస్తున్నాం. ఒక వ్యక్తి - ఒక ఓటు అనే విధిని ఎన్నికల కమిషన్ పాటించడం లేదు. ఇది సినిమా చూపించడమే' అని రాహుల్ వ్యాఖ్యానించారు.

సవరణలా? చేర్పులా?

- కొత్తగా 64 వేల దరఖాస్తులు
- అయోమయంగా 'ఎస్ఐఆర్'
- స్పష్టత ఇవ్వని ఇసి

న్యూఢిల్లీ : బీహార్‌ కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో రోజుకో వివాదం తెరమీదకు వస్తోంది. ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ అయోమయంగా సాగుతోంది. సవరణల కోసమని చేపట్టిన ఈ ప్రక్రియలో ఇప్పుడు కొత్త చేర్పులు కూడా భారీగా చోటుచేసుకోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. మొదటి సారి ఓటు నమోదు కోసం ఏకంగా 64 వేల మంది దరఖాస్తులు చేసుకున్నట్లు సమాచారం. ఎన్నికల సంఘం వెల్లడించిన తాజా ముసాయిదా అనంతరం 10 రోజుల్లో అంటే ఆగస్టు 11 నాటికి కొత్తగా ఓట్ల నమోదు కోసం 63,571 మంది దరఖాస్తు చేసుకున్నారని ఇసి తెలిపింది. అయితే కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారిలో ముసాయిదా జాబితాలో పేరు లేనివారు ఎంత మంది ఉన్నారు.. లేదా 18 సంవత్సరాలు నిండిన మొదటిసారి ఓటర్లు ఎంత మంది ఉన్నారు అనే వివరాలను ఇసి వెల్లడించలేదు. అధికారంలో ఉన్న వారికి లబ్ధి చేకూర్చడానికే ఎస్ఐఆర్ నిర్వహిస్తున్నారనే ప్రతిపక్షాల విమర్శలకు తాజా పరిణామాలు బలం చేకూర్చుతున్నాయి. ది రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టోర్స్ రూల్స్ 1961 యొక్క రూల్ 13(ఎ) ప్రకారం ఓటర్ల జాబితాలో కొత్తగా పేరు చేర్చుకునేందుకు ఫారం 6ను నింపి, సమర్పించాలి. కొత్తగా 18 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న కొత్త ఓటర్లు ఈ ఫారమ్ ఉపయోగిస్తారు. అయితే ముసాయిదా జాబితాలో పేరు లేని సంబంధిత అధికారులను సంప్రదిస్తున్న ప్రజలను ఈ ఫారం 6ను నింపాలని ఆదేశిస్తున్నారని బీహార్‌లోని రాజకీయ పార్టీల నేతలంటున్నారు. అంటే ఒక వ్యక్తి దశాబ్దాలుగా ఓటు వేస్తున్నప్పటికీ అతని పేరు ముసాయిదా జాబితాలో లేకపోతే ఈ ఫారం నింపాల్సి ఉంటుంది. దీంతో తర్వాత నూతన ఓటర్ల జాబితా ప్రచురించినప్పుడు అతని పేరు ఉంటుంది. అయితే ఇలాంటి చర్యతో నూతన ఓటర్ల జాబితాలో నిజంగా ఎంత మంది కొత్త ఓటర్లు చేరారో. ఎంత మంది పాత ఓటర్లు ఉన్నారో గుర్తించడం దాదాపు అసాధ్యం. ఈ పరిస్థితి గురించి మాజీ ఎన్నికల కమిషనర్ అశోక్ లావాసా మాట్లాడుతూ బీహార్‌లో ఎస్ఐఆర్‌ను కొత్త ఓట్ల జాబితాను తయారు చేసే విధంగా పరిగణించడమేనని తెలిపారు.

గాజాలో కొనసాగుతున్న ఇజ్రాయిల్ దాష్టీకాలు

- 24 గంటల్లో మరో 89 మంది మృతి
- ఆహార కేంద్రాలపై అమానవీయ దాడులు
- ఆకలి రక్కసికి ఐదుగురు బలి

గాజా : అమెరికా అండదండలతో ఇజ్రాయిల్ సాగిస్తున్న దాష్టీకాలకు హద్దే లేకుండా పోతోంది. గాజాలో సాగిస్తున్న ఇజ్రాయిల్ అమానీయ దాడుల్లో మంగళవారం ఉదయం 10 గంటలకు గడిచిన 24 గంటల్లో 89 మంది పాలస్తీనియన్లు మరణించారు. మరో 513 మంది గాయపడ్డారు. వీరిలో 31 మంది ఆహారం కోసం వచ్చి అశువులు బాసిన వారేనని గాజా ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. మానవతా సాయంపై తీవ్ర ఆంక్షలు అమలవుతున్న నేపథ్యంలో ఇద్దరు చిన్నారులతో సహా ఐదుగురు పాలస్తీనియన్లు కరువు బారిట పడి కన్నుమూశారని పేర్కొన్నారు. దీంతో ఆకలితో అలమటిస్తూ మరణించిన వారి సంఖ్య 227కి చేరుకోగా, వారిలో 103 మంది చిన్నారులే కావడం విచారకరం. మే27 నుండి ఆహార కేంద్రాల వద్ద దాడుల్లో మరణించినవారి సంఖ్య 1655 కాగా, 11,800మందికి పైగా గాయపడ్డారు. ఆహార పంపిణీ కేంద్రాల నుండి గాయపడి వస్తున్నవారితో ఆస్పత్రులు నిండిపోతున్నాయని, ముఖ్యంగా రక్తం, ప్లాస్మా కొరత బాగా వుందని ఐక్యరాజ్య సమితి ఆందోళన వ్యక్తం చేసింది. ఐదేళ్ళలోపు చిన్నారులు దాదాపు 12వేల మంది తీవ్ర పోషకాహార లోపంతో బాధపడుతున్నారని జులై మాసంలో గుర్తించారు.

గాజాలో నలుగురు జర్నలిస్టులను ఇజ్రాయిల్ బలగాలు హతమార్చిన నేపథ్యంలో పాలస్తీనియన్లు వారికి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా ఈ హత్యలపై లండన్, బెర్లిన్, ట్యునిస్, రమల్లాతో సహా ప్రపంచవ్యాప్తంగా పలుచోట్ల ర్యాలీలు, నిరసనలు చోటు చేసుకున్నాయి. ఇయు, చైనా, జర్మనీలు ఈ దాడిని తీవ్రంగా ఖండించాయి. ఇది అంతర్జాతీయ మానవతా చట్టాన్ని తీవ్రంగా ఉల్లంఘించడమేనని ఐక్యరాజ్య సమితి వ్యాఖ్యానించింది.

గాజాలో మానవతా సంక్షోభం అనూహ్యమైన స్థాయిలకు చేరిందని బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, జపాన్, మరో 23 యురోపియన్ దేశాలు పేర్కొన్నాయి. గాజాలోకి మరింత సాయాన్ని అనుమతించాల్సిందిగా ఇజ్రాయిల్‌కు విజ్ఞప్తి చేశాయి.

అప్పుల బాధతో సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య

ప్రజాశక్తి- కంటోన్మెంట్ (విజయనగరం జిల్లా)

అప్పుల బాధలు భరించలేక సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన విజయనగరంలోని గౌడు వీధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గౌడు వీధికి చెందిన ముంగర అవినాష్ (32) మెరకముడిదాం మండలం ఊటపల్లిలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నారు. బెట్టింగులు, లోన్ యాప్‌లతో అప్పులపాలయ్యారు. ఆయన భార్య భాగ్యలక్ష్మి ఓ ప్రైవేట్ స్కూల్లో ఉపాధ్యాయినిగా పనిచేస్తుంది. భాగ్యలక్ష్మి స్కూలుకు వెళ్లిన సమయంలో అవినాష్ తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. టూ టౌన్ ఎస్ఐ ఎం.కృష్ణమూర్తి సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బిటిపిలో పెరుగుతున్న నీటిమట్టం

ప్రజాశక్తి-గుమ్మగట్ట (అనంతపురం)

కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలతో భైరవానితిప్ప ప్రాజెక్టుకు నీరు భారీగా చేరి నీటి మట్టం పెరుగుతోంది. బిటిపికి నీటి ఉధృతి పెరిగిన నేపథ్యంలో ఆర్డీవో వసంత్ బాబు మంగళవారం నాడు ప్రాజెక్టును పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిటిపి సాధారణ నీటిమట్టం 1655 క్యూసెక్కులు(55అడుగులు) కాగా ఇప్పటికే 1652 క్యూసెక్కుల నీరు చేరిందన్నారు. వరద ప్రవాహం 1964 క్యూసెక్కులు ఉందన్నారు. వరద ప్రవాహం ఇలాగే కొనసాగితే రెండు, మూడు రోజుల్లో పూర్తి సామర్థ్యంతో బీటీ ప్రాజెక్టు నిండుతుందన్నారు. ప్రాజెక్ట్ అధికారులకు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ వరద ఉధృతమైతే దిగువకు వదలటానికి సిద్ధంగా ఉండాలే అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు.

కార్పొరేట్ల క్లయింట్లతో సెంట్రల్ బ్యాంక్ ఇడి భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రభుత్వ రంగంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎంవి మురళీ కృష్ణ మంగళవారం హైదరాబాద్‌లో కార్పొరేట్ క్లయింట్లతో భేటీ అయ్యారని ఆ బ్యాంక్ ఓ ప్రకటనలో తెలిపింది. పారిశ్రామిక వర్గాల క్లయింట్లతో భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం, వారితో సన్నిహితంగా సంప్రదింపులు చేసే లక్ష్యంగా ఈ పర్యటన కొనసాగిందని పేర్కొంది. సెంట్రల్ బ్యాంక్ హైదరాబాద్ జోనల్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో బ్యాంక్ ప్రస్తుతం అధిక ద్రవ్యత (లిక్విడిటీ) కలిగి ఉందని, దీంతో రుణ వృద్ధి కోసం చురుకుగా ముందుకు సాగుతోందని మురళీ కృష్ణ తెలిపారు. బ్యాంక్ కీలక కార్యక్రమాలు, సంస్థాగత అప్‌డేట్‌లు, భవిష్యత్తు వృద్ధి అవకాశాలపై చర్చించారు. ప్రస్తుతం రూ. 7 లక్షల కోట్ల వ్యాపారాన్ని కలిగి ఉన్న తమ బ్యాంక్ ఈ ఏడాది రూ. 8 లక్షల కోట్ల వ్యాపార లక్ష్యాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ లక్ష్య సాధనలో కార్పొరేట్ క్లయింట్లతో సన్నిహిత సహకారం కీలకమని అన్నారు.

పులి దాడిలో గేదె మృతి

ప్రజాశక్తి - గిద్దలూరు రూరల్ (ప్రకాశం జిల్లా)

పులి దాడిలో గేదె మృతిచెందిన ఘటన ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. ఎల్లుపల్లె గ్రామానికి చెందిన మోడి కొత్త చిన్న రంగస్వామికి చెందిన ఓ గేదె రెండు రోజులుగా ఇంటికి తిరిగి రాకపోవడంతో సమీప పొలాల్లో గాలించారు. నల్లమల అటవీ ప్రాంత సమీపంలోని జామాయిల్ తోటలో గేదె విగతజీవిగా పడి ఉండడాన్ని గమనించారు.

భారతీయ భావాన్ని, రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

- ఎన్‌డిఎ కూటమిలో ఒక పార్టీగా మారిన ఇసి
- సామూహిక ఓట్ల తొలగింపు ప్రజాస్వామ్యానికి ప్రమాదం
- సదస్సులో బివి రాఘవులు



సదస్సులో మాట్లాడుతున్న బివి రాఘవులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపి నాయకులు ఆధునిక కాలానికి అనుగుణంగా సూటు బూటు వేసుకున్నా వారి మనసులో ఫ్యూడల్ భావాలే ఉన్నాయని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు విమర్శించారు. రాచరిక వ్యవస్థను తేవాలని భావిస్తున్నారని అన్నారు. సిపిఎం పూర్వ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి జయంతి సందర్భంగా 'రాజ్యాంగం-ఎన్నికల కమిషన్-దొంగ ఓట్లు' అనే అంశంపై మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సెమినార్ నిర్వహించారు. ప్రధాన వక్త రాఘవులు మాట్లాడుతూ బిజెపి అనుసరిస్తోన్న నియో ఫాసిస్టు విధానాలపై సెప్టెంబర్ 12 వరకు నెలరోజులపాటు దేశవ్యాప్త క్యాంపెయిన్ చేపట్టాలని పిలుపునిచ్చారు. భారతీయ భావాన్ని ఏచూరి ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లారన్నారు. ఇది హిందువుల దేశమా?, అన్ని మతాల ప్రజల దేశమా? అనే దానిపై చర్చ జరిగిందన్నారు. దేశంలో అనేక మతాలు, భాషలు, ఆహారపు అలవాట్లు, సంస్కృతి, సంప్రదాయాలు, తాత్విక చింతన కలిస్తేనే భారతీయ భావన అవుతుందని వివరించారు. కానీ, బిజెపి సంకుచిత ధోరణితో ఒక భావానికి, ఒక భాషకు, ఒక ఆహారానికి, ఒక జాతికి పరిమితమై ఆలోచిస్తోందని, హిందూత్వ రాజ్యంగా మార్చాలని బిజెపి భావిస్తోందని, దేశాన్ని విడదీసి ప్రజల్లో ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు కుట్ర చేస్తోందని అన్నారు. నూతన ఆలోచన, ప్రశ్న, నిజం పట్ల బిజెపికి నమ్మకం లేదని తెలిపారు. సమానత్వాన్ని అంగీకరించడం లేదన్నారు. ఇండియా అయినా, భారత్ అయినా కులం, మతం, లింగభేదం లేకుండా పౌరులందరూ సమానమే అని రాజ్యాంగం చెప్తోందని వివరించారు. బిజెపి ఫ్యూడల్ వ్యవస్థను తేవాలనుకుంటోందని, కులాలు ఉండాలంటోందని తెలిపారు. స్వాతంత్ర్యానికి ముందు అందరికీ ఓటు హక్కు లేదన్నారు. దేశంలో ప్రతి ఒక్కరికీ సార్వజనీన ఓటును రాజ్యాంగం కల్పించిందని గుర్తు చేశారు. రాజ్యాంగ వ్యవస్థలను కేంద్రం నిర్వీర్యం చేస్తోందని, బిజెపి జేబు సంస్థగా ఎన్నికల కమిషన్ పనిచేస్తోందని అన్నారు. ఎన్‌డిఎ కూటమిలో ఒక పార్టీగా ఇసి మారిందని వివరించారు. అందులో భాగంగానే బీహార్‌లో ఎస్‌ఐఆర్‌ను చేపట్టిందన్నారు. సామూహికంగా ఓట్లను తొలగిస్తోందని వివరించారు. అర్హులను అనర్హులుగా ఇసి ప్రకటిస్తుండడం ప్రజాస్వామ్యానికి ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశారు. పౌరసత్వం వేరు, ఓటు హక్కు వేరని వివరించారు. హిట్లర్ కూడా ఎన్నికల ద్వారానే అధికారంలోకి వచ్చి రాజ్యాంగాన్ని తొలగించారని గుర్తు చేశారు. మోడీ ప్రభుత్వం కూడా అదే తరహాలో పాలన సాగిస్తోందని విమర్శించారు. అప్రమత్తంగా లేకుంటే రాజ్యాంగాన్ని మార్చి మనుధర్మాన్ని అమలు చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ పీఠిక నుంచి లౌకికవాదం, సోషలిస్టు పదాలను తొలగించాలనుకుంటోందని వివరించారు. కమ్యూనిస్టులంటే అమెరికా అధ్యక్షులు ట్రంప్‌నకు, దేశ ప్రధాని మోడీకి భయమన్నారు. భారతీయ భావాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకిక వాదాన్ని రక్షించుకోవాలని, సంకుచిత భావనలపై దేశవ్యాప్తంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఇదే ఏచూరికి ఇచ్చే నిజమైన నివాళని అన్నారు.

పార్లమెంటుకూ ప్రాధాన్యత ఇవ్వడం లేదు : జాన్‌వెస్లీ

మోడీ ప్రభుత్వంలో పార్లమెంటుకూ ప్రాధాన్యత ఉండడం లేదని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. ప్రతిపక్షం ఉండకుండా చేస్తున్నారని, ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష ఎంపిలను అణచివేస్తున్నారని అన్నారు. మోదీ నియంతృత్వంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఒకే ఇంట్లో వేల ఓట్లు ఎలా నమోదవుతున్నాయని ప్రశ్నించారు. రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి, సామాజిక న్యాయానికి బిజెపి వ్యతిరేకమన్నారు. ఇడి, సిబిఐ స్వతంత్రంగా వ్యవహరిస్తే బిజెపి నాయకులు, కేంద్ర మంత్రులు 70 నుంచి 80 శాతం మంది జైళ్లలో ఉంటారన్నారు. అధ్యక్షత వహించిన సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం, లౌకిక విలువలకు ప్రమాదం ఏర్పడిందన్నారు. రాజ్యాంగ మూలాలపై దాడి జరుగుతోందని వివరించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, జి నాగయ్య, టి సాగర్, ఎండి అబ్బాస్, మల్లు లక్ష్మి, బండారు రవికుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో వేగంగా ఎంఎస్‌ఎంఇలు

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధికి తీసుకున్న చర్యల ఫలితంగా 2024-25లో 7,43,826 యూనిట్లు నూతనంగా ప్రారంభమయ్యాయని గ్రామీణ పేదరిక నిర్మూలనశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2021-24 మధ్య ప్రారంభమైన యూనిట్లు 7,91,445 (94 శాతం) అని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న వినూత్న చర్యలు ఫలితంగా ఈ అభివృద్ధి సాధ్యమైందని మంత్రి తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1,500 ఎంఎస్‌ఎంఇ యూనిట్లు మూతపడ్డాయని, ఇది గత నాలుగేళ్లలో ప్రతి సంవత్సరం మూసివేసిన యూనిట్ల సంఖ్యకు రెట్టింపు అని పేర్కొనడం సత్యదూరమన్నారు. పరిశ్రమలు, ఉపాధి అభివృద్ధి విధానం 4.0లో భాగంగా ఒక కుటుంబానికి ఇక ఉద్యమనే కాన్సెప్ట్‌తో పలు ప్రోత్సాహకాలు ప్రారంభమయ్యాయని, 20కు పైగా పాలసీలు అమలవుతున్నాయన్నారు.

మాజీ సైనికులకు మరో అవకాశం

- హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మాజీ సైనికోద్యోగులకు డ్రోన్ల వినియోగంతో మరోసారి దేశానికి, సమాజానికి సేవలు అందించే అవకాశం వచ్చిందని, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్ పేర్కొన్నారు. విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో రాష్ట్ర సైనిక వెల్ఫేర్ డిపార్టుమెంట్, కోరమాండల్ ఇంటర్నేషనల్, దక్ష డ్రోన్స్ ఆధ్వర్యాన మంగళవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. డ్రోన్ల ద్వారా సేవలందించేందుకు ముందుకొచ్చే మాజీ సైనికులకు వాళ్లు ఉపాధి పొందుతూ మరికొంత మందికి స్వయం ఉపాధి అవకాశాలను కూడా కల్పించవచ్చన్నారు.

రాష్ట్ర సైనిక వెల్ఫేర్ డిపార్టుమెంట్ డైరెక్టర్ బ్రిగేడియర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. అతి త్వరలోనే సైనిక వెల్ఫేర్ డిపార్టుమెంట్ ఖాళీలను భర్తీ చేయనున్నామన్నారు. డిపార్టుమెంట్‌కు సంబంధించిన విషయాలు హోంశాఖకు వెళ్లిన వెంటనే హోంశాఖ కార్యదర్శి స్పందిస్తూ పూర్తి చేస్తున్నారన్నారు. మాజీ సైనికోద్యోగులు పిల్లలను పోషించే సమయంలో పెన్షన్‌పై జీవితాన్ని నెట్టుకొస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దక్ష డ్రోన్స్ సిఇఒ సమీర్ సచ్చిదానంద, ఆరెంటియస్ టెక్ సర్వీసెస్ ఎమ్‌డి ఆదిత్య మనోహర్ మాట్లాడారు. సైనిక వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్ పి సత్యప్రసాద్, ఎన్‌టిఆర్ జిల్లా సైనిక సంక్షేమ అధికారి కె కళ్యాణవీణ, మాజీ సైనికోద్యోగులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో యువత ముఖ్యపాత్ర పోషించాలి : గవర్నర్



గుడ్డ సంచులను చిన్నారులకు అందజేస్తున్న గవర్నర్

ప్రజాశక్తి-గుంటూరు

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో యువత, విద్యార్థులు ముఖ్యపాత్ర పోషించాలని, భవిష్యత్ తరాలకు కాలుష్యం లేని పర్యావరణాన్ని అందించటానికి కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. వార్ ఆన్ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో క్లైమెంట్ యాక్షన్ ప్లాన్ క్యాంపెయిన్, ప్లాస్టిక్ ఫ్రీ అమరావతి సిటీ క్యాంపెయిన్‌ను రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో గవర్నర్ ప్రారంభిం చారు. విద్యార్థులకు గుడ్డ సంచులను అందజే శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ నివారణ విద్యార్థులతోనే ప్రారంభం కావాలన్నారు. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నివేదిక ప్రకారం ప్రపంచంలో తలసరి ప్లాస్టిక్ వినియోగం సగటున 28 కేజీలు ఉండగా.. భారతదేశంలో 11 కిలోలు ఉందని తెలిపారు. దేశంలో ఏటా 3.5 మిలియన్ మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయన్నారు. ఆయా వ్యర్థాల వల్ల నేల, భూగర్భ జల నాణ్యత క్షీణిస్తుందని వివరించారు. రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణకు, అమరావతిని ప్లాస్టిక్ రహిత రాజధానిగా మార్చటమే లక్ష్యంగా రెడ్‌క్రాస్ క్యాంపెయిన్ చేపట్టటం అభినందనీయమ న్నారు. దీనిలో భాగంగా రాష్ట్రంలోని 52 డిగ్రీ కాలేజీల నుండి ఐదు వేల మంది విద్యార్థులు మొదటి దశలో 50 వేల గృహాలను దత్తత తీసుకొని ప్రతి నెలా మూడవ శనివారం పది గృహాలను సందర్శించి కాలుష్య నివారణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, ఘన వ్యర్థాలను వేరు చేసే విధానం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. లక్షల మంది యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లు పది లక్షల కుటుంబాలను కలిసి అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఇండియన్ రెడ్‌క్రాస్ ఏపీ స్టేట్ బ్రాంచ్ చైర్మన్ వై.డి.రామారావు, జనరల్ సెక్రెటరీ ఎ.కె.పరీదా, తదితరులు పాల్గొన్నారు.

24న అమెరికా బృందం రాక

న్యూఢిల్లీ : భారత్-అమెరికా మధ్య వాణిజ్య చర్చలను కొనసాగించే క్రమంలో ఆగస్టు చివరి వారంలో యుస్ బృందం ఇక్కడి రానుంది. ఈ నెల 24న అమెరికా ప్రతినిధి బృందం భారత్‌కు రావడంలో ఎలాంటి మార్పు లేదని వాణిజ్య శాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భన అంశంపై అమెరికా నుండి ఇప్పటివరకు ఎలాంటి రద్దు సందేశం రాలేదన్నారు. ఆగస్టు 25న ఢిల్లీలో ఇరు దేశాల మధ్య చర్చలు జరగనున్నాయి. ఇది భారత్‌పై ఇప్పటికే ఉన్న 25 శాతం టారిఫ్‌తో పాటు అదనంగా 25 శాతం టారిఫ్ అమలు గడువుకు రాకముందు ఈ చర్చలు జరగనున్నాయి.

సిట్‌కు 'సృష్టి' కేసు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసును సిట్‌కు బదిలీ చేసినట్లు హైదరాబాద్ నార్త్ జోన్ డిసిపి రష్మీ పెరుమాళ్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆమె మంగళ వారం మీడియాకు వెల్లడించారు. జులైలో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు చెప్పారు. "ఈ కేసులో మొదట ఎనిమిది మందిని, తర్వాత 16 మందిని, మొత్తం 24 మందిని అరెస్టు చేశాం. అరెస్టయిన వారిలో వైద్యులు, ఏజెంట్లు ఉన్నారు. రెండో కేసులో చనిపోయిన బేబీని చూపించి బాధితుల నుంచి రూ. పది లక్షలు నుంచి రూ.20 లక్షలు వసూలు చేశారు. డాక్టర్ నమ్రత బ్యాంక్ ఖాతాను నిలిపివేశాం. గైనకాలజీ డాక్టర్ సూరి శ్రీమతి పేరుపై ఉన్న లైసెన్స్ నంబర్, లెటర్ హెడ్స్‌తో అక్రమాలు చేశారు. ఆమె ఫిర్యాదు చేయడంతో మరో కేసు నమోదు చేశాం" అని తెలిపారు. సికింద్రాబాద్‌లో సృష్టి సెంటర్‌ను ఎలాంటి అనుమతులు లేకుండా నడిపిస్తున్నారని, ఈ సెంటర్‌కు అనుమతులు రద్దయి చాలా కాలమైందని వివరించారు. ధనశ్రీ సంతోషి ప్రధాన ఏజెంట్ కాగా.. మరికొందరిని సబ్ ఏజెంట్లుగా నియమించుకొని నెట్‌వర్క్‌ను విస్తరించారని తెలిపారు. విశాఖ నుంచి పిల్లల వైద్యురాలు విద్యుల్లత, వైద్యులు రవి, ఉష పనిచేశారని, ఈ కేసులో సరోగేట్‌గా, అండదానం ఇచ్చే వారిగా కొందరు మహిళా ఏజెంట్లు నటించారన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మా వర్కర్స్ కూడా ఈ కేసులో భాగస్వాములుగా ఉన్నారని తెలిపారు. తొమ్మిది నెలల పూర్తవుతున్న గర్భవతులను గుర్తించి సరోగసీ కోసం వచ్చిన తల్లిదండ్రులకు అప్పగించారని, మగ బిడ్డకు రూ. 4.5 లక్షలు, ఆడబిడ్డకు రూ. మూడు లక్షల ధర నిర్ణయించారని వివరించారు. ఇలాంటి సెంటర్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమతులు ఉన్న వాటినే సంప్రదించాలని డిసిపి సూచించారు.

బీమాను అందరికీ చేర్చడమే లక్ష్యం

- ఎల్ఐసి ఎండి, సిఇఒ ఆర్ దొరైస్వామి

న్యూఢిల్లీ : దేశంలో ప్రతీ ఒక్కరికీ జీవిత బీమాను చేర్చాలని నిర్దేశించుకున్నామని ప్రభుత్వ రంగంలోని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి) ఎండి, సిఇఒ ఆర్ దొరైస్వామి తెలిపారు. 2047 నాటికి అందరికీ బీమా లక్ష్యంగా పెట్టుకున్నామని మంగళవారం ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దొరైస్వామి తెలిపారు. సెప్టెంబర్‌తో ముగియనున్న రెండో త్రైమాసికంలో పాలసీల విక్రయాల్లో మరింత వృద్ధి నమోదు కానుందన్నారు. ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరం ప్రీమియంలో రెండంకెల వృద్ధిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 2025 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఎల్ఐసి పాలసీ అమ్మకాల ప్రీమియం 9.45 శాతం వద్ధితో రూ.54,238 కోట్లకు చేరింది. ఇది 2024-25లో రూ.49,543 కోట్లుగా ఉంది. 2026 జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికంలో కొత్త బిజినెస్ ప్రీమియం (ఎన్‌సిపి) 19.78 శాతం పెరిగి రూ.11,337 కోట్లకు చేరింది. 2026 మార్చి నాటికి ఐదారు కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టాలని ఎల్ఐసి లక్ష్యంగా పెట్టుకుంది. అదే విధంగా కృత్రిమ మేధా (ఎఐ)ను పాలసీ సేవలు, క్లెయిమ్ ప్రాసెసింగ్‌లో ఉపయోగించుకోవాలని ఎల్ఐసి యోచిస్తోంది. గడిచిన జూన్ త్రైమాసికంలో ఎల్ఐసి నికర లాభాలు 9.61 శాతం పెరిగి రూ.10,461 కోట్లుగా చోటు చేసుకుంది. మొత్తం ప్రీమియం ఆదాయం 15.27 శాతం వృద్ధితో రూ.1.14 లక్షల కోట్లకు చేరింది.

ఐదేళ్ళలో రూ.5.82 లక్షల కోట్ల రుణాల మాఫీ!

- అత్యధికభాగం కార్పొరేట్లకే
- ప్రభుత్వ రంగ బ్యాంకులు రద్దు చేశాయని వెల్లడించిన కేంద్రం



రాజ్యసభలో మాట్లాడుతున్న మంత్రి పంకజ్ చౌదరి (ఫైల్)

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ బ్యాంకులు గత ఐదేళ్ళ కాలంలో రూ.5.82 లక్షల కోట్ల మేరా రుణాలను రద్దు చేశాయి. ఈ రుణాలు తీసుకున్నవాళ్లలో అత్యధిక భాగం కార్పొరేట్ కంపెనీలు, బడా పెట్టుబడిదారులేనన్న సంగతి తెలిసిందే. ఈ మేరకు రాజ్యసభలో అడిగిన ఒక ప్రశ్నకు రాతపూర్వక సమాధానంగా కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఈ వివరాలు వెల్లడించారు. 2024-25లో ఇలా రద్దుచేసిన రుణాలు రూ.91,260కోట్లు కాగా, అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో ఈ మొత్తం రూ.1.15లక్షల కోట్లుగా వుందని మంత్రి తెలిపారు. 2020-21 సంవత్సరంలో అత్యధికంగా రూ.1.33 లక్షల కోట్లు రుణాలు రద్దు చేశారు. ఆ తర్వాత సంవత్సరం ఆ మొత్తం రూ.1.16లక్షల కోట్లకు తగ్గింది. ఆ మరుసటి సంవత్సరం అంటే 2022-23లో రూ.127లక్షల కోట్లు రుణాలు రద్దయ్యాయి. ఇదే సమయంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు దాదాపు రు.1.65 లక్షల కోట్లను రికవరీ చేసుకున్నాయి. మొత్తంగా రద్దు చేసిన రుణాలతో పోలిస్తే రికవరీ రేటు దాదాపు 28 శాతంగా వుందని మంత్రి వెల్లడించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆమోదించిన మార్గదర్శకాలు, బ్యాంకుల బోర్డులు ఆమోదించిన విధానాల ప్రకారం నాలుగు సంవత్సరాలు పూర్తయిన తర్వాత పూర్తి కేటాయింపులు జరిపిన వాటితో సహా ఎన్‌పిఎలను బ్యాంకులు రద్దు చేస్తాయని మంత్రి తెలిపారు. ఇలాంటి రుణాల రద్దు చర్యల వల్ల రుణం తీసుకున్నవారికి ఎలాంటి లబ్ది చేకూరదని అన్నారు. రుణాలు తీసుకున్న వారు తిరిగి చెల్లింపులు జరపాల్సి వుంటుందన్నారు. ఈ ఖాతాల్లో రికవరీ చర్యలను బ్యాంకులు కొనసాగిస్తాయని తెలిపారు. ఇలా రద్దు చేసిన రుణాలకు సంబంధించి రికవరీ ప్రక్రియ అనేది నిరంతరంగా కొనసాగుతూ వుంటుందన్నారు. ఇందుకుగానూ వివిధ రకాలైన రికవరీ యంత్రాంగాలను ఉపయోగిస్తారన్నారు. సివిల్ కోర్టుల్లో లేదా రుణాల రికవరీ ట్రిబ్యునళ్ళలో కేసు వేయడం, జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో కేసులు దాఖలు చేయడం తదితర రకాలు వుంటాయన్నారు.

ఏచూరికి అరుణాంజలి



న్యూఢిల్లీ : కమ్యూనిస్టు యోధుడు, ప్రజల ప్రియతమ నాయకులు కీర్తిశేషులు కామ్రేడ్ సీతారాం ఏచూరి జయంతి సందర్భంగా మంగళవారం దేశవ్యాప్తంగా ఆయనకు అరుణాంజలి ఘటించారు. ఏచూరి ప్రథమ వర్ధంతిని ఆగస్టు 12 నుండి సెప్టెంబరు 12 మధ్య పాటించాల్సిందిగా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కేంద్ర కమిటీ గత సమావేశంలో పిలుపునిచ్చిన సంగతి విదితమే. ఈ పిలుపులో భాగంగా, పొలిట్‌బ్యూరో సభ్యులు, కేంద్ర కమిటీ సభ్యులు, కేంద్ర కమిటీ కార్యాలయం, ప్రజా సంఘాల నుండి పనిచేస్తున్న ఇతర నేతలు, కార్యకర్తలు అందరూ మంగళవారం ఉదయం న్యూఢిల్లీలోని ఎకె గోపాలన్ భవన్‌లో ఉన్న కేంద్ర కమిటీ కార్యాలయంలో సమావేశమై సీతారాం ఏచూరికి పుష్పాంజలి ఘటించారు. దేశవ్యాప్తంగానూ సిపిఎం రాష్ట్ర కమిటీలు, కార్మిక, ప్రజా సంఘాలూ వివిధ రూపాల్లో ఆయనకు ఘన నివాళులర్పించాయి.

'ఆశ'లు నెరవేరాయి

(మొదటిపేజీ తరువాయి)

కలిసి వినతిపత్రాలు అందించామన్నారు. యూనియన్ పోరాటం ఫలించిందని పేర్కొన్నారు. ఆశా వర్కర్లు సంఘటితంగా పోరాడి విజయం సాధించినందుకు రాష్ట్ర కమిటీ అభినందనలు తెలిపింది. భవిష్యత్తులో వేతనాల పెంపు, దహన సంస్కారాలకు ఆర్థికసాయం, ఇతర డిమాండ్ల పరిష్కారానికి మరింత ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చింది. వెలగపూడి సచివాలయంలో వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి, కోశాధికారి ఎ కమల, రాష్ట్ర నాయకులు కె లక్ష్మి, చిట్టి కుమారి, రేణుక, సుగుణ, శ్యామల, వాణి, భారతి తదితరులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రచారార్భాటం కోసమే పి-4

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంపీలు కేంద్ర ప్రభుత్వాన్ని, భారత ఎన్నికల సంఘాన్ని నిలదీస్తున్నా సమాధానం లేదన్నారు. ఈ వ్యవహారాన్ని ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా తప్పుబడుతూ పార్లమెంట్‌ను కుదిపేస్తున్నాయని తెలిపారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా పోరాడుతున్న ఎంపిలను అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. ముస్లిం, మైనార్టీలకు ఓటు హక్కు లేకుండా చేసేందుకు బిజెపి కుట్రలు చేస్తోందని తెలిపారు. భారత్‌పై ట్రంప్ సుంకాలేస్తున్నా ప్రధాని మౌనంగా ఎందుకు ఉంటున్నారని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి రైతుల పచ్చని పొలాలను బలవంతంగా లాగేసుకుని కార్పొరేట్లకు అప్పగిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వాలకు కార్పొరేట్ కంపెనీలకు మేలు చేసే ఆలోచన తప్ప, ప్రజలకు మేలు చేయాలన్న ఉద్దేశం లేదన్నారు. ఇలాంటి పార్టీలకు ప్రజలు తగిన సమయంలో బుద్ధి చెబుతారని తెలిపారు. విలేకర్ల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి రామకృష్ణ, జెఎల్.నరసింహులు పాల్గొన్నారు.

'ఉప'పోరు ఉద్రిక్తం

(మొదటిపేజీ తరువాయి)

వైసిపి నాయకులు పోలీస్ స్టేషన్ వద్ద కడప-తిరుపతి రహదారిపై బైఠాయించారు.

పోలీసుల తీరును నిరసిస్తూ రోడ్డుపై ఎంపి బైఠాయింపు

పోలీసుల వ్యవహార శైలికి నిరసనగా ఎర్రగుంట్ల నాలుగు రోడ్ల కూడలిలో కడప ఎంపి అవినాష్‌రెడ్డి బైఠాయించారు. పులివెందుల పరిధిలోని మోట్నూతలపల్లి, ఎర్రిపల్లి, కణంపల్లి ప్రాంతాల్లో టిడిపి శ్రేణులు దౌర్జన్యాలకు, దారుణాలకు పాల్పడ్డాయని, ఓటర్లను ఓటు వేయనీయలేదని, ఓటర్ స్లిప్పులను లాక్కుని జమ్మలమడుగు ప్రాంతాల నుంచి వచ్చిన కొందరు దొంగఓట్లు వేశారని వైసిపి నాయకులు ఆరోపించారు. ఒంటిమిట్ట పోలింగ్ బూత్‌లో ఇరుపార్టీల కార్యకర్తల మోహరింపుతో కొంతసేపు పోలింగ్ నిలిచిపోయింది. కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్, ఎస్‌పి ఇజి.అశోక్‌కుమార్ కడప ఎంపి కార్యాలయానికి వచ్చి సంతకం చేయడానికి పోలీస్ స్టేషన్‌కు రావాలని ఎంపిని కోరారు. దీంతో, పోలీస్ స్టేషన్‌కు ఎంపి సాయంత్రం వెళ్లారు. సంతకం పెట్టాలని ఇచ్చిన పత్రాల్లో అసత్యాలు రాశారంటూ, దీనిపై తాను సంతకం పెట్టేది లేదంటూ అక్కడి నుంచి ఆయన వచ్చేశారు.

దొంగ ఓటర్లకు పోలీసుల రక్షణ -రాష్ట్ర ఎన్నికల అధికారికి అంబటి రాంబాబు ఫిర్యాదు

పులివెందులలో దొంగ ఓటర్లకు పోలీసులు రక్షణ కల్పించారని, టిడిపి గూండాలు ఇష్టారాజ్యంగా వ్యవహరించారని మాజీ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసిపి కార్యాలయంలో డిఐజి కోయ ప్రవీణ్ తిష్ట వేశారని, అరాచకాలపై ప్రశ్నిస్తారని ఎంపి అవినాష్‌రెడ్డిని బయటకు రానీయకుండా అడ్డుకున్నారని, టిడిపి మంత్రులు, ఎమ్మెల్యేలు, టిడిపి నేతలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని, ఓటర్లను కనీసం బయటకు కూడా రానివ్వలేదని విమర్శించారు. జమ్మలమడుగు, కమలాపురం ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున దొంగ ఓటర్లు వచ్చారని, ఇందుకు సంబంధించిన విషయాలను ఒంటిమిట్ట వైసిపి అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి ఆధారాలతో సహా వివరించారని తెలిపారు.

గ్రామీణ 'ఉపాధి'పై మోడీ సర్కార్ నిర్లక్ష్యం

- నిధులు ఇవ్వకుండా మీనమేషాలు
- జాప్యంపై స్టాండింగ్ కమిటీ ఆగ్రహం

న్యూఢిల్లీ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పట్ల కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలబింస్తున్న నిర్లక్ష్య ధోరణి మరోమారు తేటతెల్లమైంది. బడ్జెట్‌లో కేటాయించిన అరకొర నిధులను కూడా సకాలంలో మంజూరు చేయకుండా మీనమేషాలు లెక్కిస్తోంది. దీంతో ఉపాధి కార్మికులకు చెల్లించాల్సిన వేతనాలు, సామగ్రి బిల్లులకు తీవ్ర జాప్యం జరుగుతోంది. దీనిపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కార్మికులకు వేతనాల చెల్లింపులో జరుగుతున్న జాప్యాన్ని నివారించేందుకు వెంటనే పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖకు సూచించింది. సామగ్రి కొనుగోలుకు సంబంధించి తాను అడిగిన ప్రశ్నకు మంత్రిత్వ శాఖ సమాధానం దాటవేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇంతటి ముఖ్యమైన విషయాన్ని విస్మరించడమేమిటని నిలదీసింది. ఈ మేరకు కాంగ్రెస్ సభ్యులు సప్తగిరి ఉలాకా నేతృత్వంలోని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సోమవారం పార్లమెంటుకు నివేదిక సమర్పించింది. 2025-26 సంవత్సరానికి సంబంధించిన బడ్జెటరీ కేటాయింపులపై కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం...కార్మికులకు రూ.12,219.18 కోట్ల వేతనాలు పెండింగులో ఉన్నాయి. సామగ్రి కొనుగోలుకు సంబంధించి రూ.11,227.09 కోట్లు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుత బడ్జెట్‌లో బకాయిలు 27.26 శాతంగా ఉన్నాయి. అంటే కేటాయించిన నిధులలో నాలుగో వంతు నిధులను గత సంవత్సరపు బకాయిల చెల్లింపులకే ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరపు వాస్తవ బడ్జెట్ రూ.62,553.73 కోట్లు. బకాయిల చెల్లింపులో జాప్యం కారణంగా డిమాండ్‌కు అనుగుణంగా పథకాన్ని అమలు చేయడం కష్టమవుతుందని కమిటీ తెలిపింది. వేతనాలు, సామగ్రి కింద కేంద్ర ప్రభుత్వ వాటా నిధులను వెంటనే విడుదల చేయాలని, రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయాన్ని పటిష్టవంతం చేసుకోవాలని, బకాయిల చెల్లింపులో ఇకపై ఎలాంటి జాప్యం జరగకుండా సమర్ధవంతమైన చర్యలు చేపట్టాలని కమిటీ తన నివేదికలో సూచించింది.

కేంద్రం గుప్పిట్లోనే 'సెస్' వసూళ్లు

- రూ. 3.69 లక్షల కోట్లను నొక్కి పెట్టిన వైనం
- నిర్దేశిత పథకాలకు చేరని నిధులు
- కాగ్ నివేదికతో బహిర్గతం

న్యూఢిల్లీ : విద్యా, ఆరోగ్యం, చమురు పరిశ్రమ అభివృద్ధి.. వంటి వాటి కోసం చేస్తున్న సెస్ వసూళ్లను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తన గుప్పిట్లోనే ఉంచుకుంది. వాటిని సంబంధిత నిధులకు బదిలీ చేయడం లేదు. ఈ విషయాన్ని మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక వెల్లడించింది. సెస్ అనేది పన్నులకు అదనంగా విధించే లెవీ, దీనిని ఒక నిర్దిష్ట ప్రయోజనం కోసం ఉపయోగించాల్సి ఉంటుంది. కాగ్ నివేదిక ప్రకారం 2023-24 నాటికి రూ.3.69 లక్షల కోట్ల సెస్ వసూళ్లను సంబంధిత నిధులకు కేంద్రం బదిలీ చేయలేదు. విద్య, రక్షణ, జాతీయ రహదారులు, చమురు పరిశ్రమ అభివృద్ధి, ఆరోగ్యం వంటి వాటి కోసం విధించిన సెస్‌లను కేంద్ర ప్రభుత్వం వాటికి బదిలీ చేయలేదని నివేదిక తెలిపింది. 1974 నుంచి దేశంలో సెస్‌లను అమలు చేస్తున్నారు. సెస్ వసూళ్లలో ఎక్కువగా బదిలీ కావాల్సిన వాటిలో ఆయిల్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ బోర్డు (ఓఐడిబి) ముందు ఉంది. చమురు పరిశ్రమ (అభివృద్ధి) చట్టం 1974 ప్రకారం ఓఐడిబిను ఏర్పాటు చేశారు. దీనికి నిధులను బదిలీ చేయడం కోసం ముడిచమురు, సహజ వాయువుపై సెస్సు విధిస్తున్నారు. ఆర్థిక సంవత్సరం 1974-75 నుంచి ఆర్థిక సంవత్సరం 2023-24 వరకూ ముడి చమురుపై ప్రభుత్వం మొత్తం రూ. 2,94,850.56 కోట్ల సెస్‌ను వసూలు చేసినట్లు కాగ్ తన నివేదికలో పేర్కొంది. అయితే 1974-75 నుంచి 1991-92 వరకూ ప్రతీ ఏడాది వసూలు చేసిన సెస్ నుంచి రూ.902.40 కోట్లను మాత్రమే కేంద్రం ఓఐడిబికి బదిలీ చేశారు. తరువాత నుంచి ప్రతీ ఏడాది సెస్ వసూలు చేస్తున్నా ఓఐడిబికి ఎటువంటి నిధులను బదిలీ చేయలేదని కాగ్ తెలిపింది. ఒక్క మాటలో చెప్పాలంటే వసూలు సెస్ నుంచి కేవలం 0.3 శాతాన్ని మాత్రమే సంబంధిత నిధికి బదిలీ చేసిందని కాగ్ విమర్శించింది.

ఆరోగ్యం, విద్య కోసం వసూలు చేస్తున్న సెస్‌లను కూడా సంబంధిత నిధులకు కేంద్ర బదిలీ చేయడం లేదని కాగ్ తెలిపింది. 2004 ఏప్రిల్ 1 నుంచి వసూలు చేసే అన్ని పన్నులపై 2 శాతం విద్యా సెస్‌ను కేంద్రం విధించింది. ఇక 2007 నుంచి ఆదాయ పన్ను, సర్‌ఛార్జ్‌పై అదనంగా 1 శాతం మాధ్యమిక, ఉన్నత విద్యా సెస్‌ను కూడా కేంద్రం విధించింది. ఈ తరువాత అంటే 2018 ఏప్రిల్ 1 నుంచి ఈ రెండు సెస్‌లను తొలగించి వాటి స్థానంలో ఆరోగ్యం, విద్యా సెస్‌ను ప్రవేశపెట్టి 4 శాతం సెస్‌ను వసూలు చేస్తోంది. ఈ సెస్ వసూళ్లను ప్రారంభిక్ శిక్షా కోష్ (పిఎస్‌కె), మాధ్యమిక ఉచ్ఛతర్ శిక్షా కోష్ (ఎంయుఎస్‌కె), ప్రధాన్ మంత్రి స్వాస్థ్య సురక్షా నిధి (పిఎంఎస్ఎస్ఎన్)కు బదిలీ చేయాలి. అయితే 2028-19 నుంచి 2023-24 వరకూ వసూలు చేసిన సెస్ మొత్తం రూ. 37,537 కోట్లను సంబంధిత నిధులకు బదిలీ చేయలేదని కాగ్ తెలిపింది. అలాగే ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్‌కు రూ.2,505.5 కోట్లను, మానిటైజేషన్ ఆఫ్ నేషనల్ హైవేస్ ఫండ్‌కు రూ. 5,968.1 కోట్లను కేంద్రం బదిలీ చేయాల్సి ఉందని కాగ్ తెలిపింది.


చైనాకు టారిఫ్ గడువు పెంపు

- 90 రోజులకు పొడిగింపు
- అమెరికా నిర్ణయం



వాషింగ్టన్ : భారత్‌పై అధిక టారిఫ్‌లను అమలు చేయడంలో అమెరికా దూకుడుగా వ్యవహరిస్తోన్న వేళ.. మన పొరుగుదేశం చైనాతో మాత్రం తలొగ్గుతున్నట్లు కనిపిస్తోంది. టారిఫ్ అమలుకు చైనాకు అమెరికా 90 రోజులు గడువు పొడిగించింది. ఈలోగా చైనాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భావిస్తున్నారు. రష్యా చమురు కొనుగోలును కారణంగా చూపి భారత్‌పై ట్రంప్ ఇటీవల భారీస్థాయిలో 50 శాతం సుంకాలు విధించారు. అదే రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న చైనా విషయంలో మాత్రం ట్రంప్ భిన్నవైఖరిని అవలంభించడం విశేషం. యుఎస్ తాజా నిర్ణయంతో ఇరు దేశాలు విధించుకున్న అధిక సుంకాల అమలు నిలిచిపోయింది. అధిక సుంకాల అమలును నవంబర్ 10వ తేదీ అర్ధరాత్రి వరకూ నిలిపివేస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశానని ట్రంప్ తన సామాజిక ట్రూత్ సోషల్ మాధ్యమ వేదికలో ప్రకటించారు. అటు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ కూడా మంగళవారం ఉదయం సుంకాల విధింపునకు విరామం ప్రకటించింది. వాణిజ్యం, పెట్టుబడుల పరిమితి జాబితాలోకి అమెరికా సంస్థలను చేర్చడాన్ని కూడా 90 రోజులు వాయిదా వేసింది. చైనా వస్తువులపై అమెరికా 145 శాతం వరకూ సుంకాలు విధించకుండా తాజా కార్యనిర్వాహక ఆదేశాలు నిరోధిస్తాయి. అలాగే అమెరికా వస్తువులపై చైనా కూడా 125 శాతం టారిఫ్ విధించదు. ప్రస్తుతం చైనా దిగుమతులపై అమెరికా 30 శాతం, అమెరికా దిగుమతులపై చైనా 10 శాతం సుంకాలు విధిస్తున్నాయి. 'ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలలో పరస్పర వాణిజ్యం లేకపోవడం, దాని ఫలితంగా తలెత్తే జాతీయ, ఆర్థిక భద్రతా సమస్యలను పరిష్కరించడానికి చైనాతో అమెరికా చర్చలు కొనసాగిస్తుంది' అని ట్రంప్ తన ఉత్తర్వులలో తెలియజేశారు. కాగా చైనా, అమెరికా మధ్య సుంకాలపై గతంలో కుదిరిన ఒప్పందం మంగళవారం మధ్యాహ్నం ముగిసింది. తాజాగా గడువు పొడిగించడంతో క్రిస్మస్ సీజన్ కోసం దిగుమతులను పెంచుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది. ముఖ్యంగా తక్కువ సుంకాలతో ఎలక్ట్రానిక్స్, దుస్తులు, బొమ్మలు సహా పలు వస్తువులను అమెరికా దిగుమతి చేసుకోవచ్చు.

ఒప్పందపు గడువు పొడిగింపు ద్వారా జూన్‌లో రెండు దేశాల అధినేతల మధ్య కుదిరిన ఏకాభిప్రాయాన్ని మరింత ముందుకు తీసుకుపోవడానికి అవకాశం లభిస్తుందని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వం చేకూరుతుందని చైనా తెలిపింది. వాణిజ్య ఒప్పందానికి రెండు దేశాలు చేరువ అవుతున్నాయని, ఒప్పందం కుదిరితే ఈ సంవత్సరాంతం లోపు జిన్‌పింగ్‌తో సమావేశమవుతానని ట్రంప్ గత వారం తెలిపారు. రెండు దేశాలు పరస్పరం విధించుకున్న మూడంకెల దిగుమతి సుంకాలు ఆమోదయోగ్యం కావని, అవి ప్రపంచంలోని రెండు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్య నిషేధానికి కారణమయ్యాయని అమెరికా వాణిజ్య మంత్రి స్కాట్ బెస్సెంట్ పదే పదే చెబుతూ వచ్చారు.



క్యూబా అధ్యక్షులు మిగ్వేల్ డియాజ్ కానెల్‌తో సమావేశమైన వియత్నాం న్యాయశాఖ మంత్రి గుయెన్ హైనిన్

న్యాయ సహకారంలో క్యూబా, వియత్నాం ఒప్పందం

హవానా : క్యూబా, వియత్నాం దేశాల మధ్య దౌత్య సంబంధాలు నెలకొని 65 ఏళ్లు అయిన సందర్భంగా ఇరు దేశాలు న్యాయ రంగంలో సాంకేతిక సహాయాన్ని పెంపొందించుకునేందుకు, కొత్తగా లీగల్ విషయాల్లో సహకరించుకునే ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ సందర్భంగా క్యూబా అధ్యక్షులు మిగ్వేల్ డియాజ్ కానెల్ మాట్లాడుతూ వియత్నాం న్యాయ శాఖ మంత్రి గుయెన్ హై నిన్‌తో కలిసి రెండు సోషలిస్టు దేశాల మధ్య, ప్రజలు, ప్రభుత్వాలు, పార్టీల మధ్య గల స్నేహ, సహకార సంబంధాలను సమీక్షించామని చెప్పారు. ఇటీవల కాలంలో రెండు దేశాల మధ్య లీగల్ మార్పిడులు బాగాపెరిగాయని పేర్కొన్నారు. ఈ ఒప్పందంతో ఒక మైలురాయిని చేరుకున్నట్లు అయ్యిందని ఇరువురు నాయకులు తెలిపారు.

జర్మన్ పెట్టుబడిదారుల్లో సన్నగిల్లిన ధైర్యం, విశ్వాసం

- అమెరికాతో కొత్త వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో ఆందోళన

బెర్లిన్ : జర్మనీ పెట్టుబడిదారుల్లో ధైర్యం, విశ్వాసం ఆగస్టు మాసంలో అనుకున్నదాని కన్నా గణనీయంగా క్షీణించిందని ఒక సర్వేలో వెల్లడైంది. యురోపియన్ యూనియన్-అమెరికా మధ్య కుదిరిన కొత్త వాణిజ్య ఒప్పందంపై నెలకొన్న తీవ్రమైన అసంతృప్తే దీనికి కారణంగా భావిస్తున్నారు. దీనికి తోడు బలహీనంగా వున్న ఆర్థిక గణాంకాలు కూడా మరికొంత భయాన్ని జోడించాయి. జులై మాసంలో 52.7గా వున్న జ్యూ ఎకనామిక్ సెంటిమెంట్ ఇండెక్స్ ఆగస్టులో 34.7కి పడిపోయింది. జర్మనీలోని ప్రధాన ఆర్థిక పరిశోధనా సంస్థల్లో ఒకటైన 'జ్యూ' ఈ సర్వే నిర్వహించింది. ఈ సర్వే నివేదిక విడుదల సందర్భంగా జ్యూ అధ్యక్షులు అచిమ్ వాంబక్ మాట్లాడుతూ ఇయు-యుఎస్ వాణిజ్య ఒప్పందం ప్రకటించగానే ఆర్థిక మార్కెట్ నిపుణులు చాలా నిరాశ చెందారని తెలిపారు. ఈ కొత్త వాణిజ్య ఒప్పందం పెట్టుబడిదారుల అంచనాలను, ఆశలను తీవ్రంగా దెబ్బతీసిందన్నారు. ముఖ్యంగా రసాయనాలు, ఫార్మాస్యూటికల్ రంగాల్లో పరిస్థితి దారుణంగా వుందన్నారు. దీంతో పాటు మెకానికల్ ఇంజనీరింగ్, లోహాలు, ఆటోమోటివ్ పరిశ్రమల్లో కూడా పరిస్థితులు అలానే వున్నాయి. టారిఫ్‌లు తప్పించుకునేందుకు ముందుగానే కొనుగోలు చేయడంతో అమెరికా డిమాండ్ సన్నగిల్లినట్లు సర్వేలో తేలిందన్నారు. ఆ కారణంగా రెండో త్రైమాసికంలో జర్మనీ ఆర్థిక వ్యవస్థ కూడా 0.1 శాతం సంకోచించినట్లు పేర్కొన్నారు.

జస్టిస్ వర్మపై అభిశంసన తీర్మానానికి లోక్‌సభ స్పీకర్ సమ్మతి

న్యూఢిల్లీ : అలహాబాద్ హైకోర్టు జడ్జి యశ్వంత్ వర్మపై అభిశంసన తీర్మానానికి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా మంగళవారం సమ్మతించారు. ఈ తీర్మానంపై 146 మంది ఎంపిలు సంతకం చేశారు. అయితే జస్టిస్ వర్మ ఎదుర్కొంటున్న అభియోగాలపై దర్యాప్తు చేయడానికి ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీని స్పీకర్ నియమించారు. ఈ కమిటీ నివేదిక సమర్పించిన తరువాత తీర్మానంపై నిర్ణయం తీసుకుంటామని స్పీకర్ తెలిపారు. త్రిసభ్య కమిటీలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్, మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మణిందర్ మోహన్ శ్రీవాస్తవ, కర్ణాటక హైకోర్టు సీనియర్ న్యాయవాది బివి ఆచార్య సభ్యులుగా ఉన్నారు. ఈ ఏడాది మార్చి 14న ఢిల్లీ హైకోర్టు జడ్జిగా ఉన్న సమయంలో జస్టిస్ వర్మ నివాసంలో భారీగా నోట్ల కట్టలు బయటపడటం దేశవ్యాప్తంగా కలకలం రేగిన సంగతి తెలిసిందే.

జలాల విషయంలో తలొగ్గం


- యుద్ధ వాతావరణం సృష్టిస్తున్న భారత్
- బిల్వాల్ భుట్టో వ్యాఖ్యలు



ఇస్లామాబాద్ : సింధు నదీ జలాల విషయంలో తాము తలొగ్గే ప్రశ్నే ఉత్పన్నం కాదని పాకిస్థాన్ మాజీ విదేశాంగ శాఖ మంత్రి బిల్వాల్ భుట్టో అన్నారు. భారత్ ఈ విషయంలో యుద్ధ వాతావరణం సృష్టిస్తోందని ఆయన నోరుపారేసుకున్నారు. సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ నిలుపుచేసిన నేపథ్యంలో బిల్వాల్ భుట్టో స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. తమ దేశానికి భారత్ తీవ్ర నష్టాన్ని కలిగిస్తోందన్నారు. 'ఇప్పుడు యుద్ధం ఆరంభమైంది. ఇక వెనక్కి వెళ్ళేది లేదు. తలవంచేది లేదు' అని బిల్వాల్ పేర్కొన్నారు. సింధు నదీ జలాల ఒప్పందంపై ఈ తరహా వైఖరి తీసుకుంటే పాకిస్తాన్‌లోని ప్రతి రాష్ట్ర ప్రజలు భారత్‌తో ఘర్షణ పడేందుకు సిద్ధంగా వున్నారని అన్నారు. ఇటీవల ఫ్లోరిడాలో పర్యటన సందర్భంగా పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ మాట్లాడుతూ, పాకిస్తాన్ అణు దేశమన్న విషయాన్ని గుర్తించాలన్నారు. తీవ్రమైన ముప్పును పాక్ ఎదుర్కొంటోందని భావించిన పక్షంలో దారుణమైన చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడబోమని ఆయన హెచ్చరించారు. ఆ నేపథ్యంలో బిల్వాల్ భుట్టో వ్యాఖ్యలు వెలువడ్డాయి. మునీర్ వ్యాఖ్యలను భారత్ ఇప్పటికే ఖండించింది.



స్వేచ్ఛ - స్వాతంత్య్రం



మనవడు వినయ్‌ని బడికి తీసుకెళుతూ 'ఈ రోజు విశేషమేంటి?' అని అడిగారు రాజారాం.

"ఏముంది తాతయ్యా! ఈ రోజు స్వాతంత్య్ర దినోత్సవం. బళ్ళో మిఠాయిలు పంచిపెడతారు" అన్నాడు వినయ్. 'స్వాతంత్య్రం అంటే ఏమిటో నీకు తెలుసా?' అని అడిగితే 'నాకు తెలియదు తాతయ్య నువ్వు చెప్పు' అని తిరిగి ప్రశ్నించాడు వినయ్.

'మన దేశానికి బ్రిటిష్ వారు వ్యాపార నిమిత్తం వచ్చి దేశాన్ని ఆక్రమించుకొన్నారు. భారతీయుల స్వేచ్ఛని హరించారు. దీంతో భారతీయులంతా ఏకమై స్వాతంత్య్రం కోసం పోరాడారు. ప్రాణాలు అర్పించారు. గాంధీ, నెహ్రూ, భగత్‌సింగ్, పటేల్, నేతాజీ వంటి అనేకమంది స్వాతంత్య్రం కోసం పోరాడిన వారిలో ఉన్నారు. వారందరి త్యాగ ఫలితంగా 1947 ఆగస్ట్ 15వ తేదీన మనకి స్వాతంత్య్రం వచ్చింది. ఆ రోజున బ్రిటిష్ వారు మన దేశాన్ని విడిచి వెళ్ళారు. అప్పటినుంచి మనం స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటూ మన దేశాన్ని మనమే పరిపాలించుకుంటున్నాం' అని ముగించారు రాజారాం.

'స్వేచ్ఛని హరించడం, అలాగే స్వేచ్ఛగా ఉండటం అంటే ఏమిటి తాతయ్య?' అని ప్రశ్నించాడు వినయ్.

'నీకు బాగా అర్థమయ్యేలా చెప్తాను. ఈ రోజు బడికి రోజూ కంటే ముందుగా బయలుదేరదాం సరేనా' అనడంతో వినయ్ త్వరగా రెడీ అయి స్కూలుకి సిద్ధమయ్యాడు.

వెళ్లే దారిలో ఒక ఇంటి ముందు ఆపి ఆ ఇంటి వసారాలో వేలాడదీసిన పంజరంలో చిలుకను చూపిస్తూ 'చూసావా, ఈ పంజరంలో చిలుకని. అది పంజరంలో బందీగా ఉండటంతో మిగతా చిలుకల్లా స్వేచ్ఛగా తిరగలేదు. అదే స్వేచ్ఛని హరించడం అంటే. ఇంకొంత దూరం తీసుకువెళ్ళి ఒక పొలం దగ్గర ఆపి 'చూడు! ఆ లేగదూడని. ఎలా చెంగు చెంగున గంతులేస్తూ తన అమ్మ దగ్గర కాసేపు పాలు తాగుతూ కాసేపు పొలం అంతా స్వేచ్ఛగా తిరుగుతుందో' ఇప్పుడు అర్థమయిందా వినయ్! స్వేచ్ఛని హరించడం అలాగే స్వేచ్ఛగా ఉండటం అంటే' అని అడిగారు తాతయ్య.

'ఓ! చక్కగా అర్థమైంది తాతయ్యా! మన వాళ్ళందరూ స్వాతంత్య్రం కోసం ఎందుకు పోరాడారో నాకిప్పుడు తెలిసింది' అని తాతయ్యకి వీడ్కోలు చెప్పి వినయ్ బడిలోకి వెళ్లాడు.

- కొమ్ముల వెంకట సూర్యనారాయణ,
రాజమహేంద్రవరం.

పంద్రాగస్టు

పంద్రాగస్టు భరతభూమికి స్వేచ్ఛాదినం
భారత జాతికి పర్వదినం
మువ్వన్నెల జెండా ఘనంగా ఎగిరిన దినం
దేశం సర్వస్వాతంత్య్రం పొందిన దినం

నాటి సమరయోధుల పోరాట బలం
బ్రిటీష్ పాలకులపై తిరుగులేని విజయం
పరాయి పాలనకు చరమగీతం
స్వదేశీ పాలనకు శ్రీకారం



భిన్నత్వంలో ఏకత్వం
సర్వమత సమ్మేళనం
సమైక్య జాతీయతా భావం
స్వతంత్ర భారతావని ధ్యేయం

బాలల్లారా..భావి భారత పౌరుల్లారా!
జాతి భావి పథ నిర్దేశకుల్లారా!

నాటి త్యాగధనుల స్ఫూర్తిని మరువకండి
విద్యా బుద్ధులతో ఉన్నతంగా ఎదగండి
దేశభక్తితో ఉత్తమ పౌరులుగా మెలగండి ...

– పి.వి.ప్రసాద్, 94401 76824.

నేను గీసిన బొమ్మ





కెంగార మనోజ్ఞ మహాదేవి,
ఇంటర్మీడియట్,
ఎస్ ఆర్ కాలేజి,
కర్నూలు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

జీవన సౌరభం

ప్రవర్తన అద్దం లాంటిది.
ప్రతి వ్యక్తి ప్రతిబింబం
దానిలో కనిపిస్తుంది.

మీ కోసం

బాగా మంటగా ఉన్న
పచ్చి మిరపకాయలను ఫ్రిజ్ నుంచి
తీసి చల్లటి నీటిలో కాసేపు ఉంచితే
కారం తగ్గుతుంది.



JEEVANA
జీవన the family

పిల్లల ఎదుగుదలకు చిరుధాన్యాలు దోహదం

పిల్లలు ఎదిగే క్రమంలో సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉండాలన్నా...వయసును బట్టి బరువు పెరగాలన్నా వారికి పౌష్టికాహారం ఎంతో ముఖ్యం. పిల్లలు పుట్టిన దగ్గర నుంచి పెరుగుతున్న వయసుకు అనుగుణంగా సమపాళ్లలో అందిస్తే పిల్లలు చక్కగా, ఆరోగ్యంగా పెరుగుతారు. చిరుధాన్యాల్లో అలాంటి పోషకాహార లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. చిరు ధాన్యాలనగానే చాలామందికి జొన్న రొట్టెలు, రాగి సంకటి, రాగి ముద్ద వంటివే గుర్తుకొస్తాయి. కానీ వీటితో ఇవే కాదు. అన్నం, ఇడ్లీలు, దోసెలు, పిండివంటలు, మిఠాయిలు, పండగ స్పెషల్ వంటలు...ఇలా దాదాపు మన ఇంట్లో తినే అన్ని రకాల పదార్థాలూ చిరుధాన్యాలతో చేసుకోవచ్చు. అందువల్ల తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి పోషకాహారాన్ని అందిస్తే వారు చక్కగా ఎదుగుతారు.



చిరు ధాన్యాలు పిల్లల ఎదుగుదలకు ఎంతగానో దోహదపడతాయి. ఎన్నో వ్యాధులకు ఇవి దివ్యౌషధంగా పనిచేస్తాయి. చిరు ధాన్యాల్లో ప్రొటీన్, ఫైబర్, కాల్షియం, ఐరన్, విటమిన్లు వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అవే కాకుండా యాంటీ ఆక్సిడెంట్లు, అమైనో ఆమ్లాలు, పీచు పదార్థాలు అధికంగా ఉంటాయి. ఇవి ఆహారంగా తీసుకుంటే శరీరానికి కావాల్సిన పోషకాలన్నీ లభిస్తాయి. చిరు ధాన్యాలనే చిరు లేదా సిరి (తృణ, మిల్లెట్స్(ఇంగ్లీష్)లో పిలుస్తారు. మన దేశంలో ప్రధానంగా జొన్నలు, సజ్జలు, రాగులు, బజ్రా, బుక్వీట్ తదితర ధాన్యాలు మిల్లెట్స్ కిందకు వస్తాయి. ముఖ్యంగా ఎదిగే వయస్సున్న పిల్లలకు చిరు ధాన్యాలను అందించటం వల్ల పోషకాహార లోపం తొలగించొచ్చు. శారీరక ఎదుగుదల వేగంగా ఉండే అవకాశాలు ఉంటాయి. ఇటీవల కాలంలో చాలామంది పిల్లలు పోషకాహార లోపంతో బాధ పడుతున్నారు. అలాంటి పిల్లలకు బియ్యంతో వండిన అన్నాన్ని తగ్గించి కొంతమేర చిరు ధాన్యాలతో తయారుచేసిన ఆహార పదార్థాలను అందించటం వల్ల పోషకాహార లోపాన్ని తగ్గించొచ్చు.



ఎంతోమేలు ..

తృణ ధాన్యాలను ఆహారంగా తీసుకుంటే రక్తంలో గ్లూకోజ్ శాతం తగ్గుముఖం పడుతుంది. మధుమేహ వ్యాధి నియంత్రణలో ఉంటుంది. క్రమంగా ఆరోగ్యం మెరుగుపడుతుంది. వీటిల్లో కాల్షియం అధికంగా ఉంటుంది. దీనివల్ల దంతాలు, ఎముకలు గట్టిపడతాయి. వీటిలో ఉండే పీసు పదార్థం అధికంగా ఉండటం వల్ల వాటిని తింటే కిడ్నీలో, పిత్తాశయంలో రాళ్ల రావటం వంటి సమస్యలు తగ్గుతాయి. యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండటం వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. కొవ్వులు తగ్గుతాయి. అసిడిటీ ఉన్న వారు వీటిని తినటం వల్ల చాలా మేలు జరుగుతుంది.

పిల్లలకు మంచి ఆహారం

కొర్రలు, సామలు, అరికెలు, ఊదలు, సజ్జలు, రాగులు, వరిగలు, జొన్నలు వంటి ధాన్యాలు అన్ని ప్రాంతాల్లో నేడు అందుబాటులో ఉంటున్నాయి. చాలామందికి సరైన అవగాహన లేకపోవటం వల్ల తినేందుకు పెద్దగా ఆసక్తి చూపటం లేదు. వీటిలో ఎలర్జీ కలిగించే గుణం ఉండదు. అందువల్ల చిన్న పిల్లలు కూడా తినొచ్చు. ఊబకాయం, క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులున్న వారు వీటిని రోజూ తింటే మంచిది. తక్కువ తినగానే పొట్ట నిండుగా అనిపించటం వల్ల ఊబకాయం కూడా తగ్గుతుంది. క్యాన్సర్ భారిన పడకుండా మనల్ని కాపాడతాయి.

పోషకాహారం అందేలా చూడాలి

బిడ్డ పుట్టిన తరువాత మొదటి ఆరు నెలలపాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి. ఇవి పిల్లల్లో రోగనిరోధక శక్తిని పెంపొందించేదుకు దోహదం చేస్తుంది. తల్లిపాలు సులభంగా జీర్ణమౌతాయి కూడా. ఎన్నో పోషక విలువలను కలిగి ఉంటాయి. ఆరు నెలల తరువాత తల్లిపాలకు సెమి సాలిడ్ ఫుడ్స్‌ను జతచేసి తాగిస్తే ఎదుగుదల



ఉంటుంది. అరటి పండును పిల్లలకు విధిగా తినిపించాలి. ఉడికించిన కేరళ అరటిపండ్లను పిల్లలకు తినిపించటం ద్వారా దానిలో ఉండే పొటాషియం, విటమిన్ సి, విటమిన్ బి6, కార్బోహైడ్రేడ్లు పుష్కలంగా లభిస్తాయి. ఇది శిశువు బరువు పెరగటంలో కీలకంగా పనిచేస్తుంది. మంచి ఫలితం ఉంటుంది.

పీచు పదార్థాలు ఎక్కువగా ఉండేలా చూడాలి

పిల్లల నుంచి పెద్దల వరకూ ఏ వయస్సు వారికైనా పోషకాహారం ఎంతో ఉత్తమమైనది. పోషకాహారం శరీరానికి అందించకపోతే ఎదుగుదలలో లోపం ఏర్పడుతుంది. తద్వారా పిల్లలు చురుగ్గా ఉండలేరు. అందుకే పిల్లలకు సులభంగా జీర్ణమయ్యే పోషకాహారాన్ని అందించాలి. చిరుధాన్యాలు వంటివి పిల్లలకు పెడితే అవి సులభంగా జీర్ణమవుతాయి. చిరు ధాన్యాలను పిల్లల దగ్గర నుంచి వృద్ధుల వరకూ ఏ వయస్సు వారైనా తినొచ్చు. చిన్న పిల్లలకు వీటిని ఇచ్చేటప్పుడు పీచు ఎక్కువగా లేకుండా చూసుకోవాలి. పీచు ఎక్కువగా ఉంటే మాంసకృత్తులు, పిండి పదార్థాలు అంతగా అందవు. వీరికి పొడుల రూపంలో (మాల్ట్) ఇవ్వటం ఉత్తమం. చిరు ధాన్యాలను ఆరేడు గంటలసేపు నానబెట్టి రాత్రంతా బట్టలో మూటగడితే తెల్లారేసరికల్లా మొలకలు వస్తాయి. వీటిని నీడలో ఆరబెట్టి దోరగా వేయించి పొడి చేసుకోవాలి. ఈ పొడిని పాలలో కలిపి పిల్లలకు ఇస్తే తేలికగా జీర్ణం అవుతుంది. ఇందులో పప్పుల పొడి కలిపితే ఇంకా మంచిది. నాలుగు వంతుల మాల్ట్‌కు ఒక వంతు వేయించిన పెసరపప్పు లేదా శరగపప్పు పొడిని కలపాలి. దీనికి గరిటెడు వేయించి పొడిచేసిన పల్లీలు గానీ లేదా నువ్వులు కానీ జోడించాలి. ఇందులోనే తగినంత బెల్లం లేదా చక్కెర కలిపితే అనుబంధ ఆహారంగా ఉపయోగపడుతుంది. దీన్ని ఎప్పుడంటే అప్పుడు వేడి నీళ్లలోగానీ, పాలల్లో గానీ కలిపి పిల్లలకు ఇవ్వొచ్చు. తియ్యగానే ఉంటుంది. అందువల్ల పిల్లలు ఇష్టంగానే తాగుతారు.

చిరుధాన్యాలను అలవాటుచేయాలి

క్యాల్షియం, ఐరన్, మాంసకృత్తులు వంటివన్నీ లభించటం వల్ల జబ్బుల నుంచి కోలుకుంటున్న వారికి, ఘనాహారం తీసుకోలేని వారికీ ఈ మిశ్రమం మేలు చేస్తుంది. బడికి వెళ్లే పిల్లలకు చిరుధాన్యాలతో దోశలు, చపాతీలు, అటుకుల ఉప్మా వంటివి చేసి లంచ్‌బాక్స్‌లో పెట్టి ఇవ్వొచ్చు. బిర్యానీలు, చిత్రాన్నాలు చేసి పెట్టొచ్చు. పెద్దవారిలోనే కాదు. ఇప్పుడు చిన్న పిల్లల్లోనూ ఊబకాయం ఎక్కువగా కనిపిస్తోంది. అందువల్ల పిల్లలకు చిన్నప్పటి నుంచే చిరుధాన్యాలను అలవాటు చేస్తే పెద్దయ్యాక తినటం అలవడుతుంది.

- జొన్నలు, సజ్జలు, కొర్రలు, రాగుల్లో పోషకాలు పుష్కలం.
- బియ్యంలో కన్నా చిరుధాన్యాల్లో మాంసకృత్తులు దాదాపు రెట్టింపు స్థాయిలో ఉంటాయి.
- ఎక్కువ సమయం ఆకలేయకుండా, ఇతర చిరు తిండ్లవైపు మనసు మళ్లకుండా జాగ్రత్తపడొచ్చు
- బరువును అదుపులో ఉంచుకోవచ్చు

చిరుధాన్యాలను పొట్టు తీయకుండానే తీసుకుంటేనే థయమిన్, రైబోఫ్లేవిన్, నియాసిన్ 'బి' విటమిన్లు శరీరానికి అందుతాయి.

- పాలల్లో కన్నా రాగుల్లో క్యాల్షియం, ఇనుము చాలా ఎక్కువ.
- సజ్జలు, కొర్రల్లో ఇనుము ఎక్కువగా ఉంటుంది.
- గర్భిణులకు అత్యవసరమైన ఫోలిక్ యాసిడ్ సజ్జల నుంచి బాగా లభిస్తుంది.
- చిరుధాన్యాల్లో పీచు మోతాదు ఎక్కువగా ఉండటం వల్ల పెద్దపేగు క్యాన్సర్ ముప్పును తగ్గించుకోవచ్చు. చిరుధాన్యాలన్నీ వేర్వేరు రంగుల్లో ఉంటాయి.
- చిరుధాన్యాల నుంచి యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా లభిస్తాయి.

నేడు కీలక సమావేశం

ఐక్యంగా కార్మికులు.. షరతులతో నిర్మాతలు



తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఆలిండియా ఫిలిం ఎంప్లాయీస్ కాన్ఫెడరేషన్–యుఎన్ఐ–ఎంఇఐ అనుబంధం) ఆధ్వర్యంలో ఈనెల నాల్గో తేదీ నుంచి సినీ కార్మికులు ఆందోళన బాట పట్టారు. టాలీవుడ్ లోని 24 క్రాఫ్ట్‌ల పరిధిలో పనిచేసే కార్మికులందరి వేతనాలను గతంలో చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం 30 శాతం పెంచాలనే డిమాండ్ మేరకు ఫెడరేషన్ అధ్యక్షులు అనిల్‌కుమార్ వల్లభనేని, ప్రధాన కార్యదర్శి అమ్మిరాజు కులిమిల్లి, కోశాధికారి టి.వి.అలెగ్జాండర్ (అలెక్స్) ఈ ఆందోళనకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. సిఐటియు తెలంగాణా రాష్ట్ర కమిటీ కూడా ఇప్పటికే సంఘీభావం ప్రకటించింది. కొన్ని క్రాఫ్ట్‌ల కార్మికులకే వేతనాలు పెంచుతామనీ, మిగతా క్రాఫ్ట్‌ల్లో ఇప్పుడు పనిచేస్తున్న వారు కాకుండా తమకు నచ్చిన వారిని తెచ్చుకుని పని చేయించుకుంటామంటూ నిర్మాతల మండలి షరతులు పెడుతోంది. కార్మికుల ఐక్యతను దెబ్బతీసే విధంగా ఈషరతులు ఉన్నాయని తీవ్రమైన విమర్శలు వచ్చాయి. తమ ప్రతిపాదనలను అంగీకరిస్తేనే పెంపుదల ఉంటుందనీ, లేకపోతే లేదనీ, మరీ ఎక్కువగా మాట్లాడితే ఉన్న వేతనాల్లో 25 శాతం కోత పెడతామని నిర్మాతల మండలి తరపున ప్రతినిధులు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి.

నేడు కీలకభేటీ : నిర్మాతలు, సినీ కార్మికులు పట్టువిడుపులతో ఉండాలనీ, వేతనాలకు సంబంధించి ప్రత్యేకమైన ఓ కమిటీని ఏర్పాటు చేసుకుని సమస్యని పరిష్కరించుకోవాలని తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కందుల దుర్గేష్ ఇప్పటికే సూచించారు. చిరంజీవి, బాలకృష్ణ, పవన్‌కళ్యాణ్ వంటి వారు కూడా దాదాపుగా ఇదే సూచన చేశారు. వేతనాల పెంపు, పని పరిస్థితులపై చర్చించేందుకు బుధవారం మధ్యాహ్నం 3గంటలకు హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌లోని తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో సమావేశం జరగనుంది. 'బుధవారం జరిగే సమావేశంలో అందరికీ న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నాం. చిన్న నిర్మాతల గురించి, వర్కింగ్ కండీషన్స్‌పై కూడా మేము మాట్లాడతాం. సమస్యలకు ఒక పరిష్కారం లభిస్తుందని నమ్ముతున్నా. సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌ను సినిమా హబ్ మార్చాలనుకుంటున్నారని మంత్రి కోమటిరెడ్డి మాతో అన్నారు. చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఆ దిశగానే ఈ చర్చలు జరుపుతాం' ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ వల్లభనేని చెప్పుకొచ్చారు.

'ఉస్తాద్ భగత్‌సింగ్'తోనే ఆజ్యం : సినీనటుడు, ఎపి డిప్యూటీ సిఎం హోదాలో ఉన్న పవన్ కళ్యాణ్ నటిస్తున్న సినిమా 'ఉస్తాద్‌భగత్‌సింగ్' షూటింగ్‌కు ఇతర రాష్ట్రాల నుంచి వలస కార్మికులను రప్పించటంపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. మైత్రీ మూవీస్ బ్యానర్‌పై ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. ఈ విషయాన్ని తెలుసుకున్న కార్మికులు జూబ్లీహిల్స్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్ ఎదుట ధర్నా కూడా చేశారు. బాలకృష్ణ నటిస్తున్న 'అఖండ 2', ప్రభాస్ నటిస్తున్న 'రాజాసాబ్' సినిమాలపైన కార్మికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఓ వైపు కార్మికుల ఆందోళన కొనసాగుతుండగా, మరోవైపు సినిమాల షూటింగ్‌లకు బయట వ్యక్తులను ఎట్లా రప్పిస్తారంటూ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి అమ్మిరాజు నిర్మాతల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాత విశ్వప్రసాద్ అక్రమ కేసులు బనాయించటం దుర్మార్గమని ఖండించారు. ఆర్టిస్టుల కాల్షీట్లు ఇప్పుడు పోతే దొరకవు అంటూ ఇంకా మైత్రీమూవీస్ సంస్థ షూటింగ్‌ను కొనసాగిస్తూనే ఉంది. కొన్ని స్టూడియోలు, ఔట్‌డోర్ యూనిట్లు, మౌలిక వసతుల యూనిట్ సభ్యులు దొడ్డిదారిన షూటింగ్‌లు నిర్వహిస్తూనే ఉన్నారు. సినీ రంగంలో పనిచేసే ఆయా క్రాఫ్ట్‌లను బట్టి కార్మికులు ఆయా సంఘాల్లో నమోదైన వారికి షూటింగ్ పనుల కేటాయింపు ఉంటుంది. అది అన్ని క్రాఫ్ట్‌ల్లోనూ దశాబ్దాల తరబడి కొనసాగుతోంది.'గుర్తింపుకార్డులు, యూనియన్లతో సంబంధం లేకుండా కార్మికులతో వర్క్ చేయించుకుంటాం' అంటూ నిర్మాతల మండలి కొత్త వాదన ముందు తెస్తోంది.

తేలాల్చిన అంశాలివే...: 24 క్రాఫ్ట్‌ల్లో పనిచేసే కార్మికుల వేతనాలు 30 శాతం పెంచాలనేది ఫెడరేషన్ డిమాండ్. 'ఫ్లెక్సిబుల్ కాల్షీట్లు పేరుతో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పనివిధానం. నిపుణులు లేకపోతే నాన్‌మెంబర్స్‌తో పనులు..సెకండ్ సండే.. పబ్లిక్ హాలీడేస్‌లో డబుల్ కాల్షీట్లు. మిగిలిన ఆదివారాల్లో సింగిల్ కాల్షీట్‌గానే పరిగణన పరిగణన' పేరుతో కార్మికులను కట్టుబానిసలుగా మార్చేలా నిర్మాతల మండలి ప్రతిపాదనలు ఉన్నాయి. 'మేము ఐక్యంగానే ఉన్నాం. అన్ని క్రాఫ్ట్‌ల కార్మికుల వేతనాలు పెంచితేనే ఆందోళన ఆపుతాం' అంటూ ఫెడరేషన్ ప్రతినిధులు స్పష్టం చేస్తున్నారు. పెంచిన వేతనాలు కూడా ఏరోజుకారోజు చెల్లింపులు చేసేలా ఉండాలి' అని కోరుతున్నారు.

డబ్బుతో ఆయనని కొనలేం..



'ఆర్ నారాయణ మూర్తి మాదిరి రాజీ లేకుండా బతకడం నా వల్ల కాదు. నేను చాలాసార్లు రాజీపడ్డాను. నారాయణమూర్తిని చూస్తే నాకు కొంచెం ఈర్ష్య కూడా ఉంటుంది' అన్నారు ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్. ఆర్ నారాయణమూర్తి హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'యూనివర్సిటీ పేపర్ లీక్'. ఆగస్ట్ 22న ఈ చిత్రం విడుదల కాబోతుంది. ఈ నేపథ్యంలో తాజాగా ప్రసాద్ ల్యాబ్‌లో వేసిన స్పెషల్ షోని త్రివిక్రమ్ చూశారు. ఆ తరువాత ఆయన మాట్లాడుతూ.. 'ఈ సినిమా నిడివి (2 గంటలు) చూసి కాస్త భయపడ్డాను. కానీ సినిమా స్టార్ట్ అయ్యాక.. అసలు సమయమే తెలియలేదు. ప్రారంభం నుంచి చివరి వరకు వేగంగా సాగింది. ఈ సినిమాలో చూపించిన అంశాలు తక్షణమే ఉత్తేజపరచవు. అయినప్పటికీ సినిమా పట్టువిడవకుండా నడిపించారాయన. నిజాయితీతో పని చేశారు. దాన్ని ఎవరూ ప్రశ్నించలేరు. అది ఆయన సొంతం. దాని కోసమే నేను వచ్చా. ఓ సినిమాలోని పాత్రకు నారాయణ మూర్తిని అనుకున్నా. కానీ రెమ్యునరేషన్‌తో ఆయన్ని కొనలేం అని ఎవరో చెప్పారు. ఆయనలా బతకడం అందరికి సాధ్యం కాదు. నారాయణ మూర్తి వన్‌మ్యాన్ ఆర్మీ. ఆయన చిత్రాల్లో ఆయనే రాజు, ఆయనే సైన్యాధిపతి. ప్రతి సినిమాలోనూ ఏదో ఒక ప్రయోజనం ఉండాలనుకుంటారు. అణచివేతకు గురైన వారి తరపున మాట్లాడేందుకు ఒక గొంతుక ఉంది. అది అందరికీ వినపడాలి. అది మనకు నచ్చొచ్చు.. నచ్చకపోవచ్చు. కానీ, ఇలాంటి వారు మాట్లాల్సిన అవసరం ఉంది. లేదంటే ప్రపంచంలో ఏక పక్ష ధోరణి నెలకొంటుంది' అని త్రివిక్రమ్ అన్నారు.

ఉత్కంఠ పోరులో అమరావతి రాయల్స్ గెలుపు



ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఆంధ్ర ప్రీమియర్ లీగ్ సీజన్–4లో భాగంగా మంగళవారం విశాఖలోని ఎసిఎ–విడిసిఎ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో భీమవరం బుల్స్ జట్టుపై అమరావతి రాయల్స్ జట్టు మూడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భీమవరం బుల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 191 పరుగులు చేయగా.. అనంతరం అమరావతి రాయల్స్ మరో రెండు బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన భీమవరం బుల్స్ జట్టులో నిమ్మల హిమకర్ 44 బంతుల్లో 6 సిక్సులు, 6 ఫోర్లతో 81 పరుగులు, వికెట్ కీపర్ రేవంత్ రెడ్డి 50 బంతుల్లో 3 సిక్స్‌లు, 3 ఫోర్లతో 69 పరుగులతో రాణించారు. వీరు తొలి వికెట్‌కు 81 బంతుల్లో 131 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని అందించారు. అమరావతి రాయల్స్ బౌలర్లలో బి.అయ్యప్ప, సంతోష్ కుమార్, బి.వినయ్ కుమార్, టి.అచ్యుత్ కుమార్‌లు ఒక్కొక్క వికెట్ తీశారు. అనంతరం 192 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన అమరావతి రాయల్స్ జట్టు బ్యాటర్లు హనుమ విహారి, ఎస్‌వి.రాహుల్ 36 బంతుల్లో 69 భాగస్వామ్యంతో శుభారంభాన్ని అందించగా చివరిలో 7వ వికెట్‌కు ఎ.వెంకట విజయ్, పెన్మత్స పాండురంగరాజు 23 బంతుల్లో 37 పరుగులు, 8వ వికెట్‌కు ఆకుల వెంకట విజయ్, బండారు అయ్యప్పలు 19 బంతుల్లో 43 పరుగుల కీలక భాగస్వామ్యాలను నమోదు చేసి జట్టును విజయతీరాలకు చేర్చారు. అమరావతి రాయల్స్ జట్టులో ఎస్.వెంకట రాహుల్ 25 బంతులలో 5 సిక్స్‌లు, 3 ఫోర్లతో 52 పరుగులు సాధించగా హనుమ విహారి 24 బంతుల్లో ఒక సిక్స్, 5 ఫోర్లతో 37 పరుగులు, ఆకుల వెంకట విజయ్ 27 బంతులలో ఒక సిక్స్, నాలుగు ఫోర్లతో 36 పరుగులు, బండారు అయ్యప్ప 10 బంతుల్లో 3 సిక్స్‌లు, ఒక ఫోర్‌తో 26 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. భీమవరం బుల్స్ బౌలర్లు పి.తేజస్వి 4 ఓవర్లలో 23 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీయగా, సత్యనారాయణరాజు, తోట శరన్, హరిశంకర్ రెడ్డి ఒక్కొక్క వికెట్టు తీసుకున్నారు అమరావతి రాయల్స్ జట్టులో నిలకడగా రాణించి 52 పరుగులు సాధించిన శ్రీరామ్ వెంకట రాహుల్ కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

ఐసిసి 'ప్లేయర్ ఆఫ్ ది మంత్'గా గిల్

నాల్గోసారి అవార్డు కైవసం



దుబాయ్: ఇంగ్లండ్ పర్యటనలో పరుగుల వరద పారించిన టీమిండియా టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలి ఐసిసి అవార్డు అందుకున్నాడు. అండర్సన్–టెండూల్కర్ ట్రోఫీలో సారథిగా జట్టును ముందుండి నడిపించిన గిల్.. ఐసిసి 'ప్లేయర్ ఆఫ్ ది మంత్'గా ఎంపికయ్యాడు. జూలై నెలకుగానూ అతడు ఈ అవార్డును కైవసం చేసుకున్నాడు. ఈ క్రమంలో అతడు బెన్ స్టోక్స్, దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ వియాన్ మల్డర్ కంటే అత్యధిక ఓట్లతో విజేతగా నిలిచాడు. గిల్ ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు గెలుపొందం ఇది నాలుగోసారి. పురుషుల క్రికెట్‌లో మరెవరూ ఇన్నిసార్లు ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు అందుకోలేదు. 'జూలై నెలకు ఐసిసి ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డుకు ఎంపికవ్వడం గొప్పగా ఉంది. బర్మింగ్‌హామ్‌లో సాధించిన ద్విశతకాన్ని కలకాలం గుర్తించుకుంటా' అని గిల్ వెల్లడించాడు. సీనియర్ల గైర్హాజరీలో టెస్టు జట్టు పగ్గాలు అందుకున్న గిల్ తొలి సిరీస్‌లోనూ తన తడాఖా చూపించాడు. ఒక డబుల్ సెంచరీ, రెండు సెంచరీలతో కలిపి 754 పరుగులతో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు గెలుచుకున్న సంగతి తెలిసిందే. తొలి మూడు పర్యాయాలు పరిమిత ఓవర్ల క్రికెట్‌లో విజేతగా విజేతగా నిలువగా.. ఈసారి టెస్టుల్లో 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డును సొంతం చేసుకోవడం విశేషం.

2వ స్థానంలోనే దీప్తి శర్మ : ఐసిసి టి20 మహిళల ర్యాంకింగ్స్

ఐసిసి మహిళల టి20 ర్యాంకింగ్స్‌లో భారత స్పిన్నర్ దీప్తి శర్మ సత్తా చాటింది. ఐసిసి మంగళవారం ప్రకటించిన బౌలర్ల జాబితాలో దీప్తి శర్మ 2వ స్థానానికి ఎగబాకింది. ఈ క్రమంలో టాప్‌ర్యాంక్‌కు మరింత చేరువైంది. ఇక బ్యాటర్ల జాబితాలో స్టార్ స్మృతి మంధాన 2వ ర్యాంక్‌కు పడిపోయింది. తాజా ర్యాంకింగ్స్‌లో దీప్తి శర్మ(732పాయింట్లు) పాకిస్తాన్‌కు చెందిన సదియా ఇక్బాల్‌తో సంయుక్తంగా 2వ స్థానంలో నిలువగా.. టాప్‌లో ఆస్ట్రేలియాకు చెందిన సథర్లాండ్ నిలిచింది. ఆమెకంటే దీప్తి శర్మ 4పాయింట్లు వెనుకబడి ఉంది. ఐర్లాండ్ మహిళలతో జరిగిన టి20 సిరీస్‌ను 1–2తో చేజార్చుకున్న పాకిస్తాన్.. ఆ సిరీస్‌లో కేవలం మూడు వికెట్లు మాత్రమే తీయడం ద్వారా నదియా ర్యాంకింగ్స్ టాప్ నుంచి 2వ స్థానానికి పడిపోయింది. ఇక సథర్లాండ్స్ మార్చిలో న్యూజిలాండ్‌తో జరిగిన టి20 సిరీస్ తర్వాత మైదానంలోకి అడుగుపెట్టలేదు. కానీ ర్యాంకింగ్స్‌లో ఆమె 736పాయింట్లతో అగ్రస్థానంలో నిలువడం విశేషం.

బ్రెవీస్ బాదుడే.. బాదుడు...

56బంతుల్లో 125 పరుగులు

రెండో టి20లో ఆసీస్‌పై దక్షిణాఫ్రికా గెలుపు



డ్రావిన్(ఆస్ట్రేలియా): నిర్ణయాత్మక రెండో టి20లో దక్షిణాఫ్రికా జట్టు సత్తా చాటింది. యువ బ్యాటర్ బ్రెవీస్ అజేయ సెంచరీతో చెలరేగడంతో దక్షిణాఫ్రికా జట్టు 53పరుగుల తేడాతో ఆస్ట్రేలియాపై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికాను ఓపెనర్లు నిరాశపరిచినా.. బ్రెవీస్(125; 56బంతుల్లో 12ఫోర్లు, 8సిక్సర్లు)కి తోడు స్టబ్స్(31) బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో దక్షిణాఫ్రికా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 218పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఆసీస్ బౌలర్లు మ్యాక్స్‌వెల్, డార్షియస్ రెండేసి వికెట్లకు తోడు హేజిల్‌వుడ్, జంపా ఒక్కో వికెట్‌తో రాణించారు. అనంతరం ఆసీస్ జట్టులో టిమ్ డేవిడ్(50), క్యారీ(26), మార్ష్2(22) రాణించినా.. 17.4ఓవర్లలో 165పరుగులకే కుప్పకూలింది. దక్షిణాఫ్రికా బౌలర్లు మాకా, బోట్చ్‌కు మూడేసి, రబడా, మార్క్రమ్, ఎన్గిడి, పేటెర్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ బ్రెవీస్‌కు దక్కింది. దీంతో మూడు టి20ల సిరీస్‌లో ఇరుజట్లు ఒక్కో మ్యాచ్‌ను గెలిచి 1–1తో సమంగా నిలువగా.. మూడో, చివరి టి20 శనివారం జరగనుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68